ఫిబ్రవరి & మార్చి 2022 సంచిక : 445 వెల : 25/-

ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక



జనసాహితి ప్రచురణ

భరత్ భూషణ్ వేసిన చిత్రాలు: ఇన్‌సెట్‌లో భరత్ భూషణ్



కవిత

# ఈ మధ్య గమనిస్తున్నాను

– ఎండ్లూరి సుధాకర్



ఈ మధ్య గమనిస్తున్నాను
మా అమ్మాయిలు అదోలా ఉంటున్నారు
భద్రంగా ఉన్నట్టులేరు
ఏ యువకుడు కనబడినా
ఏ వాహన శబ్దం వినబడినా
ఊరికే ఉలిక్కి పడుతున్నారు
పులిని చూసిన జింకల్లా బెదిరిపోతున్నారు
బజారుకెళ్లాలంటే భయపడుతున్నారు
కాలేజీ కెళ్లమంటే కంగారు పడుతున్నారు
కారణాలడిగితే కన్నీటి మేఘాలౌతున్నారు
ఆకాశం ప్రతిధ్వనించేలా నవ్విన వాళ్లు
గలగల గోదారిలా మాట్లాడిన వాళ్లు
సీరింకిన చలమలౌతున్నారు
మేత ముట్టని దూడల్లా
మెత్తబడుతున్నారు
ఏ దిగులు తీగలతో చిక్కుకొని
పగలూ రాత్రీ కునారిల్లుతున్నారు
రోజుకు నాలుగు సార్లు
బండితీసి చక్కర్లు కొట్టేవాళ్లు
స్నేహితుల్ని వెనకెక్కించుకొని
వీథుల్ని వీర విహారం చేసేవాళ్లు
రెండు పదుల వయసొచ్చినా
మా కంటికి రెండేళ్ల పిల్లల్లాగే కనిపిస్తారు
యవ్వనపు టెన్నిస్ కోర్టులో
సానియా మీర్జాలా
దర్జాగా ఆడుకుంటూ కనిపిస్తారు
ఇప్పుడు పెద్దగా బైటికెళ్లడం లేదు
ఇంటిపట్టునే ఉండిపోతున్నారు
వార్తలు చూస్తే చాలు
వణికి పోతున్నారు
కాలిన గొంతులు వినబడితే
కంటతడి పెడుతున్నారు
మా అమ్మాయిల్ని చూస్తే
మహా బెంగగా ఉంది
అమ్మా! ఏం కావాలో చెప్పండి
మీకేం తేవాలో అడగండని
గుచ్చి గుచ్చి ఆరాతీస్తే
గుడ్లల్లో నీళ్లు గుక్కుకుంటూ
ఇలా అన్నారు.
"నాన్నా!
మాకు యాసిడ్ ప్రూఫ్ ముఖాలు కావాలి
తెచ్చిపెట్టగలవా?!..."

45 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

445

సంపుటి : 45
సంచిక : 7, 8
ఫిబ్రవరి, మార్చి 2022

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : యుద్ధ 'నీతి' చిత్రం | – అంతర్జాలం నుండి | .....01 |
| ✦ రెండవ అట్ట | : భరత్ భూషణ్ చిత్రాలు; ఎండ్లూరి సుధాకర్ (కవిత) | | .....02 |
| ✦ మూడవ అట్ట | : కవితలు | – అదితి మునాత్; నిమ్మకాయల శ్రీరంగనాథ్ | .....43 |
| ✦ నాల్గవ అట్ట | : అనశ్వర పరమేశ్వరం (కవిత) | – రవి | .....44 |
| ✦ సంపాదకీయం | : రాజ్యమూ – రామానుజాచార్యులు | | .....05 |
| ✦ కథ | : రెండు లచ్చుల హారం | – ఎ. మన్మధరావు | .....07 |
| ✦ వ్యాసాలు | : సమత ఎక్కడ? | – డా॥ ఆర్కే | .....10 |
| | : మతద్వేష రాజకీయాలతో దేశాన్ని రోగగ్రస్తం చేస్తున్న మతతత్త్వ శక్తులు – చెలరేగుతున్న లంపెన్ సంస్కృతి | – సూర్యసాగర్ | .....21 |
| ✦ పుస్తక పరిచయం | : విక్టర్ జారా ఒక అసంపూర్ణ గీతం | – ఓవీవీయస్ | .....16 |
| | : డిజిటల్ శ్రమ – కార్ల్‌మార్క్స్ | – జి.వి. భద్రం | .....26 |
| ✦ సినిమా సమీక్ష | : 'కమ్ అండ్ సీ' | – కె. రాజశేఖరరాజు | .....23 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : గోవింద్ పండరీనాథ్ పన్సారే | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....18 |
| ✦ వ్యంగ్యం | : రివర్స్‌గేర్ (?) | – శంకరం | .....19 |
| ✦ సజీవ సాహిత్యం | : సూతపురాణం నుండి | – త్రిపురనేని రామస్వామి | .....31 |
| ✦ ఈ నెల పుస్తకం | : బాలల బొమ్మల 'అమ్మ' | | .....32 |
| ✦ కవితలు | : సత్య కలకోటి (**09**); జనజ్వాల (**25**); సరికొండ నరసింహరాజు (**40**) | | |
| ✦ వివిధ | : ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**30**); సాహిత్య, సాంస్కృతిక సామాజికాంశాలు (**37-39**) ఈ పుస్తకాలు అందాయి (**41, 42**) | | |
| ✦ శాశ్వతనిధి | : గొట్టుముక్కల సీతారామరాజు (**17**); వై.వి. రెడ్డి (**32**); కొత్తపల్లి వెంకటకృష్ణ వర్మ, కొల్లి లక్ష్మీప్రసూన (**36**); | | |
| ✦ సంతాపాలు | : ఎన్. పరమేశ్వరరావు (**15**); నాగళ్ళ గురుప్రసాదరావు (**20**); పి. చంద్రశేఖరరెడ్డి, టి.వి. నారాయణ, నక్కా ఇళయరాజా, సి. వేదవతి, బంద్రు నరసింహులు, శ్రీవిరించి (**33**); బుజ్జాయి, యెండ్లూరి సుధాకర్, భరత్ భూషణ్ (**34**); బి.వి.ఎ. రామారావు నాయుడు, నిమ్మకాయల శ్రీరంగనాథ్, కొడవటిగంటి వరూధిని, నేతి పరమేశ్వర శర్మ (**35**); ఆశావాది ప్రకాశరావు (**36**) | | |


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X
LCCN 94903393



'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
0680101004936
IFSC No. CNRB0000680
ఫోన్ : 94901 96890

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

చందాలు, విరాళాలు
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |


ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

## కృతజ్ఞతలు



ప్రగతిశీల ఉపాధ్యాయుడు, రచయిత, విద్యావేత్త, వామపక్షవాది అయిన సూర్యదేవర వెంకటనారాయణ తన 90వ ఏట హైదరాబాదులో 19-2-2021న మరణించారు. వెంకట నారాయణగారి సంస్మరణలో వారి పెద్ద కుమారుడు డా॥ జతిన్, 'ప్రజాసాహితి' ఈ సంచిక ప్రచురణకు ఆర్థిక సహాయమందించారు. వారికి ధన్యవాదములు. ✦

## కృతజ్ఞతలు



చావా కిశోర్‌బాబు గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా నగరం కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకులుగా పనిచేశారు. ఆయన ప్రమాదానికి గురై 31-3-2013న మరణించారు. వీరు గుంటూరు జిల్లా పొన్నూరులో 30-10-1960న జన్మించారు.

చావా కిశోర్‌బాబు సంస్మరణలో వారి భార్య సుప్రియ, కుమారుడు చావా వెంకటశ్రావణ్, మామగారైన యలమంచిలి మురళీధర్ (యలమంచిలి వెంకటప్పయ్య సంస్మరణ వేదిక), 'ప్రజాసాహితి' ఈ సంచిక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించారు. వారికి ధన్యవాదాలు. ✦

## సంపాదకీయం

# రాజ్యమూ - రామానుజాచార్యులు

**'దేశమంత ఘన సంపద**
**వీసమంత మాకందదు**
**ఆశపోతులంత చేరి**
**మోసుకుపోతున్నారే'**

సుబ్బారావు పాణిగ్రాహి 1960లలో పాట రాసిన నాటి నుండి ఈనాటికీ సంపదలను సృష్టించి పెడుతున్న వ్యవసాయాన్ని, కంపెనీలను, ఫ్యాక్టరీలను, గనులను, రైల్వేలను.... ఎల్ఐసిని కూడా బడ్జెట్‌లో చేర్చి బహిరంగంగా కార్పొరేట్లకు దళారీ పాలకులు దోచిపెడుతున్నారు. 'పరులకమ్మజూస్తుంటే పరువు తగులవేస్తుంటే / సహించమూ, సహించమూ / ప్రతిఘటించి తీరుతాం' అంటూ వ్యవసాయాన్ని కార్పొరేటీకరించే వ్యవసాయ వ్యతిరేక మూడు నిరంకుశ చట్టాలను ప్రతిఘటిస్తూ రైతాంగం ఢిల్లీలో ఉద్యమించింది. తమ హక్కులను కాలరాస్తూ దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. పిఆర్‌సిని రివర్సు చేసి ఉద్యోగస్థుల, ఉపాధ్యాయుల ఆదాయాలకు గండికొడుతుంటే లక్షలాదిమంది వేతన జీవులు విజయవాడలో తమ నిరసనను తెలియచేశారు. తల్లిదండ్రుల సంపాదన, ఆస్తిపాస్తులనంతా తమ చదువులకే ఖర్చుపెట్టగా, డిగ్రీలు చేతపట్టుకున్న నిరుద్యోగ యువత ఉద్యోగాల కల్పనకోసం నిరీక్షించీ, నిరీక్షించి అశాంతితో రగిలిపోతున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో రైల్వే ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిరుద్యోగ యువత చేసిన ఆందోళనలను మనం చూశాం. కరోనాపై నెపం వేస్తూ పాలకులు అనుసరించిన ప్రజావ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలపై ప్రజలు తమతమ స్థాయిలలో ఆందోళనలు చేస్తున్నారు, ఉద్యమిస్తున్నారు. ఉద్యమిస్తున్న ప్రజలందరూ కుల, మత, ప్రాంత, లింగ వివక్షలు లేకుండా సమష్టి చైతన్యంతో శ్రమైక సంస్కృతిని చాటుతున్నారు.

ఈ సమయంలో 'కులవ్యవస్థ వుండవలసిందే.... ఎవరి కుల వృత్తి వారు చేయవలసిందే' అనీ, 'ఏ జీవి మాంసం తింటే ఆ జీవి బుద్ధులు వస్తాయి' వంటి వికృతమైన హేళనాత్మక నవ్వులతో కూడిన అసమతాభావపు ప్రవచనాల చినజీయర్ స్వామివారు వేంచేశారు. ఈయన పాలకుల అండదండలతో వెయ్యి కోట్ల రూపాయల ఖర్చుతో సమతాభావ ప్రచారం కోసం అంటూ దేవుడికీ జీవుడికీ మధ్య పూజారి వ్యవస్థను సృష్టించిన విశిష్టాద్వైత సృష్టికర్త రామానుజాచార్యుల విగ్రహాన్ని బంగారంతో చేయించగా, రెండు లక్షల కిలోల ఆవునేతి హోమాలతోనూ, హంగూ, ఆర్భాటాలతో ఒక లౌకిక రాజ్యపు ప్రధానమంత్రి దానిని ఆవిష్కరించాడు. దేశాధ్యక్షుడు (దళితుడు కాబట్టి మరల గుడిని శుద్ధి చేశారనుకోండి) గవర్నరులూ, ముఖ్యమంత్రులూ ఆ ఉత్సవాలకు హాజరయ్యారు. పట్టెడు మెతుకులు దొరక్క శరీరాన్ని అమ్ముకుంటున్న ఆడబిడ్డలకు, ఆత్మహత్యలు చేసుకుంటున్న నిరుద్యోగులకు, వ్యవసాయం గిట్టుబాటు కాని రైతాంగానికి, నిరాశ్రయులై అలమటిస్తున్న అశేష ప్రజానీకపు కష్టాలకి కారణమయిన పాలకులకు ఇప్పుడు 'వెయ్యేళ్ళ నాటి రామానుజాచార్యులు' ఎందుకు అవసరమొచ్చాడో?

హైందవ మత తాత్వికుడైన రామానుజాచార్యులు మధ్యయుగాలలో బౌద్ధం, జైనం, బలహీనపడుతూ వున్న సామాజిక రాజకీయ నేపథ్యంలో వైష్ణవమత ప్రచారకుడిగా వెలిశాడు. ఏ మతమైనా ఆ, ఆ రాజ్యాల పాలకవర్గ ప్రయోజనాల మనుగడ సాగిస్తాయని చరిత్ర చెబుతూంది. కుల అంతరాలు, పేదరికం, కరువులతో అల్లాడుతున్న ఆనాటి సామాజిక, రాజకీయ అవసరాల కోసం వెలసిన రామానుజాచార్యులు ఈనాడు సమతాభావం, ఆధ్యాత్మికమార్గమంటూ పునః ప్రతిష్టించబడ్డాడు. సమస్యలకు పరిష్కారమిదేనంటూ ప్రజల ఆకలి మంటల హాహాకారాలకు పాలకులు భజన రంగు పులుముతున్నారు. అందుకు గద్దర్‌నూ వాడుకున్నారు. ఇంకొంచెం ముందుకెళ్ళి అంబేద్కర్ కూడా బౌద్ధం నుంచి కాదు రామానుజాచార్యుల నుండే సమతాభావం నేర్చుకున్నాడని బొంకుతున్నారు. శ్రామికులు సృష్టించిన సంపదలను దోచుకుంటూ, శాస్త్రవిజ్ఞానాన్ని వాడుకుంటూ పీడిత ప్రజల ఆలోచనల్ని, సంస్కృతిని మధ్య యుగాలనాటికి తిరోగమింపచేస్తున్నారు.

రోజురోజుకీ హిందూమతాన్నే ఏకైక మతంగా స్థిరీకరించే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. మైనారిటీ మతస్థుల విశ్వాసాలను హేళన చేస్తూ విద్వేషపూరిత అణచివేత ప్రయత్నాలూ పెచ్చరిల్లుతున్నాయి. సామ్రాజ్యవాదులు బడుగు దేశాలన్నిటా మత ఘర్షణలను ఉసిగొల్పుతున్నారు. ముఖ్యంగా ముస్లిం వ్యతిరేకతను ఎగదోస్తూనే వున్నారు. ఎన్నికల సమయంలో కులమూ, మతమూ, మద్యమూ పాలకుల ఆయుధాలైనాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో జరిగే ఎన్నికలలో కాషాయ పాలకుల గెలుపుకోసం 'మతమార్పిడి నిరోధక చట్టం' అవసరమౌతూంది, హిజాబ్ ధరించటమూ వివాదమవుతోంది.

ఒకసారి సరిహద్దు వివాదం ముందుకొస్తుంది. ఇంకోసారి ఆహారపు అలవాట్లు వివాదమవుతాయి. ఇంకోసారి వేషధారణ వివాదమవుతుంది. అధికార సంస్థల సర్వేల ప్రకారమే రోజురోజుకీ, గంటగంటకూ మహిళలు, ఆదివాసీలు, దళితుల మీద దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. సరైన వైద్యం అందక మరణించేవారితోపాటు పోషకాహార లోపంతో చనిపోతున్న వారి సంఖ్య, బతకలేక బలవన్మరణాలు చేసుకుంటున్నవారి

సంఖ్య పెరిగిపోతున్నాయి. ప్రజల జీవించే హక్కు కోసం, రాజ్యాంగంలో పేర్కొన్న కనీసపాటి కూడు, గుడ్డ, గూడు సరైన వైద్యం, విద్య అందించటానికి ఏ మాత్రమూ పూనుకోని పాలకులకు తలను కప్పుకున్న గుడ్డముక్కే (హిజాబ్) సమస్య అయికూర్చుంది. హిజాబ్‌ను, బురఖాలను, పరదాలను తొలగించాలా లేదా, అవి స్త్రీలకు అవసరమా కాదా అన్నది ఇక్కడ చర్చ కాదు. ఆ విషయానికొస్తే ఏ మతమైనా మహిళలను పురుషుల కోసం జీవించే, పురుషుల అవసరాలు తీర్చే రక్తమాంసాల ముద్దగానే చూస్తుందనటంలో సందేహమే లేదు.

స్త్రీలు – హిందూ, ముస్లిం, క్రైస్తవం, సిక్కు, బౌద్ధం, జైనం.... ఏ మతాచారాల ప్రకారం జీవిస్తున్న వారి పైనైనా – ఏ మతాలకు చెందిన పురుషులైనా హింస, అత్యాచారాలు, హత్యలు చేయకుండా మానటంలేదు. హిజాబ్ కట్టుకున్నా, బుర్ఖా వేసుకున్నా, భుజాల చుట్టూ పవిట చెంగు కప్పుకున్నా, ముఖాన్ని పవిట చెంగుతో కప్పేసినా.... ఆసిఫా బలైనా, మనీషావాల్మీకి దగ్ధమయినా ఏ దేవుడూ రక్షించలేదు. ఏ మతాచారాలూ ఈ దురాగతాలను ఆపలేకపోతున్నాయి. 'బేటీ బచావో – బేటీ పడావో' పథకాలెన్ని ఉన్నా, ఆడపిల్ల పుట్టిన దగ్గర నుండి చచ్చేదాకా ప్రవేశపెడుతున్న రకరకాల సంక్షేమ పథకాల వల్ల ఆడపిల్లలకు, దళిత ఆదివాసీలకు ఏ మాత్రమూ రక్షణ పెరగటంలేదు. వివాహ పరిమితి 18 ఏళ్ళవరకూ ఉన్న చట్టాన్ని అమలుపర్చలేని పాలకులు 21 ఏళ్ళకు వివాహ పరిమితిని పెంచి స్త్రీ జనోద్ధరణ ముఖం చూపుతున్నారు. గొంతెత్తిన ముస్కాన్‌ఖాన్‌ను కాషాయ పాలక మూకలు అల్లరి చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే సి.ఎ.ఎ., ఎన్.ఆర్.సి.లకు వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌ల వంటి దీక్షా శిబిరాలలో పాల్గొన్న క్రియాశీలకమైన ముస్లిం మహిళల ఫోటోలను మార్ఫింగ్ చేసి వేలానికి మహిళలు అనే ట్యాగ్‌ను జోడించి ఢిల్లీలో 'సల్లీడీల్స్' పేరుతో ముంబైలో 'బుల్లీబాయి' పేరుతో అశ్లీలమైన పోస్టులు పెడుతూ కాషాయపు అరాచక ముఠా పేట్రేగిపోతున్నారు. వ్యక్తిగతమైన మతాచారాలను వివాదాస్పదం చేసి మైనార్టీలను వేధించటం ద్వారా హింసించటం ద్వారా వికృతానందపడే సంస్కృతిని వెదజల్లుతున్నారు.

ప్రజలకు సమస్యలుగాని సమస్యలను ఎజెండాగా చేసి, ఆ ఎజెండా చుట్టూ ప్రజల ఆలోచనల్ని పాలకులు మరలుస్తున్నారు. మనదేశంలోని ఒక్కొక్క ప్రభుత్వరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఉపాధి అవకాశాలు మృగ్యమైపోయి రకరకాల సంక్షోభాలతో అశేష ప్రజల జీవితాలు వీధినపడ్డాయి. ఇందుకు పాలకులు చూపుతున్న పరిష్కారాలు మాత్రం ఆధ్యాత్మికత, మతఘర్షణలు, సంక్షేమ పథకాలు వగైరా. పాలకులు అనుసరిస్తున్న ఈ సామ్రాజ్యవాద అనుకూల దళారీ విధానాలను ప్రజల మధ్య సాహిత్య కళారూపాలతో ఎండగట్టాలి. ప్రజారచయితలం, కళాకారులమైన మనం ప్రజల వెన్నంటి వుండి వారిని చైతన్యపరుస్తూ అసమాన సమాజం మార్పుకై గురిపెట్టిన ఉద్యమాల చూపుకి చుక్కాని కావాలి. ✦

## ప్రజాసాహితి యాజమాన్య వివరాలు

### (ఫారం 4, రూల్–8 ప్రకారం)

| | | |
|---|---|---|
| 1. ప్రచురణ స్థలం | : | విజయవాడ–520002 |
| 2. ప్రచురణ కాలం | : | నెలకొకసారి(మాసపత్రిక) |
| 3. ముద్రాపకుని పేరు | : | **కొత్తపల్లి రవిబాబు** |
| జాతీయత, చిరునామా | : | భారతీయుడు<br>30–7–6 అనపర్తివారివీధి,<br>అన్నదానం సమాజం రోడ్డు,<br>దుర్గాఅగ్రహారం,<br>విజయవాడ – 520002 |
| 4. ప్రచురణ కర్త పేరు,<br>జాతీయత, చిరునామా | : | పైవిధంగానే |
| 5. సంపాదకుని పేరు | : | కొత్తపల్లి రవిబాబు |
| 6. భాగస్వాములు | | జనసాహితి, ఆంధ్రప్రదేశ్ |

పైన పేర్కొన్న విషయములన్నియు యధార్థములు.

1.3.2022 సం॥ **కొత్తపల్లి రవిబాబు**
ప్రచురణకర్త

## ఉత్తరాలు


**"కరోనా దీపం వుండగానే.."** శివాజీరావుగారి కథ చాలా బావుంది. ఇందులో వాట్సాప్, ఫేస్బుక్‌లలో నిరంతరం లీనమై, తలెత్తకుండా విపరీతంగా శ్రమిస్తోన్న ఒక నూతన శ్రామికవర్గాన్ని భలేగా ఆవిష్కరించారు. వ్యాపార ప్రపంచం, దేన్నైనా వ్యాపారం చేసుకుంటూ, ఒక అనైతిక జీవన్మరణ సమస్యలోకి చిరు ఉద్యోగుల్నీ, చిరు వ్యాపారుల్నీ ఎలా నెట్టివేస్తుందో, విద్యా, వైద్యం వంటి ప్రాథమిక రంగాల్ని సైతం ఎలా భ్రష్టు పట్టిస్తున్నారో హత్తుకునేలా చెప్పారు. అదే సమయంలో, ఒక మానవీయ కోణాన్నీ, ఒక పరివర్తననీ, చూపే దిశగా ప్రయత్నం చేశారు.

మంచి కథని ఇచ్చిన ప్రజాసాహితికీ, శివాజీరావుగారికీ ధన్యవాదాలు.

నిజానికి ఇది వాట్సాప్, ఫేస్‌బుక్‌లో విస్తృతంగా రావాలని కోరిక. రచయితతో పాటూ వారి సెల్ నెంబర్లు కూడా ముద్రించండి. Personalగా అభినందించే వీలుంటుంది.

**– వి. విజయకుమార్**
**85558 02596**

**గమనిక :** రచనలపై పాఠకులు తమ స్పందనలను రాతపూర్వకంగా అందిస్తారన్న ఆశతో రచయితల ఫోన్ నెంబర్లు ఇవ్వటంలేదు. – సం॥



# "రొండు లచ్చల హారం"

- ఎ. మన్మధరావు

**తెల్లారి** నిద్రలేచింది మొదలు, మళ్ళీ రాత్రి పడుకునేవరకూ కన్నూ, కనురెప్పలా కలిసి ఉండే వరాలమ్మ లచ్చిమిలు ఉన్న ఫలంగా విరోధులైపోయారు. నిద్రకీ, మెలుకువకీ ఎంత దూరమో ఇప్పుడు వారి మధ్య అంత దూరం పెరిగిపోయింది. ఒకరి గాలి ఇంకొకరికి గిట్టడంలేదు. నిన్న మొన్నటివరకూ పాలూ నీళ్ళలా, ఉప్పూ పప్పులా కలిసిపోయి ఉన్న వారి మధ్య, ఇప్పుడు కాటన్ గుడ్డేసినా కాలిపోయే పరిస్థితి ఏర్పడిందంటే, దీనంతటికీ కారణం.... కనబడకుండా పోయిన ఆ రెండు లక్షల రూపాయల హారమే.

వరాలమ్మ ఎంతో కష్టపడి కొనుక్కుంది హారం. ఎన్నో కష్టాలకి ఓర్చి, మొగుడిని ఏమార్చి దాచుకున్న డబ్బుతో కొనుక్కున్న హారం అది. కొని, మూడు నెలలైనా కాలే. అప్పుడే మాయమైపోయేసరికి వరాలమ్మకి పిచ్చెక్కిపోయినట్టయ్యింది. ఇల్లంతా వెదికింది. హారం గురించి మొగుడ్నడిగింది. కొడుకు నడిగింది. ఆరా తీసింది. అయినా ప్రయోజనం లేకపోయింది. మరోసారి జాగ్రత్తగా ఇల్లంతా వెదికింది. బీరువాలోన, బట్టలకింద, కబోర్డుల్లోన, ఆఖరికి బియ్యం మూటల్లోన కూడా వెదికి చూసింది. ఎంత వెదికినా హారం జాడ కనిపించకపోయేసరికి వరాలమ్మ కంటి ముందు, లచ్చిమే కదలాడింది. వరాలమ్మకి లచ్చిమి మీద ముందు నుండీ అనుమానమున్నా, అడగడానికి ధైర్యం సరిపోలేదు. చివరికి ఎలాగో ధైర్యం తెచ్చుకొని అడిగింది, "లచ్చిమీ, హారం కనబడ్డంలేదు.... నివ్వేమైనా సూసినావా?" అని. వరాలమ్మ భయం లచ్చిమి తనని "ఏమంటుందో"నని కాదు, లచ్చిమితో తనకున్న "స్నేహం ఎక్కడ చెడిపోతుందో, ఏమో"నని. లచ్చిమి "సూడ్లే"దంది. వరాలమ్మ ఏదైతే జరక్కూడదనుకుందో, ఆఖరికి అదే జరిగింది.

"వరాలమ్మ హారం పోయిందట...." అన్నమాట ఊరంతా వ్యాపించేసరికి తలా ఒకరు, ఒక్కో రకంగా మాట్లాడడం మొదలెట్టారు. వరాలమ్మ అన్ని మాటలూ వదిలేసింది గానీ, "దాని ఇంటికెవులెల్తారమ్మా.... అది తప్పు. అదే ఆ దొంగతనం సేసుంతది...." అని లచ్చిమిని ఉద్దేశించి అన్న మాటని మాత్రం చాలా బలంగా పట్టుకొని, లచ్చిమిని మరింత గట్టిగా అనుమానించడం మొదలుపెట్టింది. దీనికి తోడు అడిగించడాలూ, పత్తి చెప్పించుకోడాలూ, ఆంజనం ఏయించడాలూ.. అన్ని ప్రయత్నాలూ




చేసి చూసింది. అవన్నీ కూడా లచ్చిమి చుట్టే తిరుగుతున్నట్టు అనిపించేసరికి, ఇక "లచ్చిమే దొంగ"నే నిర్ధారణకు వచ్చేసింది. ఇలా నిర్ధారించుకున్న తరువాత నుండి, వరాలమ్మ నోటికి హద్దూ ఆపూ లేకుండా పోయింది.

"దొంగలంజికానా?!.. ఎంత పన్చేసినావే!.. పైసదా, పరకదే?!.... రొండు లచ్చల రూపాయిల హారం కొంగులెట్టికోని ఎలిపోనవు కదా!.. నీ సేతులిరిగిపోనూ, నీ తాడు తెగా?.." అంటూ లచ్చిమిని సూటిగా తిట్టడం మొదలెట్టింది. అలా రోజంతా తిడుతూనే ఉండేది.

లచ్చిమి ఓపిక పట్టింది. కానీ, ఆ తరువాత ఆపుకోవడం ఆమె వల్ల కాలే. "ఇగో.... మాటలు మరియాదగ రానీ, అనవుసురంగ మచ్చలెట్టినావంతె బాగోదు సెప్తన్ను. ఊరుకుంతన్నని మరీ రెచ్చపోతనవు. పదే.... ఆ దురగమ్మ గుడిలోకెల్లి పెమాణకం సేసి, దీపాలాపుదుమ. పద.... నీ తాడు తెగుతాదో, నా తాడు తెగుతాదో సూద్దుమ మరేనికీ...." అని ఎర్రటి చింత నిప్పుల్లాటి కళ్ళేసుకొని తిరగబడింది.

అటు వరాలమ్మా తగ్గలేదు. ఇటు లచ్చిమీ తగ్గలేదు. గొడుగు వానలా మొదలైన గొడవ, గాలివానలా మారి, ఆఖరికి సునామీనే సృష్టించేసింది. తిట్టుకోవడం, జుట్లు పట్టుకోవడం, కర్రలు పట్టుకొని బుర్రలు బద్దలుగొట్టేసుకోవడం, అన్నీ అయిపోయిన తర్వాత, పోలీస్ స్టేషన్‌కెళ్లి ఒకరిపై ఇంకొకరు కేసులు పెట్టుకునేంతవరకు నడిచింది కథ. వరాలమ్మ లచ్చిమి మీద దొంగతనం కేసుపెడితే, రివర్సులో లచ్చిమి వరాలమ్మ మీద హెరాస్మెంట్ కేసూ, ఎటెంట్ మర్డర్ కేసు పెట్టింది.

పోలీస్‌స్టేషన్‌లో పెద్ద మనుషుల సమక్షంలో, ఇద్దరికీ చెరో పదివేలు వదిలిన తరువాత, ఇద్దరి మధ్యలో రాజీ కుదరడంతో, ఆ గొడవ అప్పటికి తాత్కాలికంగా సద్దుమణిగింది.

రోజులు గడిచిపోయాయి. వారాలు గడిచిపోయాయి. ఒకటి, రెండు నెలలు కూడా గడిచిపోయాయి. వరాలమ్మ, లచ్చిమిల గొడవ మాత్రం ఇంకా అలాగే ఉంది. హారం ఏమయ్యింది? ఎలా పోయింది? ఎవరు తీశారు? అన్నది ఇప్పటికీ ఇంకా రహస్యంగానే మిగిలిపోయి ఉంది. పోలీసులొచ్చారు. ఎంక్వయిరీలు చేశారు. అయినా ఏమాత్రం ప్రయోజనం లేకపోయింది. వరాలమ్మ కూడా హారం మీద ఆశొదులుకుంది. కానీ.... లచ్చిమిని తిట్టడం మాత్రం వదల్లే. అవకాశం దొరికిన ప్రతిసారీ ఏదో ఒక వంక పెట్టి తిడుతూనే ఉంది, లచ్చిమి చేత రెండు కాస్తూనే ఉంది. రోజులిలా గడిచిపోతున్నాయి.

వరాలమ్మ ఇంటికి ఎవరెవరో కుర్రాళ్లు వస్తుండటం, వాళ్లు వరాలమ్మ కొడుకుని బెదిరిస్తున్నట్టుగా మాట్లాడుతుండడం గత కొద్ది వారాలుగా గమనిస్తోంది లచ్చిమి. అసలేం జరుగుతుందో లచ్చిమికి అర్థం కావడంలేదు గానీ, జరగకూడనిదేదో జరుగుతుందనే విషయం మాత్రం అర్థమౌతోంది. ఎలాగైనా తెలుసుకోవాలని పట్టుదలతో ఉన్న లచ్చిమికి, ఓ రోజున అవకాశం రానే వచ్చింది. రాత్రి పదకొండున్నరా పన్నెండౌతోంది. వీధి వీధంతా దాదాపుగా నిశ్శబ్దంగా ఉంది. ఒకటి రెండిళ్ల నుండి టి.వీ. సౌండూ, ఒకటి రెండు కుక్కల అరుపుల సౌండూ తప్ప ఇంకేమీ వినిపించడం లేదు. అలాంటి సమయంలో ఓ నలుగురు కుర్రోళ్లొచ్చి, వరాలమ్మ కొడుకుని, లచ్చిమి ఇంటి పక్కనున్న సందులోకి తీసుకెళ్లడం లచ్చిమి గమనించింది. నెమ్మదిగా అటువైపు వెళ్లి గోడ చాటున మసక చీకట్లో దాక్కొని అసలేం జరుగుతుందా అని ఆసక్తిగా ఎదురు చూసింది. వాళ్లేదో డిష్కషన్ పడుతున్నారు. లచ్చిమి చెవులు రిక్కించి వింటోంది. వాళ్లెంతో గుట్టుగా మాట్లాడుకుంటున్నా, వాళ్లు మాట్లాడుతున్న ప్రతిమాట లచ్చిమికి స్పష్టంగా వినబడుతోంది.

వాళ్ల డిష్కషన్ డబ్బులు కోసమనే విషయాన్ని లచ్చిమి పసిగట్టగలిగింది. "ఏసాలు దొబ్బతనవేట్రా?!.... ఎప్పుడిస్తానన్నావ్? అందరికి ఇవ్వడానికి నీ దగ్గర డబ్బులున్నాయి గానీ, మాకివ్వడానికి మాత్రం నీ దగ్గర లేవు కదా!.... నీ కంటికి మేం ఎర్రి ఎదవల్లాగ కనిపిస్తున్నాము అంతేనా!...." ఓ కుర్రోడు వరాలమ్మ కొడుకుని నిలదీస్తున్నాడు. "అవన్నేనికిలేగానీ.... ఇప్పుడిస్తావా? ఇవ్వవురా?!...." మరో కుర్రాడు బెదిరిస్తున్నాడు. వరాలమ్మ కొడుకు వాళ్లకేదో సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ వాళ్లు అవేమీ వినిపించుకోవడంలేదు. "ఒరే నివ్వీమధ్యన బంగారమేదో తాకట్టు పెట్టడమూ.... ఆడికీ, అల్లాడికీ ఇవ్వడమూ మాకేటి తెలీదను కుంతన్నావురా.... మాకన్నీ తెలుసు. కనీసం అప్పుడు కూడా నీకు మేము గుర్తురాలేదు కదరా.... అంతే, అంత సేతకానోల్లాగ కనిపిస్తనము నీకు మేము...." ఆవేశంతో తనకు తెలిసిన ఓ నిజాన్ని బయటపెట్టాడు మరో కుర్రాడు. ఆ మాట వినబడగానే లచ్చిమికి, నెత్తురు మరిగిపోయింది. గట్టిగా కేకలేసి, తన భర్తనీ, చుట్టుపక్కల వాళ్లనీ పిలిచింది. లచ్చిమి కేక వినబడగానే, కుర్రోళ్లు ఎటువైపు వాళ్ళు అటు జారుకోవడానికి ప్రయత్నించారు. లచ్చిమి, తప్పించుకోబోతున్న వాళ్లని అడ్డగించి, చెరోచేత్తో చెరో కుర్రాడిని పట్టుకుని, మరోసారి కేకలేసింది. ఓ పదిమంది దాకా పోగయ్యేసరికి లచ్చిమికి కొండంత ధైర్యం వచ్చినట్టయ్యింది. అందులో వరాలమ్మ వరాలమ్మ భర్త కూడా ఉండేసరికి లచ్చిమికి ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొచ్చింది.

లచ్చిమి తన చేతిలో ఉన్న కుర్రాళ్లని విడిచిపెట్టి, తనకి ఎదురుగా నిల్చొని బిత్తర చూపులు చూస్తున్న వరాలమ్మ కొడుకు చెంప ఛెల్లుమనేలా లాగిపెట్టి కొట్టి, "హారం ఎక్కడ తాకట్టెట్టావో సెప్పురా మరియాదగ...." అని కాలర్ పట్టుకొని గద్దించేసరికి, వరాలమ్మ కొడుక్కి భయం పట్టుకుంది. మొదట్లో కొద్దిగా తటపటాయించాడు కానీ, నిజాన్ని దాయడం అతని వల్ల కాలే. మొత్తమంతా పూసగుచ్చినట్టు చెప్పుకొచ్చాడు. హారాన్ని అతను ఏవిధంగా దొంగిలించాడో, దొంగిలించిన ఆ హారాన్ని ఏ బంగారం షాపులో ముప్పై వేలుకి తాకట్టు పెట్టాడో.... ఆ విషయాలన్నీ చెప్పేశాడు. ఆ మాటలు వినగానే వరాలమ్మకి విపరీతమైన కోపమొచ్చేసింది. కోపంలో, కొడుకని కూడా చూడకుండా, నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టింది. శాపనార్థాలు పెట్టింది. దగ్గరకొచ్చి, కసితీరా దవడపళ్లు రాలిపోయేలా గూబ పగలగొట్టింది. ఆఖరికి నిస్సత్తువతో, అవమానభారంతో గుండెలు పగిలేలా ఏడ్వడం మొదలుపెట్టింది.

వరాలమ్మ కాస్త కుదుటపడిన తర్వాత మళ్లీ విచారణ మొదలైంది. "అసలు అంత అవసరమేటొచ్చిందిరా నీకు? అన్ని డబ్బులేటి చేసినావు?...." అయోమయంగా అడిగాడు వరాలమ్మ భర్త. వరాలమ్మ కొడుకే కాదు, ఎదురుగా ఉన్న ఆ కుర్రాళ్లు కూడా నోరు మెదపలే. ఒకరి మొహంలోకి ఇంకొకరు వెర్రి చూపులు చూసుకున్నారు. ఎవరూ మాట్లాడక పోయేసరికి వరాలమ్మకి విపరీతమైన కోపం వచ్చేసింది. వరాలమ్మ భర్త కర్ర పట్టుకొని ఎడాపెడా రెండు తగిలించేసరికి, "క్రి.... క్రి.... క్రికేటు బెట్టింగులో పోయినాయి నానా...." అంటూ అసలు విషయం బయట పెట్టాడు వరాలమ్మ కొడుకు. ఆ సమాధానం వినగానే, వరాలమ్మ భర్తకి చిర్రెత్తుకొచ్చింది. "లమ్డీ కొడుకుల్లారా.... మీరెంత? మీ వయసు లెంతరా?!.... లచ్చల్రూపాయలు బెట్టింగులు కాసినంత పెద్దోలైపోనర్రా మీరు?...." అంటూ మరో రెండు దెబ్బలేసే సరికి" నానా.... తప్పైపోయింది నానా..... నానా..... నానా..... కొట్టకు నానా..... నానా...... ఇంకెప్పుడూ బెట్టింగులు కాయిన్నానా....." అని ఏడ్చుకుంటూ బతిమిలాడడం మొదలుపెట్టాడు. వరాలమ్మ భర్త, ఆ స్పీడులో తన కొడుకునే కాక, తన కొడుకు పక్కనున్న ఆ కుర్రాళ్లకి కూడా ఒక్కోటి అంటించాడు. అందులో ఒక కుర్రోడు సైలెంటుగా ఉన్నాడు కానీ, ఇంకొకడు మాత్రం, వరాలమ్మ భర్త మీదకి తిరగబడ్డాడు. దీంతో అక్కడున్న నలుగురూ కలిసి ఆ కుర్రోడిని నాలుగు ఉతుకులు ఉతికారు. పరిస్థితి విషమించినట్టు అనిపించడంతో, మిగతావాళ్లు తేరుకొని, ఆ కుర్రాళ్లని బలవంతంగా బండెక్కించి, పంపేయడంతో అక్కడికి ఆ గొడవ ముగిసింది. ఎవరింటికి వాళ్లు వెళ్లిపోతూ, "ఇలాంటి పన్లేం పనుర్రా.... ఎంతమంది ఆడ్డంలేదు!... ఎంతమంది సూడ్డంలేదు!..... అందరూ నీలాగే ఇలగ లచ్చలు తగలెడతన్నార్రా!.... ఆలు కూలిసేసి పైసా పైసా కూడబెడతుంతె, నీవిలగ తందనా లాడుతావా? ఆ మాత్రం బుద్దుండొద్దురా!...." అని ఒకరు, "ఏటోనమ్మా!.... ఈ పిల్లలకేటి సెప్పలేకపోతనం.... ఆటాపాటా వరకైతే పరవాలేదు గానీ, ఇల్లు కూల్చిన పనులు ఇవేం పనులమ్మా!....." అని ఇంకొకరు, ఎవరికి తోచింది వాళ్లు అనేసి వెళ్లిపోయారు. హారం పోయిన బాధకన్నా, లచ్చిమిని "అనవసరంగా అవమానించానే" అనే బాధ కన్నా, తన కొడుకు

చేసిన దొంగతనం వరాలమ్మని ఎక్కువ బాధ పెట్టింది. గుండెలో బాధని దిగమింగుకుంటూ ఇంటివైపు వెళ్తూ, ఇంటిలోకి వెళ్ళడానికి మనసొప్పక, ఇంటిముందున్న అరుగుమీదే కూలబడి, గుండెలు కరిగిపోయేలా ఏడ్వడం మొదలుపెట్టింది.

తన మీద పడిన నింద తొలిగిపోయినందుకు లచ్చిమి గుండె తేలికైపోయింది. గుండెలోని భారాన్నంతా దించుకొని ఆనందంతో ఇంటిలోకి అడుగెడుతున్న లచ్చిమికి.... వరాలమ్మ కొడుకు పట్టుకున్నట్టే సెల్‌ఫోన్ పట్టుకొని, వరాలమ్మ కొడుకు చూసిన క్రికెట్ మ్యాచ్‌నే చూస్తూ, వరాలమ్మ కొడుకు కంగారు పడినట్టుగానే కంగారుపడుతున్న తన పదకొండేళ్ళ కొడుకుని చూసేసరికి మళ్ళీ గుండెల్లో గునపం దించినట్టయ్యింది.

పోయిన వరాలమ్మ రెండు లక్షల రూపాయిల హారం, వరాలమ్మకి తనపై పోయిన నమ్మకం, వరాలమ్మతో చెడిపోయిన తన ఇన్నేళ్ల స్నేహం, ఎటుపోతోందో తెలియని వరాలమ్మ కొడుకు జీవితం అన్నీ వరుసగా లచ్చిమి కళ్ళముందు కదలాడాయి. ఇన్ని పోయినా దీనంతటికీ కారణమైన క్రికెట్టు మాత్రం ఇప్పటికీ ఇంకా తన ఇంటిలో కదలాడుతుండడం లచ్చిమి భరించలేకపోయింది. కొడుకువైపు అనుమానంగా చూసి, "నివ్వూ.... ఆల్లాగ పందేలేస్తున్నవురా?...." అని కొడుకుని నిలదీసి అడిగింది. వాడు "లేదు" అన్నట్టు తలని అడ్డంగా ఊపాడుగానీ, లచ్చిమికి నమ్మకం కుదరలేదు. గబగబా వెళ్ళి, కొడుకు చేతిలోని సెల్‌ఫోన్ లాగేసుకొని, టి.వీ. ఆఫ్ చేసేసింది. కానీ! ఎక్కడో దూరం నుంచి ఇంకా రన్నింగ్ కామెంటరీ వినిపిస్తూనే ఉంది. ఆ సౌండ్ ఎంత బిగ్గరగా ఉందంటే పక్కనే ఉన్న వరాలమ్మ ఏడుపు ఘోష కూడా వినిపించనంత బిగ్గరగా ఉంది. "వాట్ ఎన్ ఎక్సిలెంట్ మ్యాచ్. లాస్ట్ బాల్..... టూ రన్స్ టూ విన్." లచ్చిమి తన కొడుకుని బయటకి తీసుకొచ్చి, వరండాలో కూచోబెట్టి, వరాలమ్మని చూపించింది. లచ్చిమి కొడుకుకి, ఇప్పుడు బిగ్గరగా వస్తున్న గజిబిజి కామెంటరీ కంటే, వరాలమ్మ ఏడుపు ఘోషే స్పష్టంగా వినిపిస్తోంది.

ఆటను ఆటగా గాక, జీవితాలతో ఆటగా మారుస్తుందెవరో బలైపోతుందెందరో.... ✦

కవిత

# ఒక దుఃఖపు నది

\- సత్య కలకోటి

ఎండిపోయిన తన రొమ్ముల్ని
నా చిగుళ్ళు బిగపట్టి చీకిన ప్రతిసారీ
మా అమ్మ కళ్ళు
కట్టలు తెగిన చెరువులయ్యేవి

ఓ రెండు పాలచుక్కలకై
తన పక్కటెముకల మీద
తన్నినపుడు
మా అమ్మ కళ్ళు
నా ఒంటినిండా దుఃఖపు నదులై
ప్రవహించేవి.

నేను ఏడ్చి ఏడ్చి
తన ఎండిన డొక్కలపై
సొమ్మసిల్లినపుడు
మా అమ్మ కళ్ళు
అనేకమార్లు పచ్చి నిండుకుండలై
పట్టున పగిలిపోయేవి.

సూర్యున్ని నెత్తిమీద మోపుకొని
నన్ను నడువీపు మీద కట్టుకుని
యాచిస్తున్నపుడు
మా అమ్మ కళ్ళు
గడ్డకట్టిన కొన్ని నెత్తుటి ముద్దల
ఎర్రటి చారికల్ని
మెరిపించేవి

ఎర్రటెండలో
కమిలిన పాదాలతో సొమ్మసిల్లి
పడిపోయినపుడు
మా అమ్మ కళ్ళు
తన కనురెప్పల కిందనుండి కన్నీటి
ఊటల్ని
వెళ్ళగక్కేవి.

మా అమ్మ కళ్ళు
ఎన్నో గుండె పగిలిన సముద్రాలని
అక్కున చేర్చుకుని ఓదార్చేది
గంగా గోదావరి క్రిష్ణ నర్మదా
నదులవలె
మా అమ్మ కూడా ఈ దేశం వీపు మీద
పారే ఒక నిరంతర దుఃఖపు నది.

మా అమ్మ
ఆకలికి పుట్టిన అనాథ

(ఆకలికి పుట్టిన అభాగ్యులకి కన్నీళ్ళతో) ✦

వ్యాసం

# సమత ఎక్కడ?

## ఇహలోకంలోనా? పరలోక ప్రయాణంలోనా?

- డా॥ ఆర్కే

**2022** ఫిబ్రవరి 2-14 తేదీలలో రామానుజాచార్యుల సహస్ర శతాబ్ది ఉత్సవాలను చినజీయర్‌స్వామి ఆధ్వర్యాన హైదరాబాద్‌లో భారీస్థాయిలో నిర్వహించారు. వెయ్యికోట్లు ఖర్చుచేసి స్వామివారి బంగారు విగ్రహాన్ని ఆవిష్కరించారు. మధ్యయుగాలనాటి ఒక వేదాంతి విగ్రహాన్ని చైనాలో తయారు చేయించి 'మేక్ ఇన్ ఇండియా' నినాదానికి మరింత వన్నె తెచ్చారు. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వేంచేశారు. ప్రభుత్వ యంత్రాంగమంతా ఒక ప్రైవేటు కార్యక్రమంలో మునిగి తరించింది. రాజ్యాంగంలో ఎగరేసిన సెక్యులర్ పతాకాన్ని నేలరాచారు. మతం, రాజ్యవ్యవస్థ విడదీయరాని విధంగా పెనవేసుకుపోయింది. ఇలా జరగటం ఇది మొదటిసారి కాదు, చివరిసారి కాదు.

మతం ఎన్నడూ స్వతంత్రంగా మనలేదు. మార్పు లేనిదిగా కొనసాగలేదు. ఆయా కాలాలలోని సామాజిక, ఆర్థిక పరిస్థితుల కనుగుణంగా అనేక మలుపులు తిరిగింది. ఈనాటికి కార్పొరేట్ భక్తి వ్యాపారంగా వందల వేల కోట్ల స్థాయికెదిగింది. ఇందులో ఆశ్చర్యంలేదు. ప్రతిదీ వ్యాపార వస్తువైంది, చివరికి కుటుంబ సంబంధాలు కూడా. మనిషి దైనందిన జీవితాన్ని కార్పొరేట్ శక్తులు కంట్రోలు చేస్తున్నాయి. దేవుడైనా, ఆధ్యాత్మికమైనా ఆ శక్తులకు లోబడి పనిచేయాల్సిందే.

ఇది ఈనాటి పరిస్థితి కాదు. ఏనాడూ మతం రాజ్యవ్యవస్థకు, పాలకవర్గానికి దూరంగా లేదు. రాచరిక కాలంలోను, ఆధునిక కాలంలోను ఇది వాస్తవం. రాజ్యం అండాదండా లేకుండా మతం అభివృద్ధి చెందలేదు. పర్షియాలో జొరాస్ట్రియిజం, చైనాలో కన్‌ఫ్యూషియనిజం, టావోయిజం, ఇండియాలో బౌద్ధ, జైన మతాలు, హిందూమతం, రోమ్‌లో క్రైస్తవ మతం ప్రభుత్వాల నీడనే ఎదిగాయి. రాజమతాలుగా చలామణి అయినాయి. అందుకు ప్రతిఫలంగా మతం పాలకవర్గ ప్రయోజనాల్ని కాపాడుతూనే వుంది. యుద్ధాలలో, పాలక ముఠాల అంతర్గత కుమ్ములాటలలో మతం పావుగా మారింది. ఇహలోకపు కష్టాలు, కన్నీళ్ళ నుండి పరలోకపు సుఖాలవైపు ప్రజల మనస్సులను మళ్లించటంలో మతం మత్తుమందుగా తయారైంది.

రామానుజాచార్యుల విగ్రహానికి 'సమత'ను జోడించి 'ఆధునికత'ను అద్దారు. ఏది సమత? అనే ప్రశ్నకు అర్థాన్ని చర్చకు రాకుండా మూత పెట్టారు. ఇహలోకపు సమతా? పరలోక ప్రయాణానికి సమతా? స్త్రీ, పురుష భేదాలు, కులవిచక్షణ లేకుండా అందరికి దేవాలయాలలోకి ప్రవేశం వుండాలని, మోక్షానికి అందరూ అర్హులేనని రామానుజులు ప్రవచించారు. దాని అర్థం ఏమిటో ప్రియ శిష్యుడు చినజీయర్ స్వామి విప్పిచెప్పారు. 'కులాలు వుండాల్సిందే. ఎవరి కుల ఆచారాన్ని వారు పాటించాల్సిందే. అప్పుడే సమాజం సజావుగా నడుస్తుంద'న్నారు. 'ఏ జంతువు మాంసం తింటే ఆ జంతువు బుద్ధులు వస్తాయంటూ' మాంసాహారులపై హేయమైన వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వ్యక్తా సమతా ప్రబోధాన్ని మనకందిస్తున్నారు.

రామానుజాచార్యుల్ని చారిత్రకంగా అర్థం చేసుకోవాలి, అంచనా వేయాలి. ఆయన హైందవ తాత్త్వికుడు. మనదేశంలో మతం, తత్త్వం వేరువేరుగాదు. కలగలిపి వుంటాయి. చారిత్రక అవసరాలకనుగుణంగా మార్పు చెందాయి. ఆయా కాలాలలోని సామాజిక, ఆర్థిక నేపథ్యమే మతానికి, తాత్త్వికతకు చుక్కానిగా పనిచేశాయి. నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయకుండా కేవలం వ్యక్తుల గుణగణాలు, మేధస్సుకు పరిమితం చేసి ఏ భావజాలాన్నీ పరిశీలించగూడదు. అంతేకాదు, ఏ భావజాలము ఆకాశం నుండి వూడిపడదు. అంతకు ముందున్న భావాలు, ఆలోచనలు, సిద్ధాంతాలకు కొనసాగింపుగానే వుంటుంది. ఏక భావజాలం ఎక్కడా, ఏ కాలంలోనూ వుండదు. మూసబోసినట్లు ఒకే రకంగా సాగదు. విభిన్న భావాల మధ్య ఘర్షణ దానిలో ప్రతిబింబిస్తుంది. ఆ ఘర్షణలో ఒక భావం డామినెంట్‌గా ముందుకు వస్తుంది. అదే ఆధిపత్య భావజాలంగా రూపొందుతుంది. దీని వెనుక వున్న సామాజిక, ఆర్థిక పరిస్థితి ఆ భావజాలానికి పునాది అవుతుంది.

భారత ఉపఖండంలోని మతాలు, తాత్త్విక ఆలోచనల్ని ఈ దృక్పథంతోనే చూడాలి. హిందూమత భావజాలంలో ఎన్ని శాఖలున్నా వేదాల్ని, ఉపనిషత్తుల్ని, భగవద్గీతను ప్రామాణికంగా అంగీకరిస్తాయి. మనిషిని, సమాజాన్ని ప్రక్కనబెట్టి, ఆత్మ, పరమాత్మల సంబంధాల్ని ప్రధానంగా తర్కిస్తాయి. మోక్షం లేదా జన్మరాహిత్యం అంతిమ గమ్యంగా ప్రకటిస్తాయి.

**క్రీ.పూ. 1500-1000 తొలివేదయుగం** రుగ్వేదకాలం. క్రీ.పూ. 1000-500 మలివేదయుగం. ఈ కాలంలో యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం రూపొందాయి. ప్రతి వేదానికి సంహిత, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, చివరన ఉపనిషత్తులు వస్తాయి. వేదాంతం అని ఉపనిషత్తులని పిలుస్తారు. క్రీ.పూ. 700-400 కాలం నాటివి మొత్తం 108 వున్నాయంటారు. ముఖ్యమైనవి పది.

రుగ్వేదకాలమంతా పశుపోషణ ప్రధాన వృత్తి. వ్యవసాయం ప్రాథమిక దశలో వుండేది. ఇనుప పనిముట్లు వాడకంలోకి రాలేదు. పట్టణ నాగరికత తెలియదు. అది తెగల వ్యవస్థ. భారత ఉపఖండానికి వలస వచ్చిన ఆర్య తెగలు ప్రాంతీయ అనార్య తెగలపై ఆధిపత్యం చలాయించాయి.

ఇంద్రుడు, వరుణుడు, సూర్యుడు, అగ్ని తదితర ప్రకృతి దేవుళ్ళను ఆరాధించేవారు. దేవుళ్ళను ప్రసన్నం చేసుకోవటానికి యజ్ఞయాగాదులు, జంతుబలులనిచ్చేవారు. సోమరసం సమర్పించేవారు. రుషులు, బ్రాహ్మణులు మాంసాహారులు. స్వర్గ, నరకాలు, కర్మ, పునర్జన్మ, మోక్షంల గురించి తొలివేదయుగంలో స్పష్టమైన భావాలు లేవు. భౌతిక సుఖాలే ప్రధాన లక్ష్యంగా జీవన విధానం సాగింది. మందలు మందలుగా పశుసంపదలు పెరగాలని కోరుకొనేవారు. భోగభాగ్యాలు, ఆయురారోగ్యాలు, యుద్ధ విజయాలు కోసం ప్రార్థనలు చేసేవారు. సంస్కృత మంత్రాలు పఠించేవారు.

ఉత్పత్తి పెరిగింది. చేతివృత్తులు విస్తృతమైనాయి. కాలక్రమంలో శ్రమ విభజన వర్ణ విభజనగా పరిణమించింది. తొలివేద కాలంలో వృత్తిని బట్టి విభజన వుండేది. వృత్తుల మధ్య ఖచ్చితమైన విభజన గీతలు లేవు. ఒకే కుటుంబంలో విభిన్న వృత్తులవారుండేవారు. పితృస్వామ్యమే అయినా స్త్రీలకు కొంత స్వేచ్ఛ వుండేది. తెగల సభలలో పాల్గొనేవారు. బాల్యవివాహాలు లేవు.

**మలివేదయుగం**లో సింధునదీ తీరంలో నివాసమున్న ఆర్యులు గంగానదీ తీరం వెంబడి జీవనయాత్ర సాగించారు. ఉత్తర భారతం ఇనుప యుగంలోకి ప్రవేశించింది. పశుపోషణ నుండి వ్యవసాయం ప్రధాన వృత్తిగా మారింది. వ్యవసాయంలో అదనపు ఆదాయం సృష్టింపబడింది. అదే సమయంలో వర్ణ విభజన నూతన సామాజిక సమీకరణలకు శ్రీకారం చుట్టింది. బ్రాహ్మణులు విద్య, బోధన, యజ్ఞయాగాదుల నిర్వహణ, క్షత్రియులు యుద్ధం, పాలన బాధ్యతలు చేపట్టారు. వైశ్యులు, వ్యవసాయం, చేతివృత్తులకు పరిమితమయ్యారు. పై మూడు వర్ణాలు ద్విజులు. వేదం వినటానికి, నేర్చుకొనడానికి అర్హులు. నాల్గవ వర్ణం శూద్రులు, అగ్రవర్ణాలకి సేవలందించటం వీరి పని. అట్టడుగున అవర్ణులుంటారు. వారు అంటరానివారు. పరిసరాలను శుభ్రం చేయడం, తోలు పనులు, జంతు కళేబరాలను పూడ్చిపెట్టడం తదితర పనులు చేయాలి.

మారకం, అమ్మకం, మార్కెట్‌లు పెరగటంతో తెగలు స్థానే ప్రాంతీయం చోటు చేసుకుంది. పట్టణీకరణ జరిగింది. వ్యాపారం అభివృద్ధి చెందింది. వ్యాపారులు 'శ్రేష్ఠు'లుగా కొత్త వర్ణం బయలు దేరింది. శారీరక శ్రమ నుండి మేధో శ్రమ వేరైంది. బ్రాహ్మణులు, క్షత్రియులు విశ్రాంతి మేధోవర్గం. వైశ్యులు, శూద్రులు శారీరక పనులు చేసే శ్రమజీవులు.

వ్యవసాయం, వ్యాపారంలో అదనపు ఆదాయానికి బాటలు పడటంతో, దానిని పర్యవేక్షించే ఒక నూతన ప్రత్యేక యంత్రాంగం అవసరమైంది. 'జనపదాలు' ఏర్పడినాయి. రాజ్యవ్యవస్థ పుట్టింది. వైశ్యులు, శూద్రులు సృష్టించిన అదనపు ఆదాయాన్ని బ్రాహ్మణులు, క్షత్రియులకు జేరవేయటానికే ఈ వ్యవస్థ ఆవిర్భవించింది. ఇది చాలదు. ఈ దోపిడీని శాశ్వతం చేయాలి. వర్ణాన్ని జన్మకి ముడిపెట్టారు. ఎవరి వర్ణ ధర్మం వారు ఆచరించాలన్నారు. ఈ కొత్త సమాజానికి కావాల్సిన నూతన భావజాలాన్ని ప్రోది చేయాలి. వేదాలలోని యజ్ఞయాగాదులు, కర్మకాండలు వ్యవసాయ సమాజానికి పనికి రావు. ఐహిక సుఖాలు మానసిక శాంతినివ్వలేదు. కొత్త ఆలోచనలు రేకెత్తాయి.

**ఉపనిషత్తులు :** నేనెవర్ని? ఈ జగత్తు ఏమిటి? నాకు, ఈ విశ్వానికి గల సంబంధం ఏమిటి? నా జీవిత లక్ష్యం ఏమిటి?

జ్ఞానం అంటే ఏమిటి? దానిని ఎలా సాధించాలి? ఆనందం అంటే ఏమిటి? అది తాత్కాలికమా? శాశ్వతమా? శాశ్వత ఆనందం ఎలా లభిస్తుంది? మరణాంతరం జీవితం వుందా?

ఈ ప్రశ్నలకి జవాబే ఉపనిషత్తులు. గురు, శిష్య బృందాలతో తాత్త్విక విచారణ చేశారు. భారతీయ తత్త్వశాస్త్రానికి బలమైన పునాది ఉపనిషత్తులతోనే పడింది. వేదాలలోని సారాన్ని ఉపనిషత్తులు కాదనలేదు. రుగ్వేదంలో 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అనే శ్లోకం వుంది. సత్యం ఒక్కటే. విజ్ఞులు దాని బహు విధాలుగా పేర్కొంటారు.

సత్యం అంటే బ్రహ్మం. అదే పరమాత్మ. దానిని జేరటానికి తనదైన మార్గాన్ని ఎంచుకున్నాయి. ఉపనిషత్తులు, ఆత్మ, పరమాత్మల సంబంధాన్ని నిర్వచించాయి. భాష్యం చెప్పాయి.

ఆత్మ అంటే వేదాలలో 'శ్వాస', 'ప్రాణం' అనే అర్థంలో వాడారు. బ్రహ్మం అంటే స్తోత్రం, మంత్రం, యజ్ఞంగా భావిస్తారు.

ఉపనిషత్తుల ప్రకారం 'ఆత్మ' ప్రతి ప్రాణిలోను వుంటుంది. శరీరం అశాశ్వతం. ఆత్మ శాశ్వతం. ఆత్మకి చావు, పుట్టుకలు లేవు. బ్రహ్మ అంటే పరబ్రహ్మ, పరమాత్మ, మార్పులేనిది. స్థిరమైనది. శాశ్వతమైనది. సర్వసృష్టికి అదే మూలం. బ్రహ్మం అనిర్వచనీయం. అసమానం. అనంతం. నిర్గుణం. నిరాకారం.

బ్రహ్మంను జేరుకోవటానికి రెండు మార్గాలు. ఒకటి : కర్మమార్గం. రెండు : జ్ఞానమార్గం. జ్ఞానమంటే ఇహలోక జ్ఞానం కాదు. బ్రహ్మజ్ఞానం. జ్ఞానం ద్వారానే బ్రహ్మలో ఐక్యం కావచ్చు. అలా అని కర్మ మార్గాన్ని ఉపనిషత్తులు వదిలివేయమనలేదు. నీ కర్మలను నీవు ఆచరించు. అయితే అవి నిష్కామకర్మలు కావాలి. ఫలితాన్ని ఆశించకుండా చేయాలి. జ్ఞానార్జనకు కర్మ ఒక సాధనం.

ఆత్మ వేరుకాదు. బ్రహ్మ వేరుకాదు. అవి అభేదం.

'అమామాత్మా బ్రహ్మ' – 'ఈ ఆత్మయే బ్రహ్మ'

పునర్జన్మను ఉపనిషత్తులు స్పష్టంగా అంగీకరించాయి. మరణానంతరం ఆత్మ ఏవిధంగా పయనిస్తోందో ఛాందోగ్యోపనిషత్తులో వివరింపబడింది.

భారతదేశం అంటే వేద భూమి. వేదాలు సృష్ట్యాది నుండి వున్నవి. దేవుడు సృష్టించినవి. రుషులు ప్రసాదించిన జ్ఞాన సంపద – ఇది అధికారముద్ర పడిన పాలకవర్గ భావజాలం.

**ఇనుపయుగం :** క్రీ.పూ. 600 ఇనుప పనిముట్లు వ్యవసాయంలోకి ప్రవేశించాయి. అరణ్యాలను సాగుభూములుగా మార్చారు. మధ్య గంగాతీరం వ్యవసాయ, వ్యాపార పెట్టుబడికి కేంద్రమైంది. అంతకు ముందున్న 16 జనపదాలు నాలుగుగా, చివరకు మగధ సామ్రాజ్యంగా, మౌర్య సామ్రాజ్యంగా ఒక కొత్త శకం సృష్టింపబడింది.

నూతన వ్యవసాయ సమాజ అవసరాలకు తగిన తాత్త్విక, రాజకీయ, సాహిత్య సంపదలు ప్రోగుపడ్డాయి. అంతకు ముందున్న వైదికయుగ ఆచార, సంప్రదాయాలు వ్యవసాయ, వ్యాపార అభివృద్ధికి అడ్డంకిగా వున్నాయి. యజ్ఞయాగాలు, జంతుబలులతో పశుసంపద తరిగిపోసాగింది. వ్యవసాయానికి పశువులు కావాలి. సముద్రయానానికి, వడ్డీ వ్యాపారానికి వైదికం వ్యతిరేకం. వ్యాపారానికి అడ్డుగా వున్న వైదిక మత ఆచార, సంప్రదాయాల్ని పారద్రోలాలి. 62 అవైదిక మతాలు పుట్టాయి. చార్వాకం, సాంఖ్యం, బౌద్ధం, జైనమతాలు అందులో ముఖ్యమైనవి.

దేవుడు, దయ్యం లేవు. స్వర్గ, నరకాలు లేవు. ఉన్నది ఒక్కటే జన్మ. నేల, నీరు, నిప్పు, గాలి మినహా మరోటి లేదు. వీటి సంయోగం వలనే ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ ఏర్పడినాయి. పంచేంద్రియాల ద్వారానే వీటిని తెలుసుకోగలం. అదే జ్ఞానం. శరీరమే ఆత్మ. శరీరం లేనినాడు ఆత్మ లేదు. చైతన్యం లేదు. ఇది నిఖార్సయిన ప్రాథమిక భౌతికవాదం – ఇదే చార్వాకవాదం. చార్వాకుల్ని భౌతికంగా నిర్మూలించారు. వారి గ్రంథాలను తగులబెట్టారు.

**మహావీరుడి జైనమతం** ఆత్మను అంగీకరిస్తుంది. ఆత్మలు అనేకం. విశ్వమంతటా వున్నాయి. మనిషిలోనే కాదు, వృక్షాలు, జంతువులు, రాయి, రప్పలో కూడ వున్నాయి. ఆత్మ నాశనం లేనిది. కర్మ కారణంగా ఆత్మ బంధింపబడుతుంది. కర్మల నుండి విముక్తి కావాలి. అందుకు, కామ, క్రోధ, మోహ తదితర వికారాదులను విడనాడాలి. అపుడు పునర్జన్మ వుండదు. ఆత్మ నిర్వాణం పొందుతుంది.

అహింసను తీవ్రస్థాయికి గొనిపోయి, నేల దున్నితే నీరు పారితే పురుగు పుట్రా చనిపోతుంది గనుక వ్యవసాయానికి దూరంగా వుండాలన్నారు. వ్యాపారంలో బాగా గడించారు. ఆస్తి అంటే భూమి గనుక వ్యాపారంలో ఎంత గడించినా ఆంక్షలు లేవన్నారు.

మహావీరుడు వేదాల్ని తిరస్కరించాడు. యజ్ఞాలు, కర్మకాండను వ్యతిరేకించాడు. బ్రాహ్మణాధిపత్యాన్ని ధిక్కరించాడు.

కపిల మహర్షి సాంఖ్య దర్శనం అందించాడు. క్రీ.పూ. 7వ శతాబ్దం వాడంటారు. తర్వాత కాలంలో కపిల రచనల్ని పూర్తిగా మార్చివేశారు. 'ఈశ్వరుడు లేడు' అనే సాంఖ్యాన్ని 'కలడు' అనే సాంఖ్యంగా సరిదిద్దారు.

కపిల సాంఖ్యంలో రెండు మూలతత్త్వాలున్నాయి. ప్రకృతి, పురుషుడు రెండూ స్వతంత్రమైనవి. ప్రాథమికమైనవి. పరస్పర విరుద్ధమైనవి.

ప్రకృతి పరిణామం వలనే ఈ ప్రపంచం ఏర్పడింది. పురుషుడు ఒకరు కాదు. ప్రతి జీవి పురుషుడే. అతడు శుద్ధ చైతన్య స్వరూపుడు.

ప్రకృతి ఆదిమ పదార్థం. దానికి సత్, రజ, తమస్ అనే 3 గుణాలుంటాయి. ప్రకృతి, పురుషుల సంయోగం వలన బుద్ధి జనిస్తుంది. ఈ బుద్ధి వక్రమార్గం పడితే దుఃఖం కలుగుతుంది. జ్ఞానం 3 రకాలుగా వస్తుంది. పంచేంద్రియాల ద్వారా, గతానుభవాన్ని వుపయోగించుకొని తెలియని దానిని అంచనా వేయటం ద్వారా, మరొకరు చెప్పగా వినటం ద్వారా వస్తుంది.

కపిలుడి మరో సూత్రం కార్యకారణ బంధం. కుండకి మట్టి కావాలి. బట్టకి దారం కావాలి. లేనిదేదీ పుట్టదు. కొత్తది ఏదీ సృష్టింపబడదు. కపిలుడి ప్రభావం బుద్ధుడిపై గాఢమైన ముద్ర వేసింది.

కపిలుడు దుఃఖం ఉందన్నాడు. అక్కడితో ఆగిపోయాడు. అదే బుద్ధుడికి చర్చనీయాంశమైంది. బుద్ధుడికి ముందే ఉపనిషత్తులు కొన్ని వచ్చాయి. అవి వేదాలలోని యజ్ఞయాగాదులు, కర్మకాండలను, జంతు బలులను దుయ్యపట్టాయి. వాటిని బుద్ధుడు స్వీకరించాడు. అయితే ఉపనిషత్తులలోని ఆత్మను తిరస్కరించాడు.

ఏదీ శాశ్వతం కాదు. ప్రతిదీ క్షణికం. మారుతూ వుంటుంది, అనే బుద్ధుడు శాశ్వతమైన ఆత్మను ఎలా ఒప్పుకుంటాడు? బుద్ధుడి మరో సూత్రం ప్రతీత సముత్పాదం – కార్యకారణ బంధం. ప్రతిదానికి కారణం వుంటుంది. కారణం లేకుండా కార్యం జరగదు. స్వర్గ, నరకాలు లేవు. దేవుడు వున్నాడో లేడో, ఈ విశ్వానికి ఆది, అంతం ఉందో, లేదో తెలియదు. లోకంలో దుఃఖం వుంది. దుఃఖానికి కారణం వుంది. అది కోరిక. కోరికలను నిరోధించాలి. అందుకు మార్గం వుంది. కోరికలను త్యజించి, ప్రాపంచిక విషయాలను ప్రక్కనబెట్టి ధ్యానంలో ఒక అతేంద్రియ స్థితికి జేరుకుంటే అదే నిర్వాణం. జన్మరాహిత్యం. ఇది హిందూమత భావనలో కొత్త పదం కాదు. నిర్వాణం అంటే మోక్షమే.

**బుద్ధుడు** పునర్జన్మను అంగీకరించాడు. బోధిసత్వుడు పది జన్మల తర్వాతనే బుద్ధుడవుతాడు. నిర్వాణం పొందిన బుద్ధుడు తన గత జన్మలను దర్శించాడు. జాతక కథలలో వివరింపబడింది. బుద్ధుడు కర్మలు చేయాలన్నాడు. మన కర్మలే మన సంసార చక్రాన్ని నడిపిస్తాయి. చెడు కర్మలు చెడు ఫలితాలను యిస్తాయి. మంచి కర్మలు చేస్తే పునర్జన్మ నుండి విముక్తి సాధించవచ్చు.

బౌద్ధం భావవాదమా? భౌతికవాదమా? మనస్సు లేదా చైతన్యం అన్నిటికి మూలం అంటాడు బుద్ధుడు. దుఃఖానికి కారణం కోరికలన్నాడు. దుఃఖానికి వ్యక్తిని, మనస్సును కారణంగా చూపాడేగాని సామాజిక మూలాల్ని విస్మరించాడు. సామాజిక సమస్యలకు మానసిక పరివర్తన పరిష్కారంగా చూపాడు. ఇది నిక్కచ్చిగా భావవాదమే. బుద్ధుడు చెప్పినట్లు మధ్యేమార్గం కాదు.

బౌద్ధంలోని ఈ సైద్ధాంతిక బలహీనతే దాని పతనానికి బీజం వేసింది. పలు శాఖలుగా చీలిపోయింది. అప్పటివరకు మగధరాజులు, మౌర్య చక్రవర్తులు బౌద్ధమతాన్ని పోషించారు. వ్యవసాయానికి, వ్యాపారానికి బుద్ధుడి సిద్ధాంతాలు అనుకూలంగా వుండటం వలనే పాలకులు ఆ మతం వైపు మొగ్గారు. అశోకుడి తర్వాత మౌర్యులు బలహీనపడ్డారు.

యజ్ఞయాగాదులు, కర్మకాండలు, జంతుబలులు క్షీణించటంతో బ్రాహ్మణుల ఆదాయాలు గణనీయంగా తగ్గిపోయాయి. బౌద్ధమతంపై వారు శత్రుత్వం పెంచుకున్నారు. సమయం కోసం వేచివున్నారు. మౌర్యవంశంలోని చివరి రాజు బృహద్రధుడిని అతని సేనాధిపతి పుష్యమిత్రుడు చంపివేస్తాడు. తర్వాత వచ్చిన శృంగ, కణ్వ,

శాలివాహనులంతా బ్రాహ్మణ పక్షపాతమే. ఇక్కడో విషయం చెప్పాలి. పాలకులైన రాజులు ఏ మతం ప్రజలకు ఎక్కువ ఆమోదయోగ్యంగా వుంటుందో, ఆ మతాన్ని ఆదరించారు. మౌర్యులు బౌద్ధమతాన్ని రాజమతాలుగా చేసినా, బ్రాహ్మణ్యాన్ని దూరం చేసుకోలేదు. రాజరికం అవకాశవాదంతో పాలన చేసింది.

క్రీ.పూ. 327లో అలెగ్జాండర్ దండయాత్ర తర్వాత వాయువ్య భారతంపై విదేశీ రాజుల దాడులు ముమ్మరమైనాయి. ఇండోగ్రీకులు, కుషానులు, హూణులు, శకులు కొన్ని ప్రదేశాలలో రాజ్యాల్ని స్థాపించారు. వీరు సాంస్కృతికంగా బలహీనులు. వారి రాజకీయ మనుగడ సాగాలంటే భారత సమాజంలో విలీనం కావాలి. వర్ణవ్యవస్థలో ఇమిడిపోవాలి. విదేశీ పాలకుల కాసులకు కక్కుర్తిపడిన బ్రాహ్మణులు వారికి వైదిక తీర్థం యిచ్చారు. బ్రాహ్మణ క్షత్రియులుగా కలుపుకున్నారు. వర్ణ సంకరంకి అధికార ముద్ర పడింది. విలాస జీవితానికి అలవాటుపడిన బౌద్ధ బిక్షుకులు విదేశీయుల్ని బౌద్ధంలో జేర్చుకున్నారు.

**గుప్తుల కాలం**లో భారత ఉపఖండంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం చుట్టు ముట్టింది. బ్రాహ్మణులకు దానాలు, ఉన్నతోద్యోగులకు జీతాలు యివ్వలేని పరిస్థితి ఏర్పడింది. ద్రవ్యానికి బదులుగా భూములు యివ్వసాగారు. అటవీ ప్రాంతాలలో, గ్రామీణ ప్రాంతాలలో తమకిచ్చిన భూములపై వారు పూర్తి హక్కులను రాబట్టుకున్నారు. ఫ్యూడల్ వ్యవస్థకి ఇదే నాంది అయింది. ఈ భూములను ఉన్నతవర్గాలు సాగు చేయలేరు. ఆటవిక గిరిజనుల్ని, శూద్రులను వ్యవసాయ వృత్తిలోకి లాగారు. వ్యవసాయం, వ్యాపారం ఉత్పత్తి శక్తిగా దూసుకుపోతోంది. మళ్లీ పశు పోషణ సమాజంలోకి వెళ్లలేదు. వైదికమతం పాము కుబుసం విడిచినట్లు మరో రూపం దాల్చింది. హిందూ మతంగా రూపుదిద్దుకుంది.

'అహింసే పరమ ధర్మం' అన్నారు. వేట వృత్తిగా జీవనం సాగించే తెగల్ని వ్యవసాయంలోకి లాగారు. అశోకుడు ఇదే పని చేశాడు. కొత్త దేవుళ్ళు వచ్చారు. వైదిక యుగంలో కృష్ణుడెవరో తెలియదు. క్రీ.పూ. 2వ శతాబ్దంలో విష్ణువును పైకిలేపి నారాయణుడనే అవైదిక దేవుడితో కలిపేశారు. అతడిని 'భగవత్' అని, అతని అనుచరులను 'భాగవతులు' అని పిలిచారు. పశ్చిమ భారతంలో వుండే 'వృష్టి' తెగ నాయకుడైన కృష్ణ – వాసుదేవుడిని విష్ణువులో ఐక్యం చేశారు. (ఆర్.ఎస్.శర్మ).

కొత్త వైష్ణవ దేవుళ్లకి, గిరిజన దేవతలకి పెళ్ళిళ్లు చేశారు. సాంస్కృతికంగా దగ్గరకు లాగి, మానసికంగా బలహీనులను చేసి అడవి తెగల, శూద్రుల శ్రమశక్తిని దోచుకున్నారు. రామాయణ, భారతాలను పూర్తిచేసి హిందూ భావజాలాన్ని నరనరాన ఎక్కించారు. భగవద్గీతను ఇంటింటా పారాయణం చేయించారు. రాజ్యం కోసం యుద్ధం చేయటం, యుద్ధంలో బంధుమిత్రులను చంపటం, క్షత్రియ ధర్మమని శ్రీకృష్ణుడు అర్జునుడికి హితబోధ చేస్తాడు. 'స్వధర్మాచరణంలో మరణమైనా శ్రేయమే. పరధర్మం ఎల్లప్పుడూ భయావహమే'నంటాడు. 'గుణాన్ని బట్టి, కర్మను బట్టి చాతుర్వర్ణాలను నేనే సృజించాను' అంటాడు. వర్ణవ్యవస్థను కొత్త భాషతో సుస్థిరం చేశారు.

మరో రెండు విషయాలు గీతలో స్పష్టంగా చెప్పారు. కర్మలు చేయాలి. అయితే నిష్కామకర్మగా, ఫలితం ఆశించగూడదు. రెండోది ఏ కర్మ చేసినా భగవదర్పణంగా చేయాలి. ఇది భక్తి మార్గం. అలా మొదటిసారి భక్తి తత్వాన్ని గీతలో ప్రవేశపెట్టారు. ఈ మార్గమే ఫ్యూడల్ సమాజంలో భక్తి ఉద్యమంగా మారింది. గీతలో మరో ప్రధాన భావం ఆత్మ నిత్యత్వం. శరీరం అశాశ్వతం. కర్మలను ఆచరించటానికే ఆత్మ శరీరాన్ని ధరిస్తుంది. త్యజిస్తుంది. గత జన్మల కర్మలను బట్టి ఈ జన్మ కొనసాగుతుంది.

భగవద్గీతలోని భావం ఉపనిషత్తులలో వుంది. బుద్ధుడి దమ్మ పదంలో వుంది.

బౌద్ధమతంలో నాగార్జునుడి మాధ్యమిక వాదం అతి ముఖ్యమైన ఒక వాదన. అది బౌద్ధానికి హిందూమతానికి లింక్‌గా వుంటుంది. ఈ మాధ్యమిక వాదాన్నే 'శూన్యవాదం' అంటాం.

ఈ జగత్తు ఉన్నట్టే వుంటుంది, కాని లేదు. అది శూన్యం. ప్రపంచంలో ప్రతిదీ సముత్పన్నం. ఒక వస్తువు వుంది అంటే మరొక వస్తువు వుండటం వల్లే. ఏదీ స్వతస్సిద్ధమైన వస్తువు కాదు.

ఒక కుర్చీ వుంది అంటే దానిని తయారు చేయటానికి కలప కావాలి. పనిముట్లు కావాలి. వడ్రంగి కావాలి. ఇందులో ఏది లేకపోయినా కుర్చీ లేదు. అందువల్ల దానికి స్వతంత్ర ఉనికి లేదు. కనుక అది శూన్యం. ఏ వస్తువైనా ఇంతే.

శూన్యానికి మరో పేరు నిర్వాణం.

గుప్తుల కాలంలో ప్రారంభమైన ఫ్యూడలిజం క్రీ.శ. 12వ శతాబ్దం వరకు హిందూరాజుల పాలనలో, తర్వాత మహమ్మదీయుల పాలనలో కొనసాగింది. ఈ రాజరిక పాలనలోనే పై నుండి క్రింది వరకు అధికార యంత్రాంగం అంచెలంచెలుగా నిర్మితమైంది. రాజు, సామంతులు, భూస్వాములుగా ప్రధాన ఆదాయ వనరుగా వున్న భూమిని పంచుకున్నారు. అత్యధికులును దూరంగా వుంచారు. ఈ ప్రక్రియ మొత్తంలో కులవ్యవస్థ ప్రధాన పాత్ర పోషించింది.

భారత ఉపఖండం అనేక ప్రాంతాలుగా ఫ్యూడల్ రాజుల మధ్య విభజితమై వుంది. ఒకేరాజు, ఒకే మతం కనుచూపుమేరలో కనిపించటంలేదు. వెయ్యేళ్లు పైగా వర్ధిల్లిన బౌద్ధమతం గుప్తుల కాలంనాటికి బలహీనపడినా, భారతీయ సమాజంపై దాని ప్రభావం పోలేదు. బౌద్ధాన్ని ఈ గడ్డ నుండి తరిమివేయాలి. హిందూ మతాన్ని ఏకం చేయాలి. ఈ ఆలోచనని సాకారం చేయటానికా అన్నట్టు వచ్చింది, శంకరుని అద్వైతం.

**శంకరుడు** కన్యాకుమారి నుండి కాశ్మీరం వరకు దేశమంతా తిరిగాడు. నలువైపులా నాలుగు మఠాలను ప్రతిష్టించాడు. కట్టుకథల్ని ప్రక్కనపెట్టి అద్వైతాన్ని పరిశీలిద్దాం, కొద్దిగా – 'బ్రహ్మ సత్యమ్, జగన్మిధ్యా, జీవో బ్రహ్మైవ, నా పరః' "బ్రహ్మ ఒక్కడే సత్యం. జగత్తు అంతా మిధ్య. ఈ జీవుడే ఆ బ్రహ్మం. ఆ రెండూ వేరుకాదు".

శంకరుడు ఈ జగత్తు అంతా దుఃఖమయం అన్నాడు. అంతేకాదు. దుఃఖానికి కారణం కోరికలు. కోరికలు తీరటానికి ఏదో పనిచేయాలి. అది కర్మ. కర్మలలో మంచివి వుంటాయి. చెడువి వుంటాయి. కర్మ ఫలితాన్ని ఎప్పుడో ఒకప్పుడు, మరుజన్మలోనైనా అనుభవించక తప్పదు. ఇది ప్రచ్ఛన్న బౌద్ధమే.

దుఃఖానికి మూలకారణం అజ్ఞానం. జ్ఞానం ఎలా ఉదయిస్తుంది? ఆత్మనాత్మ వివేకమే జ్ఞానం. ఈ వివేకంలో జనించేది బ్రహ్మ సాక్షాత్కారం. మాయ పొరలు తొలగితేనే ఇది సాధ్యమవుతుంది.

జగత్తును రజ్జు సర్ప భ్రాంతిగా శంకరుడు వర్ణిస్తాడు. తాడును చూచి పాము అని భ్రాంతి పడటం అని అర్థం. వెలుతురు (జ్ఞానోదయం) రాగానే సత్యాన్ని గ్రహిస్తారు.

అద్వైతం అంటే ద్వైతం కానిది. జీవాత్మ, పరమాత్మల ఏకత్వమనే భావనం.

ఈ జగత్తు, దేహం, మనస్సు ఏదీ సంపూర్ణ సత్యం కాదు. సాపేక్షమే. ఆత్మ పరిపూర్ణ సత్యం. మార్పులేనిది. కాలాలకు పరిమితం కానిది. స్వతంత్రమైనది, నిరపేక్షమైనది, నిత్యమైనది. ఇంకా ఆత్మ అంటే శుద్ధ చైతన్యం.

బ్రహ్మ నిర్గుణుడు. కార్యకారణ బంధానికి అతీతుడు. అందువల్ల జగత్తు సృష్టికి బ్రహ్మ కారణం కాదు. ప్రకృతి జడపదార్థం. అది తనంత తాను పరిణామం చెందదు. ఒక క్రమ పద్ధతిగా వున్న జగత్తును ఈశ్వరుడు తన మాయశక్తి చేత రూపొందిస్తున్నాడు. ఈశ్వరుడంటే కారణ బ్రహ్మ. సగుణ బ్రహ్మ. ఈశ్వరుడు లేకపోతే జగత్తు సృష్టిలేదు.

నిర్గుణ బ్రహ్మయే సగుణ బ్రహ్మ. బ్రహ్మ, ఈశ్వరుడు వేరుగాదు. అంతా బ్రహ్మమే. ఆద్యంతరహితుడు. మాయతెరలు కప్పుకున్న జీవాత్మ ఎప్పుడయితే తాను, బ్రహ్మం వేరుగాదని గ్రహిస్తాడో, అప్పుడు జ్ఞానోదయం కల్గి మోక్షాన్ని పొందుతాడు. అది జ్ఞానమార్గం. అదే మానవ జీవిత లక్ష్యం.

శంకరాచార్యులు కేరళకి చెందినవాడు. దక్షిణ భారతంలోని తమిళనాడుకు చెందిన మరో వేదాంతి రామానుజాచార్యులు. శంకరుడిది అద్వైతమైతే, రామానుజులది విశిష్టాద్వైతం. క్రీ.శ. 1017-1137కి చెందినవాడు. మధ్యయుగాల కాలం. అంటరానితనం, కులవివక్ష, శ్రమదోపిడీతో భారతీయ సమాజం అతలాకుతలమైన కాలం. బౌద్ధం అంతిమ దశలో వుంది. జైనులు వ్యాపారాలకు పరిమితమయ్యారు. శంకరుడి అద్వైతం పండితుల మధ్య తర్కానికి వేదిక అయింది. సామాన్యులకు సాంత్వన చేకూర్చే మతం కరువైంది. మరణానంతరం పరలోక ప్రయాణానికి దారిచూపేవాళ్లు, అక్కడి స్వర్గ సౌఖ్యాలను రుచిచూపేవాళ్లు లేకపోయారు. దీనికి జవాబుగా వచ్చాయి భక్తి ఉద్యమాలు. దీనికి ఆద్యుడు రామానుజుడు.

అది దక్షిణ భారతదేశంలో తమిళ భూమికి చెందిన చోళరాజుల కాలం. పల్లవులను ఓడించి 9వ శతాబ్దంలో నుండి 13వ శతాబ్దం వరకు వీరి పాలన సాగింది. మధ్యయుగాల నాటి అధికార దర్పమంతా చోళుల పాలనలో వుంది. చోళుల కాలం సంగం సాహిత్యానికి ప్రసిద్ధి. గుళ్లు, గోపురాలు, శిల్పాలు నాటి చరిత్రకు అద్దం పడతాయి.

గుడి దేవాలయమే కాదు. సామాజిక కార్యకలాపాలకు కేంద్రంగా వుండేది. సమావేశాలు జరిగేవి. వేదాలు, మతగ్రంథాలు, జానపదాలు బోధించేవారు. బ్రాహ్మణులు సామాజికంగా ఉన్నతులు. బహుదేవుళ్ళ ఆరాధకులు. శివుడు రాజరికానికి ఆరాధ్యుడు. కావేరీ నదీ తీరంలో శివాలయాలు అనేకం వున్నాయి.

**రామానుజుని కాలం**లో కులోత్తుంగ చోళుడు రాజు. శైవుడు చిదంబరం ప్రధాన స్థావరంగా పాలించేవాడు. వైష్ణవ వ్యతిరేకి.

రామానుజుడికి ముందే వైష్ణవం వుంది. పన్నెండుమంది ఆళ్వారులు దీనికి ఆద్యులు. మామూలు ప్రజలకి అర్థమయ్యేట్టు తమిళంలో భక్తిపాటలు రాశారు. ఆళ్వారులు తర్వాత వైష్ణవాన్ని ప్రచారం చేసినవారు ఆచార్యులు.

శంకరుడి అద్వైతానికి, రామానుజుడి విశిష్టాద్వైతానికి మూలాలు ప్రస్థాన త్రయంగా చెప్పబడే ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలే. అయితే భాష్యంలో ఇద్దరికీ తేడా వుంది.

శంకరుడు బ్రహ్మ సత్యం. జగత్తు మిధ్య అంటాడు. పరబ్రహ్మ, ఆత్మ ఒక్కటేనంటాడు.

రామానుజుడు బ్రహ్మ, జగత్తు జీవాత్మ మూడు సత్యమేనంటాడు. పరమాత్మ, ఆత్మ రెండూ ఒక్కటే. సూర్యుడు, సూర్యకిరణాలు లాంటివి. సూర్యకిరణాలు సూర్యుడిలో భాగమే.

బ్రహ్మణం నిర్గుణ కాదు. సద్గుణ. శుద్ధ చైతన్యమే ఆ గుణం. సగుణ బ్రహ్మ, ఈశ్వరుడు వేరుకాదు. సకల సృష్టికర్త ఆ బ్రహ్మమే. ఆయనే ఈశ్వరుడు, విష్ణుమూర్తి. బ్రహ్మ, ఆత్మ, జగత్తు వేరుకాదు. ఆ పరమాత్మ రూపాలే! బ్రహ్మ సంపూర్ణ సత్యమైతే, జగత్తు అసంపూర్ణ సత్యం. జగత్తును తెలుసుకుంటే సంపూర్ణ సత్యం గోచరమవుతుంది. ఇందుకు ఏకైక మార్గం భక్తి.

భక్తిభావం భగవద్గీతతో హిందూ మతంలోకి ప్రవేశించింది. అంతకుముందు లేదు. అత్యధికుల ఆమోదయోగ్యమైంది. సామాన్యుల కందుబాటులోకి వచ్చింది. బుద్ధుని నిర్వాణం, శంకరుడి అద్వైతం కంటే జనులకు దగ్గరయింది. మోక్షానికి అందరూ అర్హులేనంది.

ఇది భక్తి ఉద్యమంగా లేచింది. బౌద్ధానికి, శంకరుడి అద్వైతానికి వ్యతిరేకమైంది. కులోత్తుంగ చోళుడు ఈ ఉద్యమానికి పితామహుడుగా వున్న రామానుజుడిని చంపాలని చూశాడు. తన అనుచరులతో రామానుజుడు మైసూరు వెళ్ళిపోయాడు. అక్కడ కొందరు అవర్ణులైన వైష్ణవులకు, ఆశ్రయమిచ్చి దేవాలయ ప్రవేశం కలిగించాడు. అంటరానివారిని 'తిలకుల్ధర్' అని పేరు పెట్టాడు, గాంధీజీ 'హరిజన్' అని పిలిచినట్లు. రెండవ కులోత్తుంగ కాలంలో పరిస్థితులు చక్కబడినాయి. శ్రీ వైష్ణవానికి కూడా గౌరవ స్థానం లభించింది. రామానుజుడు తిరిగి వచ్చాడు.

శంకరుడిది, రామానుజుడిది అద్వైతమే. భాష్యంలో తేడా వలన రామానుజుడిది విశిష్టాద్వైతమైంది. వీరిద్దరికి పూర్తి భిన్నంగా ద్వైతం బయలుదేరింది. కర్నాటకకు చెందిన మధ్యాచార్యులు ద్వైతాన్ని ప్రచారం చేశాడు. అద్వైతం అంటే ఒక్కటే. అంతా బ్రహ్మమే. విశిష్టాద్వైతం కూడా అద్వైతమే. అయితే బ్రహ్మం, ఆత్మ, జగత్తు మూడు సత్యాలంటూనే, ఆత్మ, జగత్తు బ్రహ్మంలో భాగంగానే వుంటాయంది. అది భిన్నత్వంలో ఏకత్వం. వీటికి భిన్నంగా మధ్యాచార్యులు అన్నీ ద్వైతమేనంటాడు. బ్రహ్మం, ఆత్మ, జగత్తు అన్నీ సత్యమే, నిత్యమే, శాశ్వతమే. ఏదీ మిథ్య కాదు. దోషరహితమైన ఇంద్రియానుభవం వలన కలిగేది నిజమైన జ్ఞానమే.

పరమాత్మ, జీవాత్మ యజమాని, సేవకుడు లాంటివి పరమాత్మను ఆరాధించి జీవాత్మ మోక్షాన్ని పొందవచ్చు. ఇందుకు భక్తిని ప్రధాన మార్గంగా మధ్యాచార్యులు చెప్పారు.

బ్రహ్మం అంటే సగుణ బ్రహ్మే. అతడే నారాయణుడు, విష్ణువు, కృష్ణుడు.

మధ్యయుగాలలో వైష్ణవ భక్తి ఉద్యమాలెన్నో వచ్చాయి. భక్తి కవులు పాటలు రాశారు. భజనలు చేశారు. ఆబాల గోపాలాన్ని భక్తి సముద్రంలో ముంచెత్తారు. మరోవైపున కులసంస్కరణ ఉద్యమాలు వచ్చాయి. ఇందులో ముఖ్యమైంది కర్నాటకలోని లింగాయత్‌ల వీరశైవం. బసవేశ్వరుడు నాయకత్వాన జరిగింది. బ్రాహ్మణుడే అయినా బ్రాహ్మణ సంస్కారాలను వ్యతిరేకించాడు. వర్ణ వ్యవస్థను కాదన్నాడు. అయినా చివరికి లింగాయత్ కుల ఉద్యమమైంది.

మధ్య యుగాలలో ఫ్యూడల్ దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా వచ్చిన సంస్కరణ ఉద్యమాలివి. సమస్య మూలాల్లోకి వెళ్లలేదు. కుళ్లిపోయిన శరీర భాగాలను తొలగించటం గాకుండా, కుళ్లువాసన రాకుండా సువాసనలు అద్దే ప్రయత్నం చేశారు.

మనదేశంలో తత్త్వశాస్త్రం ప్రధానంగా ఆత్మ, పరమాత్మల చుట్టూనే తిరిగింది. మనిషికి, మానవ సమాజానికి తాత్త్విక ఆలోచనలో చోటు లేకుండా చేసింది. నేలవిడిచి సాము చేసింది. మతంతో మమేకమై పాలకవర్గ ప్రయోజనాలనే కాపాడింది. ఏ దేశంలోను లేనివిధంగా భారతదేశంలో భౌతికవాద ధోరణులను అణచివేశారు. ప్రశ్నించిన వారిని భౌతికంగా మట్టుబెట్టారు.

యూరప్‌లో వలె ఆసియా దేశాలలో పారిశ్రామిక విప్లవాలు, సాంస్కృతిక విప్లవాలు జరగలేదు. పైగా వలస దేశాలుగా శతాబ్దాలు తరబడి చీకటి యుగంలో మగ్గాయి. వలసవాదులతో ఇక్కడి ఫ్యూడల్ వర్గాలు రాజీపడి పాత సంస్కృతినే కొనసాగించారు. అందువల్లే ఇప్పటికీ మనం 'కర్మ', 'విధి', 'గతజన్మ పాపం' నుండి విముక్తి పొందలేదు. ✦

## సాహిత్యాభిమాని, ఉపాధ్యాయ ఉద్యమ శిఖరం ఎన్. పరమేశ్వరరావు మరణం

**వామపక్షవాది,** ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు నూతలపాటి పరమేశ్వరరావు తన 81వ యేట 11-1-2022న విజయవాడలో మరణించారు. ఆయన 10-9-1941న గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఫిర్కాలోని నిమ్మగడ్డవారి పాలెం గ్రామంలో జన్మించారు.

ప్రత్తిపాడు హైస్కూలులో తెలుగు మాస్టారు రంగారావు, హిందీ మాస్టారు ఆలూరి బైరాగిల ప్రభావంతో సాహిత్యంపట్ల మక్కువ పెంచుకున్నారు. పి.యు.సి. సగంలో వదిలేసి వామపక్ష రాజకీయాలలో ప్రవేశించారు. కొన్నాళ్ళు ట్యూషన్లు చెప్పి, సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ పూర్తిచేశారు. తన 23వ యేట ఉపాధ్యాయ సంఘ కార్యాలయ మేనేజర్‌గా చేరి, వివిధ హోదాలతో 57 ఏళ్ళపాటు ఉద్యమానికి అంకితమయ్యారు. సింగరాజు స్వచ్ఛందంగా కార్యదర్శి పదవి నుండి విరమించుకున్న తర్వాత, ఫెడరేషన్ పరమేశ్వరరావును ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొంది. 1992 నుండి 2004 వరకు ఆయన ఆ బాధ్యత వహించారు. ఆ కాలంలో 'ఉపాధ్యాయ' పత్రిక ప్రధాన సంపాదకులుగా వున్నారు.

వివిధ రాజకీయ దృక్పథాలు వున్నా కూడా, సభ్యులందరూ సంఘ విధాన ప్రకటనకు కట్టుబడి వుండే ఒక ప్రజాసంఘంగా ఉపాధ్యాయ సంఘాన్ని రూపొందించడంలో చెన్నుపాటి లక్ష్మయ్య, సింగరాజు వారసత్వాన్ని పరమేశ్వరరావుగారు కొనసాగించారు. ఎన్ని చీలికలు వచ్చినా, మాతృసంస్థగా అది మరింత బలోపేతం కావడానికి కృషిచేశారు.

ప్రజాకవి సుంకర సత్యనారాయణ పెద్ద అమ్మాయి జ్యోతి పరమేశ్వరరావు సహచరి. 'ప్రజాసాహితి' పత్రిక నిర్వహణ గురించి, సుంకర సోదరులు ప్రజాసాహిత్య, సాంస్కృతిక ఉద్యమానికి చేసిన కృషి గురించీ వారు మాకు తెలియచేసేవారు. సుంకరపై ప్రత్యేక సంచిక ప్రచురణకు సహకరించారు. సుంకర శతజయంతి సందర్భంగా వారి సమగ్ర రచనలు ఆరు సంపుటాలుగా ప్రచురించడంలో వారి సహకారం మరువలేనిది.


అభ్యుదయ రచయితల సంఘం, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ప్రచురించిన ప్రజాసాహిత్యాన్ని, కళాకారుల కృషినీ పరమేశ్వరరావు జనసాహితికి అందించారు. జనసాహితికి అత్యంత ఆప్తులైన పరమేశ్వరరావు మరణానికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నాం. వారి సహచరి జ్యోతి, కుమారుడు నవీన్, ఇతర కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటున్నాం. ✦

పుస్తక పరిచయం

# కళాకారుల ప్రజాతంత్ర సంగీతం
# విక్టర్ జారా.... అసంపూర్ణ గీతం

- ఓపిఎస్

**బడుగు** దేశాలలోని సహజవనరులను కబళించడానికి సామ్రాజ్యవాదం నిర్మించిన దోపిడీ చట్రాన్ని బద్దలుగొట్టాలని విప్లవకారులు ప్రయత్నిస్తారు. పోరాడుతారు. ఆ పోరాటానికి ప్రజలను సమీకరించేందుకు, విప్లవోన్ముఖంగా నడిపేందుకు ప్రజాకళలు, ప్రజాసాహిత్యమూ అత్యంత సహజంగా శక్తివంతంగా వారికి సహకరిస్తాయి. దోపిడీ పాలకుల ఎత్తుగడలు, అందుకు ప్రతిగా పదునెక్కే ప్రజాపోరాటాలు ప్రజాకళాకారులను స్పందింపజేస్తాయి. అజరామరమైన ప్రజాకళలు సాహిత్యము ఉత్పన్నమౌతాయి. ప్రజాకళా కారులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు. కళాకారుని వ్యక్తిగతం సామాజికమౌతుంది. ప్రజల నుండి నేర్చుకుని ప్రజలకు నేర్పాలనే విప్లవకారుల జీవనసూత్రం సృజనాత్మకంగా ఆవిష్కరించబడుతుంది. అలా ఆవిష్కరించబడిన అద్భుత సంగీతమే విక్టర్ జారా జీవితం.




విక్టర్ జారా సహచరి జోన్‌జారా. విక్టర్‌తో గడిపిన జీవితాన్ని, తన జ్ఞాపక శిథిలాల్లోంచి ఏరుకుంటూ, పేర్చుకుంటూ ప్రజాకళల సందేశాన్ని మనకందించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలం నుండి, చిలీలో విప్లవ వ్యతిరేక నిర్బంధకాండకు విక్టర్ జారా బలైపోయేంత వరకు.... అంటే 1973 సెప్టెంబర్ నాటి తీవ్ర పరిణామాల వరకు, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని ప్రజలలో రగిల్చేందుకు సాంస్కృతికోద్యమం నిర్వహించిన కర్తవ్యాలను విక్టర్ జారా జీవితం ద్వారా ఆమె మనకు చూపారు. చిలీ నలుమూలల నుండి సేకరించిన జానపదాలకి శ్రామికవర్గ ప్రాపంచిక దృక్పథంతో ప్రజల చూపునిచ్చి ప్రాణం పోసిన విక్టర్ జారా జీవితాన్ని ఎంతో తపనతో, ఆశతో, బాధ్యతతో భవిష్యత్తు తరాలకు అందించాలని ఆమె ఈ పుస్తకాన్ని రాసారు. హైదరాబాదు వాసి, పిల్లల వైద్యురాలైన డా॥ నళినిగారు తెలుగు పుస్తకమేనన్నంత చక్కగా తెలుగులోకి అనువదించి మనకు అందించారు.

రెండవ ప్రపంచ యుద్ధ మేఘాల కింద, జర్మన్ బాంబుల వర్షాలలో.... బాంబుదాడి వ్యతిరేక షెల్టర్‌లలో బాల్యాన్ని గడిపిన జోన్ జారా ఈ పుస్తక రచయిత్రి. ఆమె తన తల్లితో కలిసి 1944 జూలైలో చూసిన "ఆకుపచ్చ బల్ల" బ్యాలే ఆమె జీవితం మీద ఎనలేని ప్రభావం చూపింది. ప్రపంచ పెత్తందారులు కల్పించిన యుద్ధ బీభత్సపు వికృత శిశువు 'చావు'కు ప్రజలు బలైపోతున్న తరుణంలో, భర్త యుద్ధానికి బయలుదేరగా.... తన నైజానికి విరుద్ధంగా యుద్ధానికీ, చావుకీ ఎదురేగుతూ గెరిల్లా పోరాటం చేయడానికి భార్య సంకల్పించడమనే ఆ బ్యాలే అంకం జోన్‌ను తీవ్రంగా కదిలించివేసింది. బ్యాలే కళాకారిణిగా, నృత్యకారిణిగా తనను తాను మలచుకోవాలని సంకల్పించింది. అలా ఆమె ప్రజాకళలతో, లాటిన్ అమెరికన్ ప్రజాకళలతో, చిలీతో సంబంధంలోకి వెళ్ళి, విక్టర్ జారా సహచరి అయ్యారు.

చిలీలో గ్రామీణ ప్రాంతపు ధనికులకు చెందిన శాశ్వత రైతుకూలీల కుటుంబాలైన 'ఇంక్విలినో'ల నుండి వచ్చిన జారాకు తల్లి అంటే ఎనలేని ప్రేమ. తల్లి అమండా కష్టజీవి మాత్రమే కాదు జానపద గాయిని కూడా. పెళ్ళిళ్ళు, చావులు, పంటకోతల్లో ఆమె ఎక్కడకు వెళ్ళి పాడినా జారా వెంటే వుండేవాడు. 1950లో తల్లి చనిపోయిన తర్వాత అతడు సంగీతపు ప్రశాంతత వెతుకుతూ చర్చిని చేరాడు. కానీ మన శరీరం మనకే భారమై, తప్పనిసరిగా మోయాల్సిన బరువని తలచే శుష్క ఆధ్యాత్మికతను నిరసిస్తూ చర్చి నుండి బయటపడ్డాడు. సైనిక క్రమశిక్షణ అనేది సాధారణ సైనికులకు బానిసత్వాన్ని అలవర్చి, అధికారులకు పెత్తనాన్ని నేర్పించడమేనని జారా గ్రహించిన ఫలితంగా సైనిక జీవితాన్ని కూడా విడిచిపెట్టేసాడు. 1954 చివరలో జారాలో కొత్త అవగాహన రూపొందింది. తల్లి సంగీతపు వారసత్వం మరల అతన్ని ఆవహించింది. స్నేహితులతో కలిసి చిలీ సందర్శించి జానపద సాహిత్యాన్ని సేకరించడమే ధ్యేయంగా ఎంచుకున్నాడు. చిలీ గ్రామసీమలలో, పట్టణాల శ్రమజీవుల పేటలలో ప్రజలలో వున్న సాహిత్యాన్ని, ప్రజల సంగీత బాణీలను సేకరిస్తూ ప్రజలలో సోషలిస్టు భావజాలాన్ని, వ్యాపింపజేయడానికి పనిముట్లుగా మార్చే సాంస్కృతికోద్యమ కర్తవ్యంలో తలమునకలైపోయాడు.

సోషలిజం సాధనకు ఏది సరైన దారి?!.. అనే ప్రశ్న వచ్చినపుడు అనేక లాటిన్ అమెరికన్ దేశాలు గెరిల్లా యుద్ధతంత్రాన్ని అనుసరించగా..., చిలీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను అనుసరించింది. దశాబ్దాల అమెరికన్ సామ్రాజ్యవాదపు దోపిడీ విధానాల ఫలితంగా చిలీ ఆర్థికంగా, రాజకీయంగా చితికిపోయింది.

ప్రజలలో జాతీయతాభావాలు తలెత్తకుండా అమెరికన్ చౌకబారు సాహిత్యమూ, పత్రికలు, పాటలు, సినిమాలు చుట్టుముడుతూ సాంస్కృతిక దాడి తీవ్రమైపోయింది. దేశ సంపదలపై విదేశీ కంపెనీల దోపిడీని నివారించాలనేది బలమైన ప్రజాకాంక్షగా ముందుకొచ్చింది. సోషలిస్టులు, కమ్యూనిస్టు రాడికల్స్, కొంతమంది క్రిస్టియన్ డెమొక్రాట్లు కలిసిన కూటమి పాపులర్ యూనిటీకి సాల్వడార్ అలెండీ నాయకత్వం వహించాడు. 1970 నవంబర్లో ఎన్నికైనప్పటి నుండి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కాపాడుకుంటూ, పౌరహక్కులను గౌరవిస్తూ, సోషలిస్టు మార్గంలో చిలీని పునర్నిర్మించేందుకు సంఘర్షణ పడసాగాడు. నష్టపరిహారాలేమీ ఇవ్వకుండా అమెరికా ఆధీనంలోని రాగి గనుల కంపెనీలను జాతీయం చేసాడు. రైతు సహకార వ్యవసాయం కోసం పెద్ద ఎత్తున ఎస్టేట్లను స్వాధీనం చేసుకున్నాడు. దేశభక్తియుతమైన ఈ చర్యలకు ప్రజలను సిద్ధం చేసేందుకు ప్రజాసాంస్కృతికోద్యమం ఎంతగానో కృషిచేసింది. ఈ కృషిలో విక్టర్ జారా భాగస్వామ్యం అపురూపమైనది. చిరస్మరణీయమైనది. ఐతే ఈ చర్యలు సహజంగానే అమెరికన్ సామ్రాజ్యవాదానికి కంటగింపయ్యాయి. 1973లో జరిగిన ఎన్నికలలో కూడా అలెండీ 44% ఓట్లను గెలుచుకుని ఆధిపత్య స్థానంలోనే ఉన్నాడు. ఐనా సరే చిలీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తూ పినోచెట్ నాయకత్వాన సామ్రాజ్యవాద ప్రభువులు సైనిక తిరుగుబాటు చేయించారు. కనీవినీ ఎరుగని దమనకాండ కొనసాగింది. 1973 సెప్టెంబర్ 11న అలెండీ, సెప్టెంబర్ 14న (జోన్ జారా అంచనా) విక్టర్ జారా.... ఇంకా వేలమందిని చిలీ జాతీయ స్టేడియం వంటి వాటిని నిర్బంధ శిబిరాలుగా ఉపయోగించి ప్రజానాయకులను చిత్రహింసల పాలుచేసి చంపివేశారు.

పుస్తకం చదువుతున్నంతసేపూ మహాసముద్రాల ఆవల ఉన్న చిలీకి, భారతదేశానికీ ఉన్న సామ్యాలే గుర్తుకు వస్తాయి. గ్రామ సీమలలో పేద రైతులు, రైతుకూలీల దయనీయ స్థితి నుండి, పట్టణాల దుర్భర చాకిరీల మధ్య మసకబారుతున్న కార్మికవాడల జీవితాలు కళ్ళముందు కదులుతుంటాయి. అక్కడ రాగి గనుల దోపిడీని తెలుసు కుంటుంటే ఇక్కడ సహజవనరుల లూటీ వలన దిగజారిపోతున్న ప్రజల జీవితాలు స్ఫురిస్తుంటాయి. దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ప్రజాసాంస్కృతికోద్యమాలను నిర్మించే కృషిలో రాజ్యపు దమనకాండకు బలైపోయిన ఎందరో సఫ్దర్ హష్మీలు వంటి కళాకారులు గుర్తొస్తారు. విక్టర్ జారా అసంపూర్ణ గీతంతో పుస్తకం ముగిసి గుండె బరువెక్కు తుంది. దోపిడి వ్యతిరేక చైతన్యాన్ని తట్టిలేపే ప్రజాసాంస్కృతికోద్యమ కర్తవ్యాలను గురించిన ఆలోచనలు మస్తిష్కంలో ముసురుకుంటాయి. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ప్రజలు అభ్యుదయం వైపు అడుగులు వేస్తారని, సోషలిజాన్నే కోరుకుంటారని స్పష్టం అవుతుంది. ఇటీవల చిలీలో జరిగిన ఎన్నికలలో అవినీతిని, అసమానతలను వ్యతిరేకిస్తూ రాజ్యాంగ సవరణను గట్టిగా ప్రతిపాదిస్తూ, గాబ్రియల్ బోరిచ్ నాయకత్వం విజయం సాధించింది. వారు తీసుకువస్తున్న, సోషలిస్టు విధానాలు ప్రజల సమతా కాంక్షలను ఏవిధంగా గెలిపిస్తాయో చూడాలి.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన 'అలకనంద ప్రచురణలు' వారు ఎంతైనా అభినందనీయులు. సాంస్కృతిక విధ్వంసాన్ని సృష్టిస్తూ ప్రజలపై దోపిడీ పీడనలను మరింతగా అమలు చేస్తూన్న పాలకవర్గ విధానాలను ఎదురొడ్డగల స్ఫూర్తిని 'విక్టర్ జారా.... అసంపూర్ణ గీతం' ఇచ్చింది.

**విక్టర్ జారా.... ఒక అసంపూర్ణ గీతం;**
ప్రచురణ : **అలకనంద ప్రచురణలు;** పుటలు : 240; వెల : 200/-
దొరుకుచోటు : **అలకనంద ప్రచురణలు,**
**#59-6-15, కంచుకోట వీధి, మేరిస్ స్టెల్లా కాలేజి ఎదురుగా,**
**విజయవాడ - 520008.** ✦

# గొట్టుముక్కల సీతారామరాజు
## 3వ వర్ధంతి



**గొట్టుముక్కల** సీతారామరాజు 1937 ఆగస్టు 15న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని వెంప గ్రామంలో జన్మించారు. అదే గ్రామంలో కామ్రేడ్ ఉద్దరాజురామం నాయకత్వాన జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి ప్రభావితుడైనారు. తండ్రి నుండి పుణికి పుచ్చుకున్న జాతీయోద్యమ భావాలతో అభ్యుదయ సాహిత్య అభిమానిగా, అభ్యుదయ రచయితల సంఘ నాయకులైన తుమ్మల వెంకట్రామయ్యగారితో స్నేహ సంబంధాలు నెరిపారు. 'సితార' కలం పేరుతో రచనలు చేశారు. కాలక్రమంలో విప్లవ భావజాల బృందంతో నడిచారు. 'ప్రజాసాహితి'కి అభిమానిగా, సన్నిహితునిగా వున్నారు. వారి కుటుంబసభ్యులు హేతువాద, అభ్యుదయ భావాభిమానులు కావటానికి చేయూతనిచ్చారు. రాజుగారి తొలి వర్ధంతి (మరణం 1-2-2019) సందర్భంగా వారి మనుమరాలు డాక్టర్ పి. స్నేహ 'ప్రజాసాహితి' పత్రికకు రూ॥ 25 వేలు విరాళంగా అందించారు. గొట్టుముక్కల సీతారామరాజుగారిని వారి 3వ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' జ్ఞాపకం చేసుకుంటూంది. ✦

## జాతీయ అక్షరయోధులు



గోవింద్ పండరీనాథ్ పన్సారే

(1933 - 2015)

2

సింగంపల్లి అశోక్‌కుమార్

# అగ్గి మరాఠా

**గోవింద్ పండరీనాథ్ పన్సారే**
**మతోన్మాదానికి హేతువాద ఆన్సరే**
**ముస్లింల వ్యతిరేకి వీరశివాజీ అనే**
**అశాస్త్రీయ అభాండాల విధ్వంసరే**

**'శివాజీ ముస్లిం వ్యతిరేకికాదనీ, సెక్యులర్ భావాలు పుష్కలంగా ఉన్నవాడనీ, మహిళలను గౌరవించాడనీ, రైతులకు మేలుచేసే ఎన్నో సంస్కరణలు చేశాడనీ, దళితులను, వెనుకబడ్డ వారినీ ఉన్నత పదవుల్లో నియమించాడనీ, బానిసత్వ నిర్మూలనకు కృషి సల్పాడనీ శాస్త్రీయ ఆధారాలతో నిరూపిస్తూ' 'శివాజీ కౌన్ హోతాహై' పుస్తకం ద్వారా తెలియచేసిన ప్రగతిశీల ప్రతిభాశాలి పూర్తి పేరు గోవింద్ పండరీనాథ్ పన్సారే. భారతీయ మరాఠీ రచయిత, న్యాయవాది, హేతువాది, మార్క్సిస్టు సామాజిక కార్యకర్త.**

సోషలిస్ట్‌భావాల రాష్ట్రసేవాదళ్ సంస్థలో చేరి వారు నిర్వహించే స్కూలులో చదువుకున్నారు. ఆయన ఎన్నికలలో ప్రచారంచేసిన కమ్యూనిస్టు నాయకుడు ఆయన్ని కొల్హాపూర్‌లో రాజారాం కళాశాలలో బి.ఏలో చేర్పించి ప్రోత్సహించారు. బి.ఏ.డిగ్రీ పూర్తిచేసిన తరువాత శివాజీ న్యాయకళాశాలలో న్యాయశాస్త్రం చదివి పట్టభద్రులయ్యారు.

గోవింద్‌పన్సారే రాజారాం కళాశాలలో చదువుతున్నప్పుడే కమ్యూనిజంతో పరిచయం ఏర్పడింది. వామపక్ష కార్యకర్తలు నడిపే రిపబ్లిక్ కమ్యూనిస్టు బుక్‌స్టాల్ నుండి వామపక్ష భావజాలం గల అనేక పుస్తకాలు అధ్యయనం చేశారు.

1952లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ)లో చేరారు. సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం, గోవా లిబరేషన్ ఉద్యమాలలో పాల్గొన్నారు. 1964ల లేబర్ సమస్యలపై న్యాయవాదిగా ఉన్నారు. సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ఎక్సిక్యూటివ్ సభ్యునిగా పనిచేశారు. టోల్‌గేట్ చార్జీలకు వ్యతిరేక ఉద్యమం నడిపారు. 'శ్రామిక్ ప్రస్థాన్'అనే సంస్థ పేరుతో అనేక కార్యక్రమాలు రాజకీయ సామాజిక ఉద్యమాలు నడిపారు. మగబిడ్డను కలిగిస్తుందని భావించే హిందూ దురాచారం అయిన పుత్రకామేష్టి యాగాన్ని వ్యతికించారు. కులాంతర మతాంతర వివాహాలు ప్రోత్సహించారు. ఆయన ముగ్గురు సంతానం కులాంతర వివాహాలు చేసుకున్నారు.

1987లో ఛత్రపతి శివాజీపై 'శివాజీ కౌన్ హోతా హై'అనే పుస్తకం రాసి, నిక్కచ్చి నిజాలతో సంచలనాన్ని రేకెత్తించిన పన్సారే పుస్తకం ఇంగ్లీషుతో పాటు, అన్ని జాతీయ భాషలలోకి అనువాదమై లక్షల ప్రతుల్లో అమ్ముడై అసామాన్య చైతన్యాన్ని రగిలించింది. పన్సారే 21 పుస్తకాలు రాశారు. ఆయన రచనలు అన్నీ సామ్యవాద వెలుగుల్లో సామాజిక తప్పులపై చెలరేగే నిప్పుల వ్యాఖ్యానాలే.

ఐదుగురు తోబుట్టువులలో చిన్నవాడిగా హర్నాబాయి, పండరీనాథ్ దంపతులకు 1933 నవంబరు,26న మహారాష్ట్ర అహమద్‌నగర్ జిల్లాలోని కొల్హార్‌పూర్ గ్రామంలో జన్మించిన పన్సారే 2015 ఫిబ్రవరి,16న భార్యతో కొల్హార్‌పూర్‌లో మార్నింగ్‌వాక్‌కి వెళ్లివస్తుండగా గుర్తుతెలియని హిందుత్వవాద హంతక ముఠా వ్యక్తులు మోటారు సైకిళ్లపై వచ్చి దారుణంగా కాల్పులు జరిపారు. చికిత్సపొందుతూ నాలుగు రోజుల అనంతరం బొంబాయి ఆసుపత్రిలో నవంబరు 20 రాత్రి కన్ను మూశారు. ✦



వ్యం గ్యం

# రివర్స్ గేర్ (?)

– శంకరం

**జగన్నాథం....** బాగున్నావా?

ఓరి ఓరి.... సాంబ్రాజూ ఎట్టున్నావ్? ఏటిలగెలిపొచ్చినావ్? ఎన్రోజులయ్యింద్రా నిన్ను సూసి.... దా.. దా.... కూకో. ఓయ్ ఇంటావిడా.... ఎవురొచ్చినారో సూడు.....

నీ అడావిడి ఏం తగ్గనేదురా దాసూ!

అంతేగదా, ఏందీడు జగన్నాదమని పిలుస్తుండేంటనుకున్నా, దాసంటేనే గదూ మనం దగ్గిరయ్యేది?

నువు నన్ను సాంబ్రాజనగానే నాకు మన పాత రోజులు గేపకానికొచ్చినై, నువు నన్ను మర్సిపోనావేమో అనుకుంటె....

ఎట్టారా మర్సిపోయీది, దొంగ సారా యాపాపరం సేసే కదా మనం ఎదిగింది.... గదే మర్సిపోతే ఎట్టా? సరె గానీ, ఏందిట్టా వస్తివి సెప్పనేలేదు.... ఇంట్లో అంతా మంచిగున్నరు గందా?

అంతా మంచిగనే వుంది. ఈ మద్దిన నీ పేరు మారుమోగి పోతుండాది. సిన్నప్పటి దోస్తువు గదా నీ వైబోగాన్ని సూసిపోదామని వస్తి.

నువ్వు ఏమీ మారలేదబ్బా.... సిన్నప్పటి సంది దోస్తులంటే పేనమిస్తవ్. ఇంతకీ నీ సెవిల పడ్డ మాటేవిటంట నా గురించి?

నీ ఊరోల్లంతా కట్ట గట్టుకొని వొచ్చినారంట నీ మీదికి, అంత జనాన్ని ఏం గాకుండా నెమ్మదించి పంపినావంట. ఏం రాజకీయం సేస్తుండబ్బా అనుకుంటా వుండారు. ఆ యవ్వారవేందో తెల్సుకుందామనే వస్త!

ఏం లేదురా, వచ్చినోల్లందరూ సెరువు పన్లు సేసెటోల్లు. మా వార్డు మెంబర్లని ఎంటోసుకునొచ్చినారు.

ఎందుకొచ్చినారేటి?

దీనికి సమాదానం సెప్పాలంటే నీకు ఒక సరిత్ర సెప్పాలి.

సెప్పురా, ఇందామనే కదా వస్త, సెప్పుమీ!

నేనీడ సర్పంచ్‌గ సేత్తన్నానని నీకు తెల్సుండాదా?

నువు సర్పంచివన్దెల్సు, నీ అతికారానికి ఈడ అడ్డునేదని కూడా దెల్సింది.

ఆ! ఆ అతికారాన్ని నాలుక్కాలాల పాటు నిలబెట్టుకుంటేనే నాల్గు తరాలకి సరిపడా పోగేసుకోవచ్చని ఎవురైనా అనుకుంటారుగా. నాను గూడా అదే ఐడియా ఏసేను.

ఏట్రో ఆ ఐడియా?

నీకు తెల్సుగా యవుసాయం గిట్టుబాటు గాట్లేదని. సానామంది రైతులు ఊరొగ్గేసి సెన్నైకి, కాశ్మీరికీ పొయ్యిన్నారు. సెరుకు పండించి మన పేక్టరీకి తోల్తే టన్నుకి 2500 కూడా ఇవ్వడంనేదు. దాంతో సెరుకు పండించీవోల్లు కూడా తగ్గిపోనారు. అప్పుల్జెయ్యనీకి నాకాడికే వత్తారు. బూవులు తనకాబెట్టి వడ్డీకి అప్పులిత్తాను. తీర్సనేకపోతే బూవులు మన కాతాలోకే సేరుతాయి.

అట్టా బూవులు పోగొట్టుకున్నోల్లంతా బయటికి పోత్రన్రంటావు?

అబ్బే! అందర్నీ అంపిత్తే మనవెట్టారా బతికీది?

మరేటి సేత్తన్నావేటి?

ఆ! అలగడుగు. మన ఇలవేలుపు సారా తల్లుంది గదా. కొందరిసేత సారా కాయిత్తాను, కొందరిసేత సారా దుకానాలెట్టించినాను. జనాలికి బాగా తాగుడు అలవాటు సేసినాను. ఇంకొందరికి కార్డులిప్పించి సెరువు పన్లో ఎట్నాను. మనెనకాల తిరిగెటోల్లకి సిన్న సిన్న కాంట్రాట్టులిప్పిత్తాను.

బలే సేత్తన్నావ్రా, అందుకనే నిన్ను మకుటంలేని మారాజంతన్నారు.

ఇంతే అనుకుంతన్నావేటి? ఇంకా వుంది. ఊల్లోకొచ్చినపుడు సూసే వుంటావు కోరీలు, అయ్యన్నీ మనవే. అందల పన్జేసేది గూడా ఈ బూవులు పోగొట్టుకున్నోల్లే. ఇంకా కొండల మీంచి వచ్చీ గెడ్డల్లోని ఇసక కూడా మనదే. ఆడ గూడా కొంతమందికి పనిచ్చినాను.

ఏం ప్లేనింగ్ సేసేవ్రా, ఓ పక్క అప్పులిచ్చి బూవుల్నొక్కేసి ఇంగో పక్క కొండల్నీ, గెడ్డల్నీ కబ్జా సేసేసి బూవులు పోగొట్టుకున్నోల్లందర్కీ పన్లు సూపించి నీ పబ్బం గడుపుకుంటా వున్నావు. అంతా బానే వుంది గానీ ఇంతకీ సెరువు పనోల్లు నీ మీదికెందుకొచ్చినారో సెప్పినవు గాదు!

ఆడకే వత్తన్నా. ఊరంతా మనవే దోసుకుంతన్నారని పెజానీకం గోలెడితే ఎగస్పార్టీవోల్లకి సేతికి రాయిచ్చినట్టవుద్ది. అందుకని ఊల్లో సిన్న సిన్న గుల్లు కట్టించి అన్నచంతర్పనలు సేయిత్తుంటాను. ఊల్లో కుర్రోల్లు ఆడుకునీకి కికెట్టు బేట్లు, బంతులు కొనిత్తాను. అప్పుడప్పుడు ముసిలీ ముడక్కీ సీరలూ, దుప్పట్లు పంచిపెడుతుంటాను.

ఓరిదంతా ఇంటావుంటే ఏదో రావుగోపాల్రావు సినిమా సూసినట్టుంది. ఇంతకీ ఇయ్యన్నీ నీ డబ్బుల్తోనే సేత్తన్నావంటే మా గొప్పోడివిరా నువ్వు....

ఆగాగు తొందరపడి నిర్నయాలు సేసీకు, ఈ పన్లన్నీ సెయ్యనీకి సెరువు పన్లు సేసెటోల్ల పేమెంటుల్లో కోతలెట్టీసేను, రేసన్ డీలర్‌కాడ కొంత బొక్కుతాను, రివర్స్ టెండరింగులు సేసి కొంత మిగిల్చినాను....

రివర్స్ టెండరింగులంటేట్రా?

పాత ప్రభుత్తంలో వర్కుల మీద ఏసిన టెండర్లని ఎక్కువకి ఏసీసేరని మళ్లీ టెండర్లు కొత్తోల్లసేత ఏయించేను. కొంత మిగిల్చినాను. కంటెంజెంట్ వర్కర్ల కాడ, కాంట్రాట్టు వర్కర్లకాడ మిమ్మల్ని పెరమనెంటు సేయిత్తానని కొంత నొక్కినాను....

అమ్మనీ.... గుండిల్దీసిన బంటువిరా.... నీ సేతి సమురొరాదలకుండా మంది సొమ్ముల్తో దర్మదాతలాగా ఎలిగిపోతన్నావు. ఎన్ని రాజకియ్యాలు నేర్సినావురా? అది సరే, ఇంతకీ తగువెలగ సర్దినావు?

అదా, ముందే సెప్పినాను గదా పెతానంగా వచ్చినోల్లు సెరువు పనోల్లు. ఆల్లతోపాటు నాను డబ్బుల్నొక్కేసిన కంటెంజెంట్, కాంట్రాక్టు వర్కర్లు కూడా నా మీన తగువుకెలిపొచ్చినారు. ఆల్లకి నీడర్లు మా వార్డు మెంబర్లు. రెండు, మూడ్రోజులు గోల్సెయ్యనిచ్చి మాట్టాడకుండా మనెమ్మటే తిరిగివోల్లకి కర్ర ఇరగకుండా, పాము సవ్వకుండా సమిస్సని తెగ్గొట్టమన్నాను. కోతలెట్టేద్దాంట్లో కుసింత పెంచి, బాగా ఆలోచించుకొండి, ఇంతకి మించి ఇవ్వనేం, కరోనా వచ్చి ఆర్తిక పరిస్థితులు బాగునేవు అని సెప్పించేను.... వార్డు మెంబర్లు వల్లకున్రా, ఆల్లకీ రాజకియ్యాలు తెల్సుగందా? ఆల్లని ఎక్కడ నొక్కాలో అక్కడ ముందే నొక్కేసినాన్రా. మన గెస్టోస్కి తీస్కెల్లి తాగినోడికి తాగినంత, తిన్నోడికి తిన్నంత ఎట్టించేను. నా ఎనకాలుంటే వచ్చీ ఎలచ్చన్ల కూడా మీకే టికెట్లిప్పిత్తానని బొమ్మ సూపించినాను....

ఇంతకీ ఎప్పుడూ లేంది సానామందే నీ మీనకొచ్చినారన్దెల్సింది. పెజల్లో ఇంత ఆగ్గరహం ఎందుకొచ్చినాదంటావ్?

ఎందుకంటావేట్రా? మార్కెట్లో దరలన్నీ పెరిగిపోనాయ్, సదూకున్నోల్లకి ఉజ్జోగాలేవీ దొరకడంనేదు, యవుసాయాన్ని పండ బెట్టేసినాం. ఇయ్యన్నీ సాలక ఈ మజ్జెన ఇల్ల పన్నులు, నీటి పన్ను, సెత్త పన్ను అన్నీ పెంచేసినాను....

మరి ఎవురూ కోర్టులకెల్లరేట్రా?

ఇక్కడ మనవే కోర్టు, మనవే పోలీసు, మనం సేసిందే సట్టం. జనం బతుకుతా వుంటారు, పడుతూ నెగుస్తూ, జనాలికి కడుపులు బాగా నిండిపోతే మనం గేపకముండం, అందుకని....


ఒక సేత్తో ఇచ్చినట్టే వుంటది – ఇంగో సేత్తో మాత్రం నాక్కుంటన్నావు.

అంతే! కరెస్టుగ జెప్పినవ్. కోర్టులు ఎన్ని మొట్టికాయలేసినా, మనం పెంచిన పన్నులు సెల్లవన్జెప్పినా మన్దారిలో మనం పోతా వుంటాం.

నిజవే! మొండోడు రాజు కంటే బలవంతుడు! మొత్తం మీద పరిపాలనంతా నీకు ముందు గేర్లోనూ, పెజలకి రివర్స్ గేర్లోనూ నడుపుతున్నావ్! నిన్ను జూసి సానామంది రాజ్జాలేలేవోలు నేర్చుకోవాల్సింది సానా వుందిరా!

మన గొప్పేవుందరా, మొత్తం దేశాన్నే గెడ్డాలు పెంచేసుకున్న యోగులు, బాబాలూ రివర్స్ గేర్లో నడిపిత్తుంటేను!!! ✦

# సాహితీవేత్త నాగళ్ళ గురుప్రసాదరావు మరణం



**సంప్రదాయ,** ఆధునిక తెలుగు సాహిత్యంపై సాధికారత సాధించిన తెలుగు అధ్యాపకులు నాగళ్ళ గురుప్రసాదరావు తన 88వ యేట విజయవాడలో 21-2-2022న మరణించారు. ఆయన గుంటూరుజిల్లా చెరుకుపల్లి మండలంలోని కావూరులో 1933లో జన్మించారు.

మదరాసు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. పట్టా పొందిన గురుప్రసాదరావు లయోలా కళాశాల (విజయవాడ) జె.కె.సి. కళాశాల (గుంటూరు), ప్రాచ్య కళాశాల (తాడికొండ)లో తెలుగు అధ్యాపకులుగా పనిచేసారు. 1978లో సిద్ధార్ధ కళాశాల, (విజయవాడ)లో చేరి వివిధ హోదాలలో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1990 నుండి 2013 వరకు సిద్ధార్ధ కళాపీఠంకి కార్యదర్శిగా పనిచేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సాహిత్యకారులతో ఉపన్యాసాలను కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఆయన సౌమ్య స్వభావుడు. కాని మతోన్మాదులను ఎదుర్కోవడంలో ధీరుడు. హిందూ-ముస్లిముల ఐక్యత అనే అంశంపై చారిత్రక ఆధారాలతో పలు ప్రసంగాలు చేసి మతోన్మాదుల ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఆయన 100కు పైగా సాహిత్య, చారిత్రక వ్యాసాలు, 300 పుస్తక సమీక్షలు రాశారు. శ్రీశ్రీ భావజాలాన్ని విమర్శిస్తూ, శ్రీశ్రీ శైలిలోనే తన మత ఛాందస భావజాలంతో ముదిగొండ శివప్రసాద్ 1960లలో రాసిన 'మహాసర్గ' కవితాసంపుటిని చీల్చి చెండాడుతూ ఆయన 'భారతి' పత్రికలో సమీక్ష రాసారు.

ఆంధ్రుల చరిత్రను వివరించిన ఆయన పుస్తకం 'శాలివాహనుడు' పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించింది. "ఇద్దరు మహాకవులు" అనే ఆయన గ్రంథాన్ని డెట్రాయిట్‌లోని అంతర్జాతీయ సంస్థ ప్రచురించింది. ఆయన 'సౌందర్యానంద' కావ్యాన్ని సమీక్షిస్తూ తెలుగు సాహిత్యంపై బౌద్ధం, గాంధీవాదాల ప్రభావాన్ని వివరించారు. తాళ్ళపాక తిరువేంగళప్ప కృతి 'శృంగారామరుక కావ్యా'న్ని పరిష్కరించారు. ఆయన 2017లో కేంద్ర సాహిత్య అకాడమీ వారి భాషా సమ్మాన్ అవార్డు అందుకున్నారు. భారత సాంస్కృతిక శాఖ వారి ఫెలోషిప్ పొందారు.

చివరి సంవత్సరాలలో వినికిడి సమస్య రావడంతో తరచు వారిని కలవలేకపోయాము. 'ప్రజాసాహితి'ని అభిమానించేవారు. 'ప్రజాసాహితి' భవననిధికి వారి అమ్మగారి పేరుతో విరాళం ఇచ్చారు. ప్రజాసంస్కృతినీ, ప్రజాసాహిత్యాన్నీ అభిమానించిన నాగళ్ళ గురుప్రసాదరావు మరణానికి జనసాహితి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తోంది. ✦

# మతద్వేష రాజకీయాలతో దేశాన్ని రోగగ్రస్తం చేస్తున్న మతతత్త్వ శక్తులు
# చెలరేగుతున్న లంపెన్ సంస్కృతి

- సూర్యసాగర్

**ఆధ్యాత్మికత,** మతము, మతోన్మాదము, మతతత్త్వము భిన్న అర్థాలను, ఆచరణలను కలిగిన విషయాలు. వీటిలో ఆధ్యాత్మికత మినహా తక్కినవి వ్యవస్థీకృత విశ్వాసాలు, ఆచరణలు కలిగినవి. మౌఢ్యము, ప్రగతి వ్యతిరేకత, ప్రగతి నిరోధకత నింపుకున్నవి. అమానవీయమైనవి. మతోన్మాదము, దానికంటే అధికంగా మతతత్త్వము, పరమత ద్వేషంతో స్వార్థపర సామాజిక, ఆర్థిక, రాజకీయ అధికార కాంక్షలకు సాధనంగా వాటికి పెట్టుబడిగా వినియోగమవుతున్నాయి. అవి అత్యంత క్షుద్రమయినవి. ప్రజల మానవీయ ఆకాంక్షలను, సామాజిక భద్రతను, శాంతిని, సంతోషాన్ని, సామరస్యాన్ని ధ్వంసిస్తాయి. విద్వేషానికి తావీయని రీతిలో మత విశ్వాసాలను పద్ధతులను ఆచరిస్తున్న అశేష సామాన్య ప్రజానీకం జీవనాన్ని కల్లోలం గావిస్తాయి. మతతత్త్వానికి మత విశ్వాసం ఒక సాకు మాత్రమే. దానికి మత విశ్వాసంగాని, దైవ విశ్వాసంగాని వుండవు. వాటి పేరుతో పరమత ద్వేషాన్ని, పరమతస్తులపై పైశాచిక దాడులను సాగిస్తూ సామాన్య ప్రజల, ముఖ్యంగా మైనారిటీ మత ప్రజల జీవితాలపై మతతత్త్వ మూకలు, మతతత్త్వ ప్రభుత్వనేతలు, ప్రభుత్వ యంత్రాంగము నిప్పులు పోస్తున్నారు. ఇదంతా జరుగుతున్నది భా.జ.పా. మెజారిటేరియన్ హిందూత్వ మతతత్త్వ క్షుద్ర రాజకీయ క్రీడలో భాగంగానే.

హిందూత్వ మతతత్త్వ భా.జ.పా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతికరంగాలలో ఎన్నడూ లేని విధంగా దేశాన్ని దిగజార్చారు. అరాచకం రాజ్యమేలుతున్నది. తమ కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక నియంతృత్వ ఫాసిస్టు తరహా దుష్పరిపాలనా విధానాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి మత విద్వేషాలను పురికొల్పి మతపరంగా ప్రజలను చీల్చి తాము హిందూమత సంరక్షకులమని చాటుకుంటూ పన్నాగాలు, ప్రయోగాలు చేస్తున్నారు. మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు సకల మతాల పేద నిస్సహాయక ప్రజలపై అత్యాచారాలు, హత్యాచారాలు సర్వసాధారణమయినాయి. సకల రాజ్యాంగ వ్యవస్థలను నయానా భయానా తమ గుప్పిట్లోకి తెచ్చుకొని ప్రశ్నించే ప్రతివారినీ వేధింపులకు, దాడులకు, జైలు నిర్బంధాలకు, హత్యాచారాలకు టెర్రరిస్టు పద్ధతుల్లో గురిచేస్తున్నారు.

అత్యధిక ప్రధాన స్రవంతి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా కార్పొరేట్ శక్తులు, భా.జ.పా. చేతుల్లో బందీ అయి భా.జ.పా. నిరంకుశ, ప్రజావ్యతిరేక జాతి వ్యతిరేక పాలనను, వైఖరులను తలకెత్తుకున్నాయి. సోషల్ మీడియాను హిందూత్వ దండు భారీగా ఆక్రమించి ప్రజల, ఉద్యమాల నిరసన స్వరాలను అణగారుస్తున్నది.

మతాతీత లౌకిక తత్త్వానికి, కనీసం తాము ప్రమాణ పూర్వకంగా స్వీకరించిన రాజ్యాంగబద్ధ విలువలకు కట్టుబడి పాలన సాగించవలసిన ప్రభుత్వ నేతలు మత ప్రచారం చేస్తూ ఊరేగుతున్నారు. మతతత్త్వ పరిపాలనతో భా.జ.పా. ప్రభుత్వాలు దేశ సమగ్రత, సమైక్యతలకు నిప్పంటిస్తున్నాయి. దీని దుష్పరిణామాలు, పర్యవసానాలు భవిష్యత్తులో కూడా సమాజాన్ని సుదీర్ఘకాలం వేధిస్తాయి.

ఏ ప్రభుత్వాలు కూడా మెజారిటీ ప్రజలే కాదు. మెజారిటీ ఓటర్లు కూడా ఎన్నుకోబడినవి కాదు. సుమారు 70 శాతం ఓటర్లలో 37 శాతం మాత్రమే భా.జ.పా. పార్లమెంటరీ అభ్యర్థులకు ఓటు వేశారు. హిందూ మత ప్రచారం చేయాలని వారు భా.జ.పా.ను ఎన్నుకోలేదు. తమ మానవీయ జీవన ఆకాంక్షలు (ప్రజాస్వామ్యం, ఆధునికత, జీవన భద్రత) తీరుస్తారని ప్రజలు ప్రతినిధులను ఎన్నుకుంటారు. ప్రజలను వంచించడమే లక్ష్యంగా నేడు పరిపాలన సాగుతున్నది.

గత డిసెంబర్ నెలలో కాశీ కారిడార్ నిర్మాణంలో తొలిదశ పూర్తయిన సందర్భంలో జరిగిన ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి మోదీ ప్రదర్శించిన హిందూత్వ అవతారం హేయమైనది. ప్రతి ఔరంగజేబుకు ఒక శివాజి వుంటాడని అక్కడ ఆయన చేసిన ప్రేలాపన అతని మేధో హీనతకు నిదర్శనం.

ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే యాభై రూపాయలకే లీటరు మద్యం అందిస్తామంటూ భా.జ.పా. రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చేసిన దివాలాకోరు ప్రకటన పట్ల వచ్చిన ప్రజానిరసన నుండి ప్రజల దృష్టి మళ్ళించడానికన్నట్లు గుంటూరులోని జిన్నాటవర్‌ను హిందూత్వ దాడికి లక్ష్యం చేసుకున్నారు.

డెబ్భై అయిదేళ్ళ క్రితం గుంటూరు పట్టణం ముఖ్య రహదారి కూడలి వద్ద నెలకొల్పిన ఒక ల్యాండ్‌మార్క్‌గా వున్న చిన్నసైజు జిన్నాటవర్ పేరును తక్షణం మార్చాలని, లేదంటే దాన్ని కూల్చివేస్తామని తెలంగాణా రాష్ట్ర భా.జ.పా. నాయకుడు రాజాసింగ్ బెదిరింపు ప్రకటన చేశాడు. సర్కస్‌లో బఫూన్‌లు కళాకారులు, రాజకీయాల్లో బఫూన్‌లు విషపు పురుగులు. వాళ్ళు శాసనసభలకు, పార్లమెంటుకు ఎన్నిక అవుతూండడమే నేటి భారతదేశ వైచిత్రి. ఆ మధ్య ఒక భా.జ.పా. కేంద్రమంత్రి కోతులు మనుషులుగా మారడం మనం చూడలేదనీ, డార్విన్ జీవ పరిణామ వాదం అబద్ధమని పత్రికా ప్రకటన చేశాడు. ఇదీ వాళ్ళ మేధో స్థాయి.

1942లో గుంటూరు ప్రాంతంలో ఒక గ్రామానికి (కొమెరపుడి?) 14 మంది స్వాతంత్ర్య సమరయోధులకు బ్రిటిష్ పాలనలోని హైకోర్టు అన్యాయంగా యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. ఆనాడు ప్రఖ్యాత

ముస్లిం నాయకుడిగా ప్రముఖ న్యాయవాదిగా పేరుగాంచిన బారిస్టర్ మహమ్మద్ ఆలీ జిన్నాను ఒక ముస్లిం నాయకుడు కలిసి హైకోర్టు అన్యాయపు తీర్పును అర్ధం చేసుకోవాలని కోరాడు. జిన్నా అంగీకరించి వకాల్తా తీసుకొని వాదించి యావజ్జీవ జైలుశిక్షను సాధారణ జైలు శిక్షగా మార్పించగలిగాడు. అందుకు కృతజ్ఞతగా గుంటూరులో జిన్నాటవర్‌ను నిర్మించారు. దాని ఆవిష్కరణ సభకు ఉన్నవ లక్ష్మీనారాయణ, కాశీనాధుని నాగేశ్వరరావు తదితర దిగ్గంతులు కూడా హాజరయినారు. ఇదీ మనకు తెలిసిన చరిత్ర. భాజపేయులకు చరిత్ర అంటే కడుపుమంట. వాళ్ళకు పురాణాలే చరిత్ర. చరిత్ర వక్రీకరణ వాళ్ళ ప్రాణవాయువు.

1947 కాలంలో జిన్నా, సావర్కర్ మాదిరే, మత ప్రాతిపదికన ద్విజాతి సిద్ధాంతాన్ని చేపట్టి దేశ విభజనకు, పాకిస్తాన్ ఏర్పాటుకు తోడ్పడి ఆ దేశ ప్రథమ గవర్నర్ జనరల్ అయ్యాడు. పాకిస్తాన్ రాజ్యాంగ సభ ప్రథమ సమావేశంలో జిన్నా చేసిన ప్రసంగం ఆదర్శ ప్రజాస్వామిక లౌకిక భావాలతో కూడి వుంది. ఆ భావనలు పాకిస్తాన్‌లో సఫలం కాలేదన్నది వేరే విషయం. పదేళ్ళ క్రితం భాజపా నాయకుడు ఆద్వాణి (అద్వాని) పాకిస్తాన్ పర్యటనలో జిన్నా గురించి ప్రశంసాపూర్వకంగా ప్రకటన చేసినప్పుడు ఆరెస్సెస్ (RSS) శ్రేణులు ఆయనను తప్పుపట్టి నిందించారు.

డిశంబర్‌లో వార్తలలోకి ఎక్కిన హిందూత్వ భావజాలం తలకెక్కిన కొందరు నికృష్టులు నడిపిన బిల్లిబాయి బూతు యాప్ (Application) వారి రోగిష్టి పైశాచికత్వానికి నిదర్శనం. ముస్లిం మహిళల (ముఖ్యంగా సామాజికరంగంలో క్రియాశీలురుగా వున్నవారి) ఫొటోలను మార్ఫింగ్ చేసి వేలానికి మహిళలు అను ప్రకటన జోడించారు. హైదరాబాద్‌లో మానవహక్కుల కార్యకర్త సమాజ సేవకురాలైన అరవయ్యేడేళ్ళ వయసుగల ఖలీదా పర్వీన్, దేశ విదేశాల్లో స్వతంత్ర పాత్రికేయురాలుగా రాణిస్తున్న జమ్మూ–కాశ్మీర్‌కు చెందిన ఇరవై ఎనిమిదేళ్ళ ఖురామలైన్ ర్బహార్, అదే రాష్ట్రానికి చెందిన న్యాయశాస్త్ర విద్యార్థిని వంటి ఎందరో ముస్లిం మహిళలు ఫొటోలు అశ్లీలమైన రీతిలో ఆ యాప్‌లో అప్‌లోడ్ అయినాయి. సంవత్సరం క్రితం సుల్లీడీల్స్ యాప్ పేరున ఇదే రీతిలో నీచమైన క్రీడను సాగించారు. ప్రభుత్వం ఆ యాప్‌ను తొలగించడం తప్ప నేరస్తుల జోలికి పోలేదు. బుల్లి, సుల్లి పదాలు బూతు అర్ధంలో వాడుతారు. ముస్లిం మహిళలను ప్రత్యేకించి ప్రశ్నించే గొంతుకలున్న వారి విమర్శనా కంఠస్వరాలను అవమానించి నొక్కివేయడానికి హిందూ మతతత్వ ముఠాలు భా.జ.పా. రాజకీయాల ప్రభావంతో, ప్రమేయంతో పుట్టుకొచ్చినవే. లంపెన్ సంస్కృతి హిందూత్వ శక్తుల పాలనలో చెలరేగడం జరుగుతున్నది. ఇలాంటి సైబర్ నేరాలను అరికట్టి, నేరస్తులను శిక్షించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదు. ఇక అయోధ్య వివాదంపై తీర్పు న్యాయ వ్యవస్థపై నమ్మకాలను వమ్ముచేసింది.

అదే డిశంబర్ నెలలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో ధర్మసంసద్ పేరిట హిందూత్వ బ్రిగేడ్ జరిపిన సమావేశంలో యతినర్సింగానంద్, సాగర్‌సింగ్ మహరాజ్ తదితరులు ముస్లిం సమాజం గురించి నేరపూరిత విద్వేష ప్రసంగాలు చేశారు. హిందువులు ఆయుధాలు ధరించి ముస్లింలను సామూహిక హత్యాకాండకు (genocide) గురిచేసి మయన్మార్‌లో రోహింగ్యాలను వేటాడి తరిమినట్లు తరిమివేయాలని బాహాటంగా పిలుపిచ్చారు. భారత్‌ను హిందూ రాష్ట్రంగా ప్రకటించాలని అన్నారు. మోడీతో సహా భా.జ.పా. నాయకులు ఎవరూ ఆ నేర ప్రసంగాలను ఖండించిన పాపాన పోలేదు. న్యాయస్థానాలు దాన్ని సుమోటోగా కేసుగా తీసుకొని విచారణ జరపడానికి సిద్ధపడలేదు. ఆ ప్రసంగాలు మొత్తం ముస్లిం సమాజాన్ని తీవ్రమైన అభద్రతా భావంలోకి నెడతాయి. నెట్టినాయి కూడా. హిందూత్వశక్తులు ప్రవచించే హింసాకాండ దేశాన్ని అంతర్యుద్ధం పాలుచేసి, భారతదేశ ఉనికినే ప్రశ్నార్ధకం చేయగలదు.

హిందూత్వ శక్తుల ఉద్దేశాలను ఆచరణల ప్రమాదాలను గురించి విశాల ప్రజానీకాన్ని జాగృతపరచి, అవి అన్ని మతాల జనసామాన్యానికి ఏవిధంగా కంటక ప్రాయమవుతాయో వివరించి మత సామరస్య సమాజాన్ని కాంక్షించే విధంగా చైతన్యపరచవలసిన అవసరం మన ముందున్నది. రైతాంగ వ్యతిరేక వ్యవసాయ చట్టాల రద్దుకై అపూర్వంగా ఉద్యమించి సఫలమైన రైతాంగ పోరాటం నుండి స్ఫూర్తిని నింపుకోవాలి. ముస్లిం వ్యతిరేక పౌరసత్వ చట్టానికి (CAA), జాతీయ పౌరసత్వ చిట్టా (NRC) చట్టానికి నిరసనగా ముస్లిం మహిళలు, ప్రజాతంత్రవాదులు ఢిల్లీ నగరం నడిబొడ్డున సాగించిన అద్భుత ఉద్యమాన్నుండి నేర్చుకోవలసింది ఎంతో వుంది. ✦

## ఆహ్వానం

## 30వ జాతీయ నాస్తికమేళా

**2022 మార్చి 12, 13** **చార్వాకాశ్రమం**

**ప్రత్యామ్నాయ** ప్రజాసంస్కృతిని, భౌతికవాద జీవన విధానాన్ని ప్రచారం చేస్తూ 1992 నుండి 30 సం॥లుగా ఫిబ్రవరి రెండవ శని, ఆదివారాలలో నాస్తికమేళా జరుగుతూంది.

కరోనా మూడవ దఫా ఉధృతి వల్ల ఈ సంవత్సరం మార్చి 12, 13 తేదీలకు మార్చబడింది. చార్వాకాశ్రమం, గుంటూరు జిల్లా మంగళగిరి నుండి నిడమర్రుకు వెళ్ళేదారిలో వుంటుంది.

అసమాన సమాజాన్ని మార్చటానికి భౌతికవాద భావజాల తోడ్పాటునూ, అన్వయింపుల గురించి తెలియచేస్తూ వివిధరంగాల ప్రజాసంఘాల బాధ్యుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మేజిక్‌షోలు, మూఢనమ్మకాల గుట్టును రట్టు చేసే అనేక ఇతర కార్యక్రమాలు ఉంటాయి. ✦




## ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో ఒక యుద్ధవ్యతిరేక సోవియట్ సినిమా 'కమ్ అండ్ సీ'

- కె. రాజశేఖరరాజు

**రెండు** ప్రపంచ యుద్ధాల గురించి, వియత్నాంలో అమెరికా సాగించిన యుద్ధం గురించి తదితర చారిత్రక యుద్ధాల గురించి ఎన్నో సినిమాలు మనం చూసి ఉండవచ్చు. 'ది బ్యాటిల్‌షిప్ పొటెంకిన్'ని మర్చిపోలేం. 'ఒమర్ ముక్తర్'ని మర్చిపోలేం. సైనికులారా యుద్ధాన్ని మానండి అంటూ చార్లీ చాప్లిన్, ఆర్యజాతి సముద్ధరణ కర్త హిట్లర్ బతికుండగానే అంటే 1942లోనే పొలికేక వేసి మరీ తీసిన 'ది గ్రేట్ డిక్టేటర్'ని మర్చిపోలేం. 'వార్ అండ్ పీస్'ని మర్చిపోలేం. 'స్పార్టకస్' మూవీని మర్చిపోలేం. 'ది ప్యాసేజ్' సినిమాను మర్చిపోలేం. 'ది డైరీ ఆఫ్ అన్నే ఫ్రాంక్', 'ది యాక్ట్ ఆఫ్ కిల్లింగ్', 'ది కాజువాలిటీస్ ఆఫ్ వార్', 'లిబరేషన్', 'ది బంకర్', 'డౌన్‌ఫాల్', 'ది బ్రెస్ట్ ఫోర్ట్రెస్', 'హోలోకాస్ట్', 'షిండ్లర్స్ లిస్ట్' వంటి గొప్ప సినిమాలను అసలు మర్చిపోలేం. యుద్ధాలకు, వాటి విషాద పర్యవసానాలకు పట్టంగట్టిన మాస్టర్ పీస్ సినిమాలు ఇవన్నీ.

కానీ ఇవన్నీ ఒక ఎత్తు అయితే, సోవియట్ యూనియన్ చిత్ర దర్శకుడు ఎలెమ్ క్లిమోవ్ 1985లో తీసిన భయానక యుద్ధ వ్యతిరేక చిత్రం 'కమ్ అండ్ సీ' (Come and See)ని మనం మర్చిపోవాలన్నా మర్చిపోలేం. ఎందుకంటే యుద్ధం రేపే పాశవిక హింసను, సోవియట్ యూనియన్‌ని ముట్టడించిన నాజీల దురాగతాలను కేంద్రబిందువుగా తీసుకుని, ఈ సినిమాను చేశారు. గత 80 సంవత్సరాల ప్రపంచ సినిమా చరిత్రలో వచ్చిన కళాఖండాల్లో కెల్లా మాస్టర్ పీస్ లాంటి చిత్రం 'కమ్ అండ్ సీ'.

సోవియట్ చిత్ర దర్శకుడు ఎలెమ్ క్లిమోవ్ 1985లో తీసిన లెజెండరీ యుద్ధ వ్యతిరేక చిత్రం కమ్ అండ్ సీ ని చూసిన వారెవరూ క్లైమాక్స్‌లో కనిపించే ఆ భయానక దృశ్యాలను జీవితంలో మర్చిపోలేరు. క్లైమాక్స్ అని మాత్రమే కాదు.. ఈ సినిమా ఆద్యంతం చిరస్మరణీయ మైనది. ఒక భయంకరమైన దుస్వప్నం వాస్తవరూపం దాలిస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. యుద్ధం అనే ఆ పీడకల ఇప్పటికీ ప్రపంచంలో సహస్ర రూపాలతో కొనసాగుతూనే ఉంది కాబట్టి మన చరిత్రలో యుద్ధం అనేది వర్తమానంలో కూడా పునరావిర్భవిస్తూనే ఉంటుంది.

'కమ్ అండ్ సీ' అనే పేరున్న ఈ సినిమాను అచ్చంగా తెలుగు చేయాలంటే సింపుల్‌గా 'రండి.. చూడండి' అని చెప్పవచ్చు. సినిమా పేరుకు తగ్గట్లే దీంట్లోని ఒక్క దృశ్యాన్ని చూస్తే చాలు.. ఈ పేరు దీనికి ఎందుకు తగిందో అర్థమైపోతుంది. ఒక గ్రామంలో సజీవంగా ఉన్న వందలాది మనుషుల్ని – స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు– నాజీ సైనికులు ఒక పామ్ హౌస్‌లో కుక్కి తలుపులు మూసి ఆ ఇంటిని పెట్రోల్‌తో తగులబెట్టి, బుల్లెట్లు దించుతుంటే మంటల్లో తగులబడిపోతున్న ఆ నిస్సహాయులు పెడుతున్న హాహాకారాలను, ఫామ్ హౌస్ మొత్తాన్ని చుట్టుముడుతున్న ఆ అగ్నిజ్వాలల్ని ఈ సినిమా చివర్లో చూపిన ఆ దృశ్యాన్ని చూస్తే చాలు... సినిమా మొత్తాన్ని దర్శకుడు ఎలా ప్రాణం పెట్టి తీశాడో మనకు అర్థమవుతుంది.

1985లో రష్యన్ భాషలో వచ్చిన ఈ భయానక యుద్ధ చిత్రాన్ని సోవియెట్ యూనియన్‌లో చూసిన కోట్లాదిమంది ప్రజల గుండెలవిసి పోయాయి. నాజీల దురాగతాలకు బలైపోగా ప్రాణాలతో మిగిలి అప్పటికీ బతికి ఉన్న యుద్ధ బాధితులు ఈ సినిమా చూసి భోరుమంటూ విలపించారు. ఎందుకంటే ఇది వారికి సినిమా మాత్రమే కాదు. 1939లో మొదలైన రెండో ప్రపంచ యుద్ధం సోవియట్ యూనియన్‌ని సమీపించాక నాజీల ముట్టడిలో చిక్కుకున్న సోవియట్ భూమిలో కుటుంబాలను కోల్పోయిన, నాజీలు మండించిన అగ్నిజ్వాలల్లో గ్రామాలకు గ్రామాలే తగులబడిపోయిన అలనాటి సన్నివేశాలను ఈ సినిమా చూపిస్తుంటే.. ఆనాటికి బతికి ఉన్న బాధిత కుటుంబాలకు ఆ పాత జీవితం మళ్లీ కళ్లముందు కనిపించినట్లయింది. సినిమా కళ ఎంత మహత్తరమైన శక్తిని కలిగి ఉందో తెలుసుకోవడానికి కరుణామయమైన ఈ ఒక్క సినిమా చూస్తే చాలు.

1985లో రష్యన్ భాషలో వచ్చిన ఈ సినిమా 2020 నాటికి గానీ అంటే 35 సంవత్సరాల గానీ అమెరికాలో, యూరప్‌లో ఇంగ్లీష్ సబ్ టైటిల్‌తో విడుదల కాలేకపోయింది. న్యూయార్క్ తదితర అమెరికన్ నగరాల్లో కొత్తప్రింట్‌తో విడుదలైన 'కమ్ అండ్ సీ' సినిమా చూసిన అమెరికన్ చిత్ర విమర్శకులు ముక్తకంఠంతో పలికిన మాట క్లాసిక్. పరమ ప్రామాణికమైన చిత్రం. సినిమా కళను ఉద్దీప్తం చేసే చిరస్మరణీయమైన ప్రామాణిక కొలమానం 'కమ్ అండ్ సీ' అని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఈ సినిమా క్లైమాక్స్‌లో వచ్చే దావానలాన్ని పోలిన ఆ నాజీల దహనకాండను చూస్తున్న అమెరికన్ చిత్ర విమర్శకుల గుండెలు అవిసిపోవడమే కాదు.. ఒక్కసారిగా ఆగిపోయాయంటే అతిశయోక్తి కాదు.. ఈ సినిమా కలిగించిన మహత్తర అనుభూతికి ఇంతకుమించిన నిదర్శనం మరొకటి అవసరం లేదు.

1978లో వచ్చిన 'ఐ యామ్ ఫ్రమ్ ది ఫైరీ విలేజ్' (I Am from the Fiery Village) పుస్తకానికి క్లిమోవ్, అలెస్ అదమోవిచ్‌లు ఇచ్చిన సినిమా రూపమే 'కమ్ అండ్ సీ'. తరుణ వయస్సులో ఉన్న కుర్రాడి

జీవితంలో నాజీలు ప్రేరేపించిన యుద్ధం గురించిన భయానక వర్ణనతో ఈ సినిమా నడుస్తుంది. ఆ అబ్బాయి పేరు ఫ్లియోరా (అలెక్సీ క్రవచెంకో). సినిమా ప్రారంభంలోనే ఇతడు తన గ్రామంలో నాజీలకు వ్యతిరేకంగా సోవియట్ పక్షం వహించిన పార్టిజన్స్‌లో చేరిపోవాలనే ఉద్దేశంతో ఇసుకలో కూరుకుపోయిన నాజీల తుపాకిని తవ్వి తీస్తుంటాడు. (1943లో నాజీలు ఆక్రమించిన బెలరస్ – నాడు బైలో రష్యా– ప్రాంతంలో ఈ సినిమాను తీశారు.) ఆ అబ్బాయి ఫ్లియోరా ఇసుకలో కూరుకుపోయి ఉన్న తుపాకిని తవ్వి తీస్తుంటే ఊరి మనిషి ఒకరు హెచ్చరిస్తాడు. ఊరకే తుపాకీని తవ్వి తీయడం ప్రమాదకరమైన ఆలోచన అంటూ అతడి తల్లి కూడా ఆ పని చేయవద్దని బతిమాలు తుంది. కానీ ఆ గ్రామంలో అప్పటికే తిష్ట వేసి ఉన్న నాజీలకు ఆ అబ్బాయి చర్య అనుమానాలు రేకెత్తిస్తుంది. త్వరలోనే అతడు సోవియట్ అనుకూల బలగాల్లో చేరిపోవలసి వస్తుంది.

తన విధిని తానే లిఖించుకున్న దశనుంచి త్వరలోనే అతడు ఊహించశక్యం కాని దుష్టశక్తితో ఎన్‌కౌంటర్‌లో చిక్కుకుపోతాడు. ఈ క్రమంలో ఆ అబ్బాయికి పరిచయమున్న వారంతా చనిపోతారు. నాజీల దురాగతాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన ఆ బాలుడి అమాయకత్వం చెల్లాచెదరవుతుంది. తర్వాత బుద్ధి మాంద్యం అతడిని ఆవహిస్తుంది. చివరలో నాజీలు అతడిని చంపకుండా వదిలేయడానికి కూడా తన బుద్ధి మాంద్యమే కారణం. అలెక్సీ క్రవచెంకో అనే ఆ రైతు బాలుడి ముఖంలో యుద్ధ బీభత్సాన్ని, ఉన్మాదాన్ని, మృత్యు విహ్వలతను సినిమా మొత్తంగా చూపించడంలో దర్శకుడు క్లిమోవ్ ఎంత ప్రావీణ్యత చూపాడంటే – రోజుల తరబడి ఆ అబ్బాయి ముఖం మనల్ని వెంటాడుతుంది. అసాధారణ పరిస్థితులకు మనుషులు ఎలా బలవుతారు, అమాయకుల వధ, నిర్మూలన అనేది యుద్ధకాలంలో ఎంత సాధారణ విషయంగా మారిపోతుందో ఈ సినిమా చూపించినంతగా మరే సినిమా చూపించి ఉండదంటే అతిశయోక్తి కాదు. పాశవికత్వానికి మూలం, దాని ప్రభావం గురించిన అద్భుత అధ్యయన సమాహారమే ఈ మాస్టర్ పీస్ నిర్మాణానికి దారితీసింది.

20వ శతాబ్దిలో, సినిమా కళ పట్ల గొప్ప అనురక్తితో, సాహసంతో, అద్భుతమైన నైపుణ్యంతో తీసిన గొప్ప సినిమాల్లో 'కమ్ అండ్ సీ' ఒకటి. సోవియట్ సెన్సార్ ఆంక్షల మధ్యనే జాతి అణచివేతకు వ్యతిరేకంగా ఆగ్రహం, ఆవేదన కలగలిపి తీసిన సాహసోపేత చిత్రం ఇది. భూమ్మీద యుద్ధరూపంలో నరకం అనేది ప్రజాజీవితాన్ని ఎంతగా విధ్వంసం చేసి పడేస్తుందో అత్యంత నిర్దిష్టంగా, హింసాత్మకంగా, భయానకంగా చూపించిన కళాత్మక చిత్రం 'కమ్ అండ్ సీ'.

రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయం సాధించిన 40వ వార్షికోత్సవం సందర్భంగా 1985లో విడుదలైన ఈ సినిమాకు సోవియట్ యూనియన్ ప్రేక్షకులు అప్పట్లోనే బ్రహ్మరథం పట్టారు. ఎనిమిదేళ్ల నిర్విరామ ప్రయత్నం తర్వాత సోవియట్ సెన్సార్ ఆంక్షలను దాటుకుని చివరకు వెలుగు చూసిన 'కమ్ అండ్ సీ' యుద్ధ చిత్రాల నిర్మాణంలో ఒక కళాఖండంగా చరిత్రలో నిలిచిపోయింది. అత్యంత హింసాత్మక ఘటనల సమాహారంతో రూపొందిన అత్యంత అరుదైన యుద్ధ సినిమాల్లో ఒకటిగా సినిమా గురించిన మన నిర్వచనా లన్నింటినీ తోసిరాజన్న చిత్రమిది.

యుద్ధానికి సంబంధించిన అధివాస్తవికతను 35 సంవత్సరాల తర్వాత కూడా మానవజాతి సంపూర్ణంగా, సమగ్రంగా అర్థం చేసుకోవలసిన అవసరముందని ఈ సినిమా వాదిస్తుంది. ఇది కేవలం నాజీల చేతిలో ఘోర హత్యలకు గురైన బాధితుల భయంకరానుభూతిని మరల చూపించిన సినిమా కాదు.

ఈ చిత్ర దర్శకుడు క్లిమోవ్ 1933లో స్టాలిన్‌గ్రాడ్‌లో జన్మించాడు. యుద్ధాల చరిత్రలోనే భయానక దాడులకు నిదర్శనంగా నిలిచిన స్టాలిన్ గ్రాడ్ యుద్ధ సమయంలో 1942లో క్లిమోవ్ తన కుటుంబంతో పాటు ఆ నగరాన్ని వదిలి వెళ్లిపోతాడు. నాజీల ముట్టడిలో తూర్పు యూరప్ దారుణ అనుభవాలకు సంబంధించిన ప్రాథమిక, సర్వసమగ్ర సమాచారం క్లిమోవ్ కి స్పష్టంగా తెలుసు. ఆనాడు తన అనుభవంలోకి వచ్చిన ఆ జ్ఞాపకాలన్నింటినీ క్లిమోవ్ సినిమాగా మలిచాడు. కదులుతున్న స్టీడీ కామ్ షాట్లకు అనుగుణంగా దాదాపు సెట్టింగ్ అనేదే లేని రూపంలో ఈ చిత్రంలో నటీనటులు నటించారు. నేరుగా కెమెరా ముందు ముఖం పెట్టి నటీనటులు అనుభవిస్తున్న భయానక స్థితిని ఈ రెండున్నర గంటల సినిమాలో దర్శకుడు చూపించాడు. అందుకే స్టీడీకామ్‌ను ఆనాటికి ఈ సినిమాలో ఉపయోగించినంత ఎక్కువగా మరే సినిమాలోనూ చూడలేమని ఆస్కార్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ రోజర్ డీకిన్స్ వ్యాఖ్యానించారంటే అతిశయోక్తి కాదు.

ఒక తరుణ వయస్కుడు అనాలోచితంగా చేసిన పనికి తన అమూల్యమైన బాల్యాన్ని, ఆ వయసుకు సంబంధించిన అమాయకత్వాన్ని ఎలా పోగొట్టుకుని హింసాత్మక ఘటనల క్రమంలో కొట్టుకుపోయాడో.. ఆ క్రమంలో తాను బుద్ధి మాంద్యానికి గురవడమే కాకుండా, తన కుటుంబాన్ని, తెలిసిన వారందరినీ ఎలా కోల్పోయాడో పరమ భయానకంగా చూపించిన ఈ సినిమా చందమామ కథ కాదు. పెద్దలు చెప్పిన మాటలు వినాలి అని భారతీయ సమాజం నేర్పించే నీతి పాఠం అంతకంటే కాదు. ఆ అబ్బాయి అమాయకంగా చేసిన పనికి (నాజీలు కోల్పోయిన తుపాకీని ఇసుకలోంచి లాగడం), ఆ తర్వాత తన ప్రమేయం లేకుండానే నాజీల దురాగతాలు ఆ గ్రామ ప్రజలపై ఏ స్థాయిలో కొనసాగాయో, ఊళ్లకు ఊళ్లనే ఎలా వాస్తవంగానే తగులబెట్టేశారో వరుసగా చూపిస్తూ పోయిన మాంత్రిక వర్ణనకు ఈ సినిమా తిరుగులేని నిదర్శనం. తాను తెలిసీ తెలియక చేసిన పనికి ఆ బాలుడు పాఠం నేర్చుకున్నాడో లేదో కానీ, నాజీల ముట్టడిలో నాడు సోవియట్ గ్రామాలు అనుభవించిన దురాగతాలన్నింటినీ ఆ అబ్బాయి సినిమా పొడవునా కెమెరా ముందు పెట్టిన తన ముఖం సాక్షిగా ఒక బీభత్సానుభూతిని ప్రేక్షకులకు అనుభూతి కలిగిస్తూ పోతాడు.

రెండున్నర గంటలపాటు సాగే ఈ సినిమాను చూస్తుంటే యుద్ధం గురించి, పరాయిదేశపు కిరాయి సైన్యం ముట్టడిలో చిక్కుకున్న ప్రజల

నరకబాధల గురించి మనకు ముఖ్యంగా భారతీయులకు ఏమీ తెలీదనే చెప్పాల్సి ఉంటుంది. నాజీల ముట్టడికి గురైన ప్రాంతాల్లో హింస ఎంత పరాకాష్టకు పోయిందో ఈ సినిమా చూపించినంత దారుణంగా మరే యుద్ధ సినిమా చూపించలేదని విమర్శకుల వ్యాఖ్య. ఆ ఫామ్ హౌస్‌లో వందలాదిమందిని కుక్కి నాజీలు తగులబెడుతుంటే ఒక నాజీ మహిళ.. పీత కాలును నోట్లో వేసుకుని కొరుకుతుండటం, అపరాధభావంతో కుమిలిపోతున్న ఆ అబ్బాయి తన తలను బురదలో కూర్చి ఉండిపోవడం, ఆ అబ్బాయి కుటుంబాన్ని మొత్తంగా నాజీలు చంపేసి ఉన్న దృశ్యాన్ని అతడి స్నేహితురాలు చూసి స్థాణువై పోవడం. సినిమా మొత్తం చూస్తున్న వారికి షాక్ మీద షాక్‌ని కలిగిస్తూనే ఉంటుంది.

దాదాపు ముప్పై ఏళ్లకు పైబడి అనుకుంటాను భారతీయ మేటి దర్శకుడు సత్యజిత్ రాయ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పినమాట మళ్లీ ఇప్పుడు గుర్తుకొస్తోంది. సినిమా తీయడానికి వందల కోట్ల పెట్టుబడి మన చేతిలో ఉన్నప్పటికీ లేదా ప్రభుత్వాలే పెట్టుబడి పెట్టినప్పటికీ, 'వార్ అండ్ పీస్' లాంటి భారీ రష్యన్ సినిమాలను మనం ఎన్నటికైనా తీయగలమా అని సత్యజిత్ రాయ్ ఆ ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. తెలుగు సినిమా పెట్టుబడి విశ్వరూపమో లేక విషరూపమో ధరించి వందల కోట్లఖర్చుతో సాంకేతికత పేరుతో, విజువల్ ఎఫెక్ట్స్ పేరుతో, దద్దమ్మ హీరోలతో పనికిమాలిన సినిమాలను తీయగలుగుతున్న నేటి రోజుల్లో కూడా, సత్యజిత్ రాయ్ ఆనాడు చెప్పినమాట అక్షరసత్యంగా ఇప్పటికీ వర్తిస్తుందనే ఘంటాపథంగా చెప్పవచ్చు.

నిజంగా యుద్ధం అంటే ఏమిటో, దాని విధ్వంసకర పరిణామాలు ఏమిటో ఓనమాలు కూడా తెలీని రాజమౌళి, బాహుబలి తరహా యుద్ధాన్ని బీభత్సంగా చూపించి ఇదే యుద్ధం అనుకోవాలంటూ మనల్ని మాయలో ముంచెత్తాడు. ఇటీవలి కాలంలో ఇంగ్లీష్ సబ్ టైటిల్స్‌తో యూట్యూబ్‌లో విడుదలవుతున్న అలనాటి సోవియట్ యూనియన్ యుద్ధ సినిమాల భారీతనాన్ని చూస్తే, మనవాళ్లు వట్టి వెధవాయిలోయ్ అని గురజాడ అప్పారావు ఎందుకన్నారో మళ్లీ గుర్తుకు రాకమానదు.

సోవియట్ యుద్ధ చిత్రాలను వరుసగా చూసే అవకాశం, సమయం దొరికి గత కొన్నివారాలుగా చూస్తున్న నాకు, వారి యుద్ధచిత్రాల్లో ఒక్కదాంట్లో కూడా హీరో కానీ పార్కుల్లో పాటలనే తైతెక్కలాడే హీరోయిన్ కానీ కనబడలేదు. నిజంగానే సోషలిస్టు రియలిజానికి పట్టం కట్టిన చిత్రాలవి. (ఈరోజుల్లో ఈ భావనను అపహాస్యం చేసేవారే ఎక్కువ) ఒక్కమాటలో చెప్పాలంటే హీరోయిజాన్ని భారతీయ సినిమా అపహాస్యం చేసినంత ఘోరంగా మరే దేశ సినిమా కూడా చేయలేదని నా అభిప్రాయం.

మానవ జీవితాన్ని, దాని సహస్ర పార్శ్వాలను ఉద్దీప్తం చేయాల్సిన సినిమా అనే మహత్తర కళ మన దేశంలో కలెక్షన్ల వసూలు పిచ్చులో పడి దేకుతూ అక్కడే ఆగిపోతోంది. సినిమా కళమీద దాని ఔన్నత్యం మీద కనీస అవగాహన లేని చింతపండు వ్యాపారులు, సారా వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సినిమా నిర్మాతలుగా అవతారమెత్తితే, వాళ్ల చీకటి పెట్టుబడి ఆధారంగా రెమ్యునరేషన్ల రికార్డుల వైపుగా సాగిపోతున్న మన "నట వారస హింస"ల భయంకర నటనా వైదుష్యంతో భారతీయ సినిమా.. ప్రపంచ సినిమా రంగం ముందు సాగిలపడి దేకుతోంది.

అమానుషత్వం, జాత్యహంకారం, తుపాకీ బలం తెచ్చిపెట్టే తిరుగులేని అధికారం చరిత్రలో ఉన్నంతవరకు మనకు యుద్ధాలు, యుద్ధ బీభత్సాలు తప్పవని ఈ సినిమా స్పష్టం చేస్తుంది. యుద్ధం లేని ప్రపంచం గురించి మానవజాతి కన్న బాల్య స్వప్నం మరో వెయ్యేళ్ల తర్వాత కూడా ఫలించదనిపిస్తుంది.

1943లో బైలోరష్యాను ముట్టడించిన నాజీ బలగాలు 648 గ్రామాలను అక్కడ నివసించే వేలాది ప్రజలతో సహా తగులబెట్టిన వాస్తవగాథను దర్శకుడు క్లిమోవ్, అలెస్ అదమోవిచ్ కలిసి సినిమా రూపంలోకి మార్చారు. స్వయంగా నాటి నాజీ ముట్టడిని వారు చిన్నవయసులోనే ఎదుర్కొని అనుభవించారు కనుకే 40 సంవత్సరాల తర్వాత తాము చూసిన ఆ భయానక దృశ్యాలకు సినీరూపమిచ్చారు. చరిత్రలోని వాస్తవ ఘటనలను సినిమా రూపంలోకి ఎలా మార్చాలో తెలిపే కరదీపికగా 'కమ్ అండ్ సీ' సినిమా మన చరిత్రకు మిగిలింది.

యుద్ధ సినిమాల చరిత్రలో తలమానికంగా నిలిచిన 'కమ్ అండ్ సీ' సినిమాను కింది లింకులో తప్పక చూడండి. ఇది అంతగా క్వాలిటీ లేని యూట్యూబ్ లింక్ అని గుర్తుపెట్టుకోండి.

"COME AND SEE" - With English Subtitles

https://www.youtube.com/watch?v=NJYOg4ORc1w ✦

## కవి ఎక్కడికి పోతాడయ్యా....!

అలా అలా జ్ఞాపకాలు పలవరిస్తు
ఆమె వర్షమై కురిసిన చివరి బొట్టు దుఃఖపు సంతకాన్ని
ఆ రాత్రి తెల్లవారుజామున కదా..! నిమురుతూ మల్లె మొగ్గల
గొడుగు క్రింద గుండెకు అదుముకున్నది -
కవి ఎక్కడికి పోతాడయ్యా...!

★ ★ ★ ★ ★

నలుగురు స్నేహితులతో.... ఆ పెళ్లి పందిరి సందడిలో....
ఎక్కడో వుంటాడులే....!
మిళిందలో దూరి వుండవచ్చు బహుశా!
మానసను అడగరాదా! అంత వెతకడం ఎందుకు?

★ ★ ★ ★ ★

కవి ఒక్కడికే కదా గుండె వుందని
తెల్ల వెన్నెల మీద అక్షరాలు పరిచి, పద్యంలో తడిసింది.
మనల్ని నిరంతరం తడుపుతున్నది!

★ ★ ★ ★ ★

రేపు వర్తమానం మీద గాంధీ హత్యరోజు
నాలుగు వాక్యాలు రాయడానికి
కవి నిమగ్నమై వుండవచ్చు!
కవి ఎక్కడికి పోతాడయ్యా...! (ఎండ్లూరి సుధాకర్ స్మృతిలో....) ✦

జ న జ్వా ల



# డిజిటల్ శ్రమ - కార్ల్‌మార్క్స్

సారాంశ సమర్పణ : జి.వి. భద్రం - *Christian Fuchs*

(Christian Fuchs రాసిన 'డిజిటల్ శ్రమ – కార్ల్‌మార్క్స్' అనే ఈ పుస్తకం వివిధ రంగాలలో జరుగుతున్న శ్రమదోపిడీని తెలియచేసింది. ఈ సంచిక నుండి నెలనెలా ఒక్కొక్క అంశాన్ని ప్రచురిస్తున్నాం. - సం॥)

**Prof.** Christian Fuchs - University of West Minister, Londonలో సోషల్ మీడియా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇంటర్నెట్ అధ్యయనాలు, సోషల్ మీడియా అధ్యయనాలు, సవిమర్శనాయుత సామాజిక సిద్ధాంతం మరియు సమాచార సమాజపు అధ్యయనాలు అన్న విషయాలపై 200కు పైగా గ్రంథాలను ప్రచురించారు. 'ట్రిపుల్. సి (కమ్యూనికేషన్, కేపిటలిజం & క్రిటిక్)' అనే ఓపెన్ ఏక్సెస్ ఆన్‌లైన్ పత్రికకు సంపాదకుడు. సోషల్‌మీడియా, ఇంటర్నెట్ సర్వియలెన్స్ లాంటి పలు విషయాలపై యీయన వ్రాసిన గ్రంథాలు 'ఏరిన రచనలు' రూపంలో వెలువడ్డాయి.

డిజిటల్ శ్రమ అంటే ఏమిటి? దాని పని పరిస్థితులను మనం ఎలా అర్థం చేసుకోవాలి? అన్న విషయాలను క్రిష్టియన్ పుష్ "డిజిటల్ శ్రమ – కారల్‌మార్క్స్" అనే సైద్ధాంతిక గ్రంథం ద్వారా సవిమర్శనాయుత చర్చను, సవివరమైన విజ్ఞానాన్ని అందించారు. డిజిటల్ మీడియా రంగంలో శ్రమ, అది సృష్టించే విలువను గురించి ఈ పుస్తకంలో అవగాహన కలిగించారు. మనం పెట్టుబడిదారీ ప్రపంచంలో నివసిస్తున్నామా లేక సమాచార సమాజంలో నివసిస్తున్నామా అన్న విషయాన్ని దీనిలో విశదపరిచారు. డిజిటల్ శ్రమనూ, అంతర్జాతీయంగా కలిగివున్న శ్రమ విభజనను యీ గ్రంథంలో విశ్లేషించారు. ఈ విషయాలన్నింటినీ, శ్రామికవర్గ సిద్ధాంత – సూత్రాల వెలుగులో పరిశీలించి, డిజిటల్ పరిశ్రమలో సాగుతున్న వివిధ రకాల శ్రమదోపిడీని పరిశీలించి, ఆ దోపిడీ యొక్క స్వభావ, స్వరూపాలను ఈ గ్రంథంలో ఆయన పొందుపరిచారు.

సమాచార, సమాచారప్రసార సాంకేతికత ఆవిష్కరణలపైనా, సోషల్‌మీడియాకు చెందిన డిజిటల్ పరిశ్రమలపైనా ఎన్నో అధ్యయనాలు, పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. అవి కనుగొన్న విషయాలను కూడా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ అధ్యయనాలు, పరిశోధనలు – సమాచార, సమాచార ప్రసార సాంకేతికరంగం సాధించిన అనూహ్యమైన ఊహకందని పురోగతి వల్ల తక్షణమే సమాచారాన్ని ప్రపంచం నలుమూలలకి అందించగల్గుతున్నామని తేల్చాయి. అలాగే ఈ సాంకేతికత ఆధారంగానే సాంకేతిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పెరిగాయనీ, ఊహించలేనంతగా సేవలు అందించ గలుగుతున్నామనీ, ఈ డిజిటల్ పరిశ్రమ సాధిస్తున్న సూపర్ లాభాల వలన ప్రపంచానికి ఒనగూడే లాభాల పైనే ఈ అధ్యయనాలు, పరిశోధనలన్నీ కేంద్రీకరించాయి. ఈ డిజిటల్ పరిశ్రమ అభివృద్ధితో కంపెనీలకు సూపర్ లాభాలను అందించే అదనపు విలువను సృష్టించటంలో శ్రమ నిర్వహించుతున్న పాత్ర, తీరుపైనా, శ్రమ నిర్వహణలో పెట్టుబడి అమలుజరుపుతున్న శ్రమశక్తి దోపిడీ రూపాలు లాంటి విషయాలపైన పరిశోధనలు, అధ్యయనాలు 2008 వరకూ మొదలుకాలేదు. 2008లో ప్రపంచ ఆర్థికసంక్షోభం ఏర్పడటంతో తదనంతర కాలంలో అనూహ్యంగా, భారీస్థాయిలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. పాలక ప్రభుత్వాలు ఆర్థికవ్యవస్థలను నియంత్రించలేని స్థితిలోకి కూరుకుపోయాయి. 'పెట్టుబడిదారీ విధానానికి' ప్రత్యామ్నాయం లేదు అని బుకాయిస్తున్న నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానపు ప్రచారంలోని డొల్లతనాన్ని పలువురు మేధావులు, ఆర్థికవేత్తలు గుర్తించక తప్పలేదు. మార్క్స్ యొక్క రాజకీయ, ఆర్థిక సిద్ధాంతపు వెలుగులో డిజిటల్ పరిశ్రమను అధ్యయనం, పరిశోధన చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. అందువలన 'శ్రమ, అది సృష్టిస్తున్న అదనపు విలువ' అనే విషయాలపై పలువురు అధ్యయనం, పరిశోధనలు చేశారు. ఆ విషయానికి సంబంధించిన పలు నిర్ధారణలను అందించారు.

ఈ అధ్యయనాల పరిశోధనల ఫలితాలన్నింటినీ మార్క్సిస్టు సిద్ధాంతపు మూలసూత్రాల వెలుగులో సమీక్షిస్తూ, ఆయా అధ్యయనకారులు మార్క్సు సిద్ధాంతాన్ని ఏవిధంగా అర్థం చేసుకొన్నారు, వారి పరిమితులు ఏమిటి, వారు కనుగొన్న నిర్ధారణల సారాంశాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి అనే విషయాలను విస్తృతంగా చర్చిస్తూ క్రిష్టియన్ పుష్ యీ 'డిజిటల్ శ్రమ – కార్ల్‌మార్క్స్' అనే గ్రంథాన్ని వ్రాశారు.

ప్రధానంగా యీ గ్రంథం మార్క్సిస్టు సిద్ధాంతం, ప్రత్యేకించి మార్క్స్ చేసిన అదనపు విలువ సిద్ధాంతం యొక్క సూక్ష్మతలను వివరిస్తూ, వాటిని నేటి డిజిటల్ పరిశ్రమకు ఎలా అన్వయించాలి? ఈ డిజిటల్ పరిశ్రమ ఉత్పత్తి – సేవల విధానాల ద్వారా తీసుకువచ్చిన ఉత్పత్తి సంబంధాలను ఎలా అర్థం చేసుకోవాలి? యీ అవగాహనపై ఆధారపడి వర్గపోరాటాలు ప్రపంచవ్యాపితంగా నిర్మించగలగటానికి కలుగజేసే అవకాశాల గురించి సిద్ధాంతీకరించారు.

ఒకరకంగా చెప్పాలంటే, యీ గ్రంథం ప్రధానంగా పండితులకు, సిద్ధాంతవేత్తల కోసం ఉద్దేశించినదే! అయినప్పటికీ యీ గ్రంథంలో

ప్రస్తావించిన వివిధ రకాల శ్రమలు, వాటిని దోపిడీ చేస్తూన్న రూపాలు, శ్రమ ద్వారా సృష్టింపబడిన అదనపు విలువను సూపర్ – లాభాలుగా కొల్లగొట్టుతున్న వివిధ బడా డిజిటల్ కంపెనీల ప్రత్యక్ష ఆచరణను కార్మికులు, సామాన్య ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఈ వివరాలన్నింటినీ సులభంగా అర్థం చేసుకొనేవిధంగా మలచిన ప్రయత్నం యిది.

## డిజిటల్ బానిసత్వం

### సమాచార, సమాచారప్రసార సాంకేతికతకు సంబంధించిన లోహాల వెలికితీతలో బానిస పని

మన చుట్టుప్రక్కల అన్నిచోట్లా అంటే యిళ్లల్లో కానీ, ఆఫీసుల్లో కానీ, రవాణా సాధనాలలో కానీ, వ్యక్తుల వద్ద కానీ – కంప్యూటర్లను, లేప్‌టాప్‌లను, మొబైల్ ఫోన్‌లను చూస్తున్నాం. ఇవన్నీ యింటర్నెట్‌కు అనుసంధానం చేయబడి వుండటం కూడా మనకు తెలుసు. ఈ డిజిటల్ పరికరాలన్నింటిపైనా అతికించిన లేబుల్‌లను బట్టి, అవి ఆయా పేరుపొందిన బడా కంపెనీల బ్రాండ్ల 'ఉత్పత్తులు'గా మనం అర్థం చేసుకొంటున్నాం. ఆ బ్రాండ్ల పేర్లన్నీ బడా బహుళజాతి కార్పొరేషన్లవే. యాపిల్, డెల్, హెచ్.పి., లెనోవా, మోటరోలా, నోకియా, వెస్టన్ లాంటి బ్రాండ్ల పేరిట యీ పరికరాలను అమ్ముతున్నారు.

ఆ పరికరాలను మార్కెట్టులో కేవలం అమ్ముకొంటూ భారీ ఎత్తున లాభాలను గడిస్తున్న యీ కంపెనీలన్నీ బహుళజాతి కార్పొరేషన్లు మాత్రమే. ఈ కంపెనీలేవీ ఆయా డిజిటల్ సాధనాలను ఉత్పత్తి చేయటంలేదు. ఈ సాధనాల ఉత్పత్తి కోసం అనేక ప్రాంతాలలో అనేక రూపాల్లో, అనేక సమయాల్లో ఉపయోగించబడుతున్న శ్రమను గురించిన వివరాలేవీ, వినియోగదారులమైన మనకు కనిపించవు. సంక్లిష్టమైన మానవశ్రమ ప్రక్రియను వినియోగపు వస్తువుగా మార్చటం వల్ల పుట్టిన రూపాలే యీ డిజిటల్ పరికరాలు.

మానవశ్రమ లేకుండా సమాచార, సమాచారప్రసార సాంకేతికతకు మనుగడ లేదు. కానీ ఇవి సృష్టిస్తున్న వస్తు వినిమయ సంస్కృతి వల్ల మానవశ్రమ, మానవ సంబంధాలు, విలువలు మృగ్యమైపోతున్నాయి.

కంప్యూటర్‌లో గానీ, మొబైల్ ఫోన్‌లో గానీ అనేక విడి భాగాలుంటాయి. అప్లికేషన్ ప్రోగ్రాంలు, ఆపరేటింగ్ సిస్టమ్, కేబుల్స్, ఒక పెట్టె, ప్రదర్శింపబడే తెర, ఒక బ్యాటరీ, ప్రక్రియ జరిపే ఒక కేంద్ర యూనిట్, రేమ్, డేటాను నిలువ వుంచే చిప్స్, హార్డ్‌డిస్క్, ఫ్లాష్‌కార్డ్ లాంటి అంతర్గత స్టోరేజి చిప్స్, కీబోర్డు, కూలర్‌లాంటి తదితర భాగాలన్నీ వుంటాయి. ఇటువంటి భాగాలన్నీ కూడి వున్న యీ డిజిటల్ సాధనాలన్నీ ఎక్కడి నుంచి వచ్చాయి? వీటిని ఎవరు ఎక్కడ తయారుచేస్తారు? వీటిని తయారుచేసేందుకు ఏయే ముడిపదార్థాలు వాడతారు? ఈ పరికరాలను తయారుచేయటంలో ఏ ఏ రకాల, ఏ ఏ రూపాల శ్రమ ఇమిడి వుంది? అన్న విషయాలను తెలుసుకొందాం!.

ఈ డిజిటల్ పరికరాల తయారీ ప్రక్రియలో వివిధ దశలు ఉంటాయి. గనుల నుండి ఖనిజాలను (లోహాలను) వెలికితీయటం, హార్డ్‌వేర్ ఉత్పత్తి విడిభాగాలను ఒక వస్తువుగా కూర్చటం, సాఫ్ట్‌వేర్ యింజనీరింగ్, సర్వీసు (సేవల) పని, వినియోగదారుల ఉత్పాదక వినిమయం మొదలైనవి యీ డిజిటల్ పరికరాల ఉత్పత్తి ప్రక్రియలో ప్రధాన దశలుగా వుంటాయి. ఈ ఉత్పాదక దశల్లో అనేక రకాల, రూపాల శ్రమ యిమిడి వుంటుంది. వివిధ ప్రాంతాల్లో, వివిధ కాలాల్లో, వివిధ రకాలైన పని పరిస్థితుల్లో, వివిధ రకాలైన కార్మికులు చేసిన (యీ అన్ని దశల్లోనూ) శ్రమ యొక్క వినియోగపు విలువలన్నీ కూడి వస్తువులుగా యీ డిజిటల్ పరికరాలు మలచబడుతున్నాయి.

లాప్‌టాప్, మొబైల్‌ఫోన్, గేమ్స్, ఎం.పి.త్రీ ప్లేయర్లు, వెబ్‌కేమ్‌ల లాంటివాటిలో, గణనీయమైన పరిమాణంలో లోహాలు వుంటాయి. అల్యూమినియం, ఇనుము, రాగి, నికెల్, జింక్ లోహాలు యీ పరికరాల తయారీలో వాడతారు. ఈ లోహాలేకాక తక్కువ పరిమాణంలో వాడే బెరిల్లియం, ఇండియం, పేంటాలం, ప్లాటినం గ్రూపుకు చెందిన లోహాలు కూడా వాడతారు. ఒక మొబైల్ ఫోన్ యొక్క బరువులో, బ్యాటరీ బరువు మినహా, 25 శాతం బరువు, దీనిలో వాడిన లోహాల బరువుగా వుంటుంది. అతిపెద్ద రకానికి చెందిన లోహాలు సర్క్యూట్ బోర్డులో వుంటాయి.

ఈ లోహాల యొక్క ఖనిజ నిక్షిప్తాలు, ఆఫ్రికా దేశాలైన కాంగో, ఇథియోపియా, మొజాంబిక్, రువాండా, జాంబియా, దక్షిణాఫ్రికా, జింబాబ్వేలలో వున్నాయి. ఈ దేశాల నుండే సమాచార, సమాచార ప్రసార సాంకేతికత పరిశ్రమ ఉత్పత్తికి అవసరమైన లోహాలను సరఫరా చేస్తున్నారు. ఈ లోహాల ఖనిజాలను యితర దేశాల్లో, ప్రధానంగా చైనా దేశంలో శుద్ధిచేస్తారు. ఈ డిజిటల్ పరికరాల తయారీ పరిశ్రమకు, లోహ ఖనిజాలను అందిస్తున్న ఆఫ్రికా దేశాలు ప్రధాన పాత్రను వహిస్తున్నాయి. ఈ ఆఫ్రికా దేశపు లోహపు గనుల నుండి, ఖనిజాలు ఏ విధంగా వెలికితీయబడతాయో, యిందుకోసం గని త్రవ్వక కార్మికులు ఏయే రూపాలలో, తమ శ్రమశక్తిని వెచ్చిస్తారో తెలుసుకొంటే డిజిటల్ పరిశ్రమ యొక్క స్వభావ, స్వరూపాల్లోని ఒక ముఖ్యమైన కోణాన్ని (అంశాన్ని) అర్థం చేసుకొంటాం. ఆఫ్రికా దేశాల్లోని ప్రకృతి వనరులైన లోహ ఖనిజాలను వెలికితీయటంలోని కార్మికుల శ్రమ (డిజిటల్ పరిశ్రమ చేత) ఏవిధంగా కొల్లగొట్టబడుతున్నదో అర్థం చేసుకొంటాం.

సాంకేతిక పరిశ్రమల్లో వాడే కోబాల్టు, టేంటలం, కెస్సిలరేట్ లాంటి లోహ ఖనిజాలు ప్రధానంగా కాంగో దేశంలోని గనుల నుండి త్రవ్వి వెలికితీస్తారు. 1993కు ముందు అసలు యీ లోహ ఖనిజాల గురించే తెలియదు. 1990 దశకంలో మొబైల్ ఫోన్లు తదితర పరికరాల వాడకం పెరగటంతో, యీ లోహాలకు డిమాండ్ పెరిగింది. దాంతో డిజిటల్ పరిశ్రమ కారుచౌకగా యీ లోహ ఖనిజాలను ఆఫ్రికా దేశాల



నుండి సేకరించి, వాటిని తన ఉత్పత్తులలో వాడుకొని భారీ ఎత్తున లాభాలను మూటగట్టుకొంటోంది.

ఉద్యోగ భద్రత అన్నదే లేకుండా, ఎటువంటి చెల్లింపు లేకుండా ఆఫ్రికా దేశాల్లోని గనుల నుండి లోహ ఖనిజాలు, వెలికితీయటానికి కార్మికులు అదనపు గంటలుతో పనిచేస్తున్నారు. దారుణ పని పరిస్థితులు, బాలకార్మిక విధానం, వివిధ ప్రజాసమూహాలను నిర్వాసితులుగా చేయటం, భూమి సారాన్ని, పర్యావరణాన్ని హీనపరచటం – నీటి – గాలి కాలుష్యాలు, ఎటువంటి కనీస సౌకర్యాలూ – సదుపాయాలూ లేకుండా ఎటువంటి శిక్షణా లేకుండా, ప్రమాదకరమైన కాంట్రాక్టు పనిలో ఈ కార్మికులు పనిచేస్తున్నారు. ఈ డిజిటల్ పరిశ్రమ ద్వారా శ్రమశక్తిని దారుణంగా దోచుకొంటున్నారు.

ఈ రూపాలలోనేకాక, కార్మికులపైన హింసను (ప్రైవేటు, ప్రభుత్వ), దౌర్జాన్యాలను ప్రయోగించి వారిచేత గనుల్లో బలవంతంగా నిర్బంధంగా పనిచేయించుకొంటున్నారు. కార్మికులు బ్రతకటానికి గత్యంతరం లేని పరిస్థితుల్లో గని త్రవ్వకాలలో పాల్గొంటున్నారు. ఇది పెట్టుబడిదారీ విధానం వ్యక్తీకరణలో ఒకటైన ఫాసిజం యొక్క ఒక వ్యక్తీకరణ. ఈ రకంగా యీ డిజిటల్ పరిశ్రమ రక్తసిక్తమయినది. వినియోగ పరికరాల ఆకర్షణ వెనుక ఈ పరిశ్రమ యొక్క హంతక, శ్రమ దోపిడీ విధానం, శ్రమ దోపిడీ స్వభావం దాచివేయబడుతోంది.

డిజిటల్ పరిశ్రమ యొక్క రిటైలర్లు ఆ పరిశ్రమలోని పెద్ద ఉత్పత్తిదారుల నుండి ఉత్పత్తులు కొనుగోలు చేస్తారు. ఈ పెద్ద ఉత్పత్తిదారులు హార్డ్‌వేర్ తయారీని ఔట్‌సోర్సింగ్ (బయటి కాంట్రాక్టు తయారీదారులకు) యిచ్చి వారి నుండి హార్డ్‌వేర్ భాగాలను కొనుగోలు చేస్తారు. అదేవిధంగా లోహాలను, లోహ ఖనిజాలను శుద్ధిచేసే కంపెనీల నుండి కొనుగోలు చేస్తారు. ఖనిజాలను శుద్ధిచేసే కంపెనీలు ముడి లోహఖనిజాలను దళారుల నుండి (ఏజెంట్ల) కొనుగోలు చేస్తాయి. ఈ దళారులు ప్రాథమికంగా ముడిఖనిజాలను గని నుండి త్రవ్వి, వెలికితీసేవారి నుండి కొనుగోలు చేస్తారు.

కాంగోలో కేస్పిరేటర్ – తగరపు గనుల నుండీ, టేంటలం – కోల్టాన్ గని నుండీ, ఉల్ఫామైట్ మరియు బంగారము లాంటి ఖనిజాలు వెలికితీయబడతాయి. ఈ ఖనిజాలు సెల్‌ఫోన్లు, లేప్‌టాప్‌లు, లైట్, బల్బులు, ఉత్పత్తిలో వాడబడతాయి. మొబైల్ ఫోన్ల తయరీలో, ప్రత్యేకించి బ్యాటరీల్లో 25% వాడబడేది రాగి. ఈ లోహ ఖనిజాలు గనుల నుండి వెలికి తీసే విధానాలను చూద్దాం :

కాంగో దేశంలో 1990లో గనులు ప్రవేటీకరింపబడ్డాయి. ప్రభుత్వ నిర్వహణలో వున్న మైనింగ్ కంపెనీ యొక్క కార్యకలాపాలు నిలిపివేయడంతో, తూర్పు కాంగోలో ప్రవేటీకరింపబడిన గనుల్లో, చేతిపని రూపంలో గని త్రవ్వక విధానం ప్రవేశించింది. అంటే గని త్రవ్వకంలో చాలామేరకు యంత్రాలు కాక గని కార్మికులు తమ చేతులను, కర్రలను, యినుప కడ్డీలను, పారలను, గునపాలను, సుత్తులను, తొళ్ళికలను, బకెట్లను, మోకులను పరికరాలుగా వాడి, ఖనిజాలను వెలికితీసే విధానం అమలులోకి వచ్చింది. కోల్టన్, తగరం, బంగారం, టంగ్‌స్టన్, వజ్రాలను వెలికితీసే గనుల్లో యీ రకమైన చేతిపని రూపంలో గనులను త్రవ్వే విధానం ఇప్పటికే అమలు జరుగుతోంది.

కాంగోలో చాలా గనులు ప్రభుత్వ సాయుధ దళాల నియంత్రణలోనో లేక తిరుగుబాటు సైన్యాలైన హుటూ మిలిషియా, టుట్సీ మిలిషియా లేదా మాయ్–మాయ్ లాంటి సైన్యాల నియంత్రణలో వున్నాయి. ప్రపంచమంతటా ఖనిజాల వ్యాపారం చేసే 85 కంపెనీల్లో 15 కంపెనీలు, కాంగోలోని ఖనిజాలను వ్యాపారం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాపితంగా సాగే ఖనిజాల వ్యాపారంలో పారదర్శకత లేదు. అమలు జరుపగల నిబంధనలు లేవు.

ఖనిజాలను వెలికితీసే వ్యాపారంలో విస్తృతంగా బానిసత్వం కొనసాగుతోందని 2011లో చేసిన ఒక అధ్యయనం కనుగొంది. ఈ బానిసత్వం అన్నది పలు రకాల పనులైన గని త్రవ్వకం, ఖనిజాన్ని వేరుచేయటం, వాటి రవాణా, ఖనిజాల అమ్మకంలతో పాటుగా ఖనిజ పరిశ్రమలో సేవలందించే గృహ సేవకుల పనిలోనూ, పబ్బుల్లో, సెక్స్ పరిశ్రమగా బానిసత్వం కొనసాగుతోందని యీ అధ్యయనంలో వెల్లడయింది. చేసిన అప్పు తీర్చటం కోసం కట్టుబానిసత్వం, సేవక బానిసత్వం, లైంగిక బానిసత్వం, బలవంతపు వివాహాల బానిసత్వం, బాలకార్మికుల బానిసత్వం లాంటి పలురకాల ఆధునిక బానిసత్వ రూపాలలో, సాయుధ బృందాలు ప్రజలచేత బలవంతంగా పనిచేయించు కొంటున్నాయి.

తీసుకొన్న అప్పును తిరిగి తీర్చటం అసాధ్యమవటం వల్ల కట్టుబానిస విధానం కూడా యిక్కడ అమలు జరుగుతుంది. తల్లిదండ్రులు చేసిన అప్పును తీర్చటం కోసం పిల్లలు ఏళ్ళ తరబడి పనిచేసి, ఋణదాతకు అప్పును తీర్చే ప్రయత్నం చేస్తూ, అక్కడే బానిసల్లాగా యీ విధానంలో కట్టుబడిపోతున్నారు. ఉదాహరణకు బిస్సీ గనిలో ప్రభుత్వ సాయుధ దళాలకు చెందిన సైనికులు గ్రామీణులను ఎటువంటి కూలీ చెల్లించకుండా, తుపాకులతో చంపుతామని భయపెట్టి, గనిలోని ఖనిజాలను త్రవ్విస్తున్నారు. వారు ప్రజల వనరులను లాగేసుకొని, ప్రజలను చంపి, ప్రజల వస్తువులను – సామానులను దొంగిలించి, స్త్రీలను బలాత్కరించి, దౌర్జన్యంగా ప్రజలచేత గనుల్లో పని చేయించుకొంటున్నారు.

అంతేకాదు, కాంగోలో "సాలోంగో" అనే నిర్బంధ ఉచిత పని విధానం కూడా అమలు జరుగుతోంది. ప్రజలందరూ, వారంలో నిర్ణయింపబడిన ఒకరోజున ఒక్కో ప్రభుత్వ సైనికాధికారి కోసం, ఉచితంగా ఖనిజాన్ని వెలికితీసే పని చెయ్యాలి. తూర్పు కాంగోలో మరో రకమైన విధానం కొనసాగుతోంది. ఇక్కడ ప్రతి గని కార్మికుడూ, తాను ఒక నిర్దిష్టమయిన గనిలో పనిచేయాలంటే, ప్రభుత్వానికి

వారానికి ఒకసారి రుసుంను చెల్లించాలి. 15,000 మంది నుండి 25,000 మంది కార్మికులు పనిచేసే ఆ గనిలో, గనిలోనికి కార్మికులు ప్రవేశించటానికీ, గని నుండి బయటకు రావటానికి, తాము ఖనిజాలను వెలికితీసినందుకుగానూ రుసుం చెల్లించాలి.

ఇక్కడ సేవక బానిస విధానం కూడా కొనసాగుతోంది. ఒక వ్యక్తిని అబద్ధపు, కల్పిత నేరారోపణలపై అరెస్టు చేస్తారు. అందుకుగాను ఆ వ్యక్తికి గనుల్లో పనిచేసే శిక్షను విధిస్తారు. సాధారణంగా బాలలు గనుల్లో పనిచేయటాన్ని అనుమతించరు. కానీ వారు వివిధ రూపాల లైంగిక బానిసత్వానికి గురిచేయబడతారు. ఈ లైంగిక బానిసత్వం, గనుల వ్యాపారానికి సంబంధమయినదే. ఇది వ్యభిచార వ్యాపార రూపానికి చెందినది. ఇందులోకి మహిళలను యిరికిస్తారు. వ్యభిచార నిర్వాహకుడే మొత్తం డబ్బును లాగేసుకుంటాడు. బలాత్కారాలు, బలవంతపు వివాహాలు, జననాంగాలను ఛిద్రం చేయటం లాంటి రూపాలలో స్త్రీలను సైనికులు లైంగిక బానిసలుగా చేసుకొంటారు. ఇందువలన స్త్రీలు (బాధిత) ఎయిడ్స్ రోగం బారినపడే ప్రమాదంలో కూడా చిక్కుకొంటున్నారు.

మాయ్-మాయ్ గ్రూప్‌లాంటి సాయుధ దళాలు, ప్రభుత్వ సైనికులు బాలలను తమ దళాల్లోకి రిక్రూట్ చేసుకొని సైనికులుగానూ, గని కార్మికులుగానూ పనిచేయిస్తారు. బాలలు ఖనిజాన్ని త్రవ్వుతారు. శుభ్రపరుస్తారు. ఖనిజాన్ని పారలతో దగ్గరికి చేర్చి గుట్టలుగా పెడతారు. ఏరుతారు. మోసుకువెళ్ళే రూపంలో రవాణా చేస్తారు. లేదా ఖనిజాన్ని సుత్తితో కొట్టి ముక్కలు చేస్తారు. చితగ్గొడతారు. ఇందుకుగాను వీరికి ఏ రకమయిన కూలిని చెల్లించరు.

బానిసలుగా పనిచేస్తున్న యీ గని కార్మికులు అతి తక్కువ కూలికి, ఎక్కువ గంటలపాటు పని చేస్తారు. సాధారణంగా వీరికి యూనియన్లు వుండవు. ఒకవేళ ఎక్కడైనా వున్నా అవి యాజమాన్యపు తొత్తు సంఘాలే. ఈ కార్మికులు అపరిశుభ్రమైన, దుర్భర వాతావరణంలో ఎటువంటి మందుల సరఫరా కానీ, వైద్యసేవలు కానీ లేని ప్రదేశాల్లో నివసిస్తూ నిరంతరం రోగాల బారిన పడతారు. గనుల అడుగున (భూగర్భాన) పనిచేసే కార్మికులు ఎటువంటి భద్రతా పరికరాలు కానీ, ప్రాథమిక భద్రతా ఏర్పాట్లు కానీ లేకుండా పనిచేస్తారు. ఒకవైపున సాయుధ మూకలచే అనుక్షణం ప్రాణభయమేకాక, మరొకవైపు నేలకోత, గనులు కూలటం లాంటి ప్రమాదాలకు కూడా గురవుతారు.

వీరు సాధారణంగా కంటి గాయాలు, సిలికోసిస్ ఊపిరి ఆడకపోవటం, బ్రోంకైటిస్, ఆస్మా, డయేరియా, చర్మపు పగుళ్ళు, బరువులు మోయటం వలన బాలల్లో కండరాలు, ఎముకల వికృతీకరణ, వివిధ దంతక్షయ రోగాలు, టి.బి., టెటనస్ (వాతం) కీళ్ళు - ఎముకలు చిట్లిపోవటం లాంటి వ్యాధుల బారిన పడతారు. నాలుగు, ఐదు సంవత్సరాల పాటు గనిలో పనిచేసిన కార్మికులకు వెన్నెముకలు, ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. గనికార్మికులు నిరంతరం నీటికాలుష్యం, వాయుకాలుష్యం బారిన పడటం వలన వీరి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణిస్తుంది.

వీరు నిరంతరం సైనికుల యొక్క భౌతిక హింసకు గురవుతున్నారు. సైనికులు తుపాకీతో బెదిరిస్తూ గ్రామస్థులచేతా, బాలలచేత బలవంతంగా పనిచేయించుకొంటున్నారు. పనిచేయటానికి నిరాకరించినవారిని యీ సైనికులు దారుణమైన చిత్రహింసలకు గురిచేస్తారు లేదా చంపుతారు. సైనికులు జరిపే యీ దౌర్జన్యాలు, బలవంతాల వలన ప్రజలు గనుల్లోనూ స్త్రీలైతే వ్యభిచారుణులుగా పనిచేస్తూ దుర్భర దారిద్ర్యంలో జీవిస్తున్నారు. ఇక వారికి ఆ దారిద్ర్యం నుండి బయట పడవచ్చుననే ఆశ నిరాశగానే మిగిలిపోతూంది.

కేవలం ఒక బట్టల సబ్బు కొనుక్కోవటం కోసం ఒక పదకొండేళ్ళ బాలిక, ఒక బార్‌లో పనిచేసి, అక్కడకు వచ్చే కస్టమర్లతో వ్యభిచారం చేసి డబ్బులు సంపాదించుకొనేలాంటి ఉదంతాలు అనేకం అధ్యయనాల్లో బయటపడ్డాయి. బార్‌లో పనిచేసినందుకు ఆ బాలికలకు ఎటువంటి వేతనం బార్ యజమానులు చెల్లించరు. ఆ బార్‌లోకి వచ్చే కస్టమర్లతో వ్యభిచరించటానికి అవకాశం యివ్వటమే ఆ బాలికలకు వేతనంగా వుంటుంది. దుర్భర దారిద్ర్యాన్ని భరించలేక, ఆ బాలికల తల్లులే తమ పిల్లలను వ్యభిచారం చేయటానికి పంపాల్సిన తప్పనిసరి పరిస్థితులు అక్కడ వున్నాయి.

ఇక బాల కార్మికులైతే, ఒక చిన్న రంధ్రం ద్వారా గనిలోకి ప్రాకుతూ, చేతి వేళ్ళతోనే ఖనిజాన్ని పెకలిస్తూ, వళ్ళంతా గీసుకుపోయి, గాయాలవుతుంటాయి. తీరా గని నుండి ఖనిజంతో బయటికి వచ్చాక, సైనికులు వారిని తుపాకులతో బెదిరించి, ఆ పిల్లలు త్రవ్వి తీసుకువచ్చిన ఖనిజాన్ని ఎటువంటి చెల్లింపులు లేకుండా లూటీ చేసే సంఘటనలు అనేకం అధ్యయనాల్లో బయటపడ్డాయి.

2012 ఆగస్టులో, లోన్‌మిన్ కంపెనీ యాజమాన్యంలో వున్న మరికానా ప్లాటినం గనిలోని కార్మికులు దుర్భర పని పరిస్థితులను, చాలీచాలని జీతాలను తట్టుకోలేక, తమ వేతనాలు పెంచాలనీ - పని పరిస్థితులు మెరుగుపరచాలనీ డిమాండ్ చేస్తూ, ఆకస్మిక సమ్మె చేశారు. పోలీసులు రంగంలోకి దిగి, సమ్మె చేస్తున్న కార్మికులపై కాల్పులు జరిపి, 34 మంది కార్మికులను చంపివేశారు. డజన్లమందిని గాయాలపాలు చేశారు. అయితే లోన్‌మిన్ కంపెనీ యాజమాన్యం కార్మికులు చట్టవిరుద్ధంగా సమ్మె జరిపారని ప్రకటించింది. చట్టవిరుద్ధంగా సమ్మె జరిపారు కనుక, ఆ కార్మికులను పోలీసులు కాల్చి చంపటం న్యాయమే నన్నది ఆ గని యజమాన్యపు ఉద్దేశ్యం. ఈ ఉదంతాన్ని ప్రముఖ మీడియా అయిన బిబిసి, గార్డియన్, న్యూయార్క్‌టైమ్స్ లాంటి పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. అయితే వీరంతా, తాము ప్రచురించిన వార్తాకథనాన్ని, వ్యాఖ్యలను పోలీసుల కాల్పులపైననే కేంద్రీకరించాయి

తప్ప, ఈ కాల్పులకూ, సమాచార, సమాచారప్రసార సాంకేతికత పరిశ్రమకు అవసరమైన లోహాల సరఫరా సంబంధాన్ని గురించి మాత్రం మాటవరసకు కూడా ప్రస్తావించలేదు. బయట పెట్టలేదన్న విషయం గమనార్హమైనది. వాస్తవానికి హార్డుడిస్కుల ఉత్పత్తిలో ప్లాటినం లోహాన్ని ఒక ప్రధానమైన పదార్థంగా వాడతారు. హార్డ్‌డిస్కుల్లో 35% మేరకు ప్లాటినంతో కూడిన మిశ్రమ లోహాన్ని వాడతారు.

ఆఫ్రికా దేశాలకు చెందిన కంపెనీలు డిజిటల్ పరిశ్రమలో లేవు. కానీ అక్కడి ఖనిజ సంపదనంతా, వివిధ ఆధునిక బానిసత్వ రూపాల్లో కార్మికుల శ్రమశక్తిని కొల్లగొడుతున్నారు. హింసాపద్ధతిలో దోపిడీ చేస్తున్నారు. ప్రధానంగా పశ్చిమ దేశాలకు చెందిన కంపెనీలు ఈ సంపదను చేజిక్కించుకుని సూపర్ లాభాలను సంపాదిస్తున్నాయి.

ఆ రకంగా డిజిటల్ సాంకేతిక పరిశ్రమ, ఆఫ్రికన్ దేశాల గని కార్మికుల శ్రమశక్తినీ, రక్తమాంసాలను ఆధునిక బానిసత్వ రూపాలలో కొల్లగొట్టి, సూపర్ లాభాలను ఆర్జించటమన్నది ఒక కీలకమయిన అంశంగా వుంది.

**('ఫాక్స్‌కాన్ కంపెనీలో శ్రమదోపిడీ' అనే అంశం వచ్చే సంచికలో)** ✦

# ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## ఫిబ్రవరి 1992 - సంపుటి : 15 - సంచిక : 6

**బిర్సాముండా** ముఖచిత్రంతో, 'పతన సాంస్కృతిక విలువలను సృష్టిస్తున్న సామ్రాజ్యవాదాన్ని ఓడించండి!' అన్న పిలుపు గల సంపాదకీయంతో ఈ సంచిక వెలువడింది. డా॥ శాంతికుమార్ రాసిన 'రక్తాశ్రువులు', చిత్ర రాసిన 'బెలూన్' అనే కథలూ, సంగమేశ్వర్ రాసిన 'జీవించడం అంటే', బి. రామానాయుడు రాసిన 'అలవాట్ల ఫలితంగా', అరణ్య కృష్ణ రాసిన 'స్వదేశీ పరసీమల్లో.....', యం. కృష్ణారావు రాసిన 'సాహసీ స్వాగతం', స్రవంతి రాసిన 'అలిగేటర్', కవితలను ప్రచురించారు. శ్రీనివాస్, శ్రీధర్ రాసిన 'ఒకే జెండా కిందకి', పాలమూరు ఎరికన్న రాసిన 'రాజ్యహింస', పి. నాసరయ్య రాసిన 'అప్పు–ముప్పు', కె.వి. పతి రాసిన 'చేనేత పాట' అనే జనంపాటలూ, 'త్యాగమేరా జీవితం' శీర్షికలో కొత్తపల్లి రవిబాబు అనువాదం చేసిన 'మైకేల్ గ్రినిక్ డైరీ పుటలు నుంచి' వ్యాసమూ, 'పేరు మార్చుకున్న అందాల పోటీలను ప్రతిఘటించండి!' అని జనసాహితి చేసిన ప్రకటనను ప్రచురించారు. ఎక్స్‌రే దశ వార్షికోత్సవ సభలు గురించీ, సమాంతర సాహిత్య సామాజిక వేదికవారూ, శీలా వీర్రాజుగారు చేసిన సాహిత్య ప్రకటనలను ప్రచురించారు. వీటితోపాటుగా 'ఇలా మిగిలేం' సమీక్షపై చర్చలో భాగంగా సుధాకిరణ్ రాసిన 'సెక్టేరియన్ ఔదార్యం', మేకల సాయిలు రాసిన 'ఎర్రగీతాచార్యుడు' వ్యాసాలు, ఉత్తరాలు, స్వీకారం, చైతన్యవాహినిలను ప్రచురించారు.

కవరు వెనుక రెండవ పేజీలో ఆకుల రాసిన 'పోలీసు హింసలు' అనే జనంపాట, మూడవ కవరు పేజీలో జూలూరు గౌరీశంకర్ రాసిన 'శబ్దం కదిలి' కవితలను ప్రచురించారు.


పుటలు : 64, 1/8 డెమ్మీ; వెల : రూ.4/-

## మార్చి 1992 - సంపుటి : 15 - సంచిక : 7

శ్యామ్‌మోహన్ ముఖచిత్రాలంకరణ చేయగా, భూమి రాసిన 'హింసారణ్యం' అని ముఖచిత్రపు కవితతో పంజాబు సంచికగా ఈ సంచిక వెలువడింది. 'యుద్ధమూ – శాంతి – పంజాబు' అనే సంపాదకీయం రాశారు. 'ఆంక్షలు – నిషేధాలు' శీర్షికలో 'పంజాబ్‌లో సెన్సార్‌షిప్'ను 25 ఫిబ్రవరి 1992 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో రాజీవ్ ధావన్ రాసిన వ్యాసం ఆధారంగా ప్రచురించారు. అవతార్‌సింగ్ పాష్ రాసిన 'ఒక కవిత', సంతోఖ్‌సింగ్ ధీర్ రాసిన 'నేను పోలీసు ఏజెంటును కాదు', మన్‌జీత్ ఖాదర్ రాసిన 'తుపాకీ గొట్టంలోంచి వస్తోంది మతం', బి. రామానాయుడు రాసిన 'న్యూఢిల్లీ', అమర్‌జీత్ చందన్ రాసిన 'పంజాబు హంతకుల కోసం', హరభజన్ సింగ్ హుందాల్ రాసిన 'ఎక్కడ నా పంజాబు?' సుఖచైన్‌మిస్త్రి రాసిన 'వినిపించకండి నెత్తుటి కథ', అమరజీత్ చందన్ రాసిన 'పంజాబు హంతకుల కోసం' ఛాయరాజ్ రాసిన 'తలకిందులవుతాయి' కవితలను ప్రచురించారు. నరేంద్ర నిర్మోహి రాసిన 'పగుళ్ళు', డా॥ శాంతికుమార్ రాసిన 'మేరా భారత్ మహాన్' కథలనూ, భీష్మ సహానీ రాసిన 'ఎవరూ గొంతెత్తి నినదించరేం?', కె. రవిబాబు రాసిన 'నేటి పంజాబీ కవిత' అమ్రిక్ రాసిన 'ఆయుధాలతో ఆడుకుంటున్న పంజాబ్ బాల్యం' అనే వ్యాసాలను ప్రచురించారు.

రాజీవ్‌గాంధీ, లోంగోవాల్ శాంతి ఒప్పందం గురించీ, దర్శన్‌సింగ్ ఖట్కర్‌తో నీలిమ ఇంటర్వ్యూ, క్రాంతికిరణ్ రాసిన 'ప్రజాస్వామ్యమా వర్ధిల్లు!' గల్పిక, కత్తుల కాంతయ్య రాసిన 'బాలగోపాల్ సంగతేమిటి?' వ్యంగ్యంలతోపాటుగా సి. భాస్కరరావు చేసిన 'సిక్కు పంజాబ్‌ను అర్థం చేసుకునే ఒక ప్రయత్నం' అనే విశ్లేషణను ప్రచురించారు. చైతన్యవాహిని, స్వీకారం, సాహిత్య వార్తలనూ, రెండూ, మూడు కవరు పేజీల్లో భూపేంద్ర సింధూ రాసిన 'విను! ఇన్‌స్పెక్టర్' కవితనూ, నాలుగవ అట్టమీద పి. నాసరయ్య రాసిన 'జోహారు భగత్‌సింగ్' జనంపాటనూ ప్రచురించారు.

1/8 డెమ్మీలో 96 పుటలు. వెల : రూ.4/- ✦



సజీవ సాహిత్యం

# సూతపురాణం నుండి

త్రిపురనేని రామస్వామి రాసిన పద్యకావ్యం 'సూతపురాణానికి' చార్వాక రామకృష్ణ వచన రూపం ఇచ్చారు. వచన సూతపురాణం మొదటి భాగం నుండి ఈ క్రింది భాగాన్ని ప్రచురిస్తున్నాం. - సం॥

**తెలుగువాడై** కూడా పరాయి భాషయైన సంస్కృతాన్ని గడిదొంగ లాగా చదివి, దాంట్లో పేరు ప్రతిష్ఠలు సంపాదించి, ఓర్పు – ఔదార్యాలు లేకుండా, లగ్గూ – ఎగ్గూ చూడకుండా అప్పకవి అనేవాడు తెలుగు కవుల్ని, తెలుగు కావ్యాలను గూడా చాలా నీచంగా చూచాడు.

శూద్రుడైనవాడు మంచి మంచి అలంకారాలతో, ఎంతో అందంగా వ్యాసం రాసినప్పటికినీ అతని గ్రంథాన్ని ఎవ్వరూ ఆదరించరాదు; గ్రహించరాదు.

హోమంలో వేల్చే ద్రవ్యం ఎంత మంచిదైనా, కాకి తాకితే పనికి రాదు గదా! కావ్యం బాగా వుండవచ్చు; కానీ శూద్రుడు రాశాడు కాబట్టి దాన్ని బహిష్కరించాలి."

ఇంత క్రూరంగా వ్యవహరించిన అప్పకవి విషయం మీరేమంటారు? ఇట్లా రాయటం సబబేనంటారా?

అని నేననేటప్పటికి, అర్ధ నిమీలిత నేత్రాలతో ఆలోచించి దయగల చూపులతో సూత మహాముని నా వంక చూచి తల నిమిరాడు.

"కుమారా! నీవడిగిన విషయం మంచిదే. ఎరిగిన సంగతి చెప్పాలి. అట్లా తెలిసిన సంగతి చెప్పకపోవటం మంచిదిగాదు; ధర్మహాని అవుతుంది. నిజంగా ఈ రోజుల్లో మానవ సమాజం ఎంత దురభిమతంగా వుందో ఎట్లా చెప్పాలి?

"అప్పకవి వ్రాసిన వ్రాతలకు కోపం తెచ్చుకోవలసిన పని లేదు, కులం పేరుతో ఇతరులను చులకన చేసి నిందించే తులువలు తగిన ఫలితం కాలక్రమంలో అనుభవిస్తారు.

"ఏదియేమైనా, అడిగావు కాబట్టి చెపుతా. తెలియనిదాన్ని తెలుసుకోవడం కూడా చాలా మంచిదే.

"అప్పకవి లాంటి చదువుకొన్న మూర్ఖుల ప్రవర్తన అట్లాగే వుంటుంది. ఎంత చదువు చదివినా! ఎన్ని శాస్త్రాలు తిరగవేసినా సంస్కారహీనులు అవగుణాలను మానలేరు. తాను చదివిన చదువుల ఫలితం ఏమిటో గూడా తెలియని పండితమ్మన్యుడు అప్పకవి.

"సత్యము – శౌచము – సౌశీల్యము – లేని చదువులెన్ని చదివినా యెందుకు? తగులబెట్టనా? పొట్టకూటి కోసం మన పూర్వులెవ్వరూ చదివిన దాఖలాలు లేవు. కానీ, అప్పకవి లాంటి పొట్టకూటి రాయుళ్ళ చదువులిట్లాగు తగులబడి చస్తాయి.

"ప్రజల్ని పీల్చి పిప్పి చేసే దురాచారాన్ని విడనాడని చదువు లెందుకూ పనికిరావు. మూఢాత్వాన్ని – మూర్ఖత్వాన్ని పెంపొందించే చదువుల వల్ల ప్రయోజనం కించిత్తు గూడా వుండదు.

"శాస్త్రాల పేరుతో మోసపు రాతలు రాసి, సాటి మానవుణ్ణి మానవుడిగా చూడటానికి అవకాశం ఈయని ప్రబుద్ధులు అప్పకవి లాంటివాళ్ళు అక్కడక్కడా వుంటారు.

"మానవత్వాన్ని ప్రసాదించలేని చదువులు – చదువులే గాదు. అమానుషంగా ప్రవర్తించే విద్యాధికుడు పామరుడి కంటె హీనుడు.

"సాటి మానవుడి శ్రమను కాలరాయటానికి కొంటె రాతలు చాలా రాశారు. చేతికి చిక్కిన ప్రతి అవకాశాన్ని తీసుకొని, నీతి పేరుతో దుర్నీతి బోధించారు. ధర్మం పేరుతో అధర్మం ప్రచారం చేశారు. మేక వన్నె పులుల్లాగా వ్యవహరించారు.

"అధిక సంఖ్యాకులైన ప్రజల్ని చదువు సందెలకు – నాగరిక జీవితానికి దూరం చేశారు. తమ ముఖానే పొద్దు పొడిచినట్లు ప్రవర్తించారు.

"పాండిత్యం ఏ ఒక్క జాతికో – ప్రతిభ ఏ వొక్క కులానికో చెందినట్లుగా కుటిల మనస్తత్వంతో కుక్షింభరులు వ్యవహరించారు. అందుకే రామరాజ భూషణుడు రాసిన మహత్తర కావ్యం 'వసుచరిత్ర'ను చూచి కళ్ళు కుట్టి, శూద్రుడికింత పాండిత్యం యెక్కడ నుంచి వచ్చింది? ఇంత గొప్ప కావ్యం – అందులోనూ ప్రపంచ సాహిత్యంలో ధ్రువతారగా నిలిచే కావ్య సృష్టి శూద్రుడు చేయటమా! అని పళ్ళు పులిసి అప్పకవి, 'శూద్రుడు రాసిన పుస్తకం ఎంత మంచిదైనా పరిగ్రహించరా'దని శాసించాడు.

"ఇట్లాంటి తప్పుడు రాతలు రాసినవాడు, ఆ మాట మీద నిలబడ్డాడా? అంటే అదీ లేదు. తాను రాసిన 'అప్పకవీయమను' లక్షణ గ్రంథంలో, ఓ లక్షణం రాసి దానికి ఉదాహరణగా తాను దూషించిన శూద్రకవి భట్టుమూర్తి రాసిన 'వసుచరిత్ర' నుండే ఒక ఉదాహరణ తీసుకోక తప్పలేదు.

"ఎందుకీ పనికిమాలిన రాతలు రాయాలి? తాను, ఏ మహోన్నత కార్యం పనికిరాదన్నాడో, దాని నుండే వుదాహరణ ఎందుకు తీసుకోవాలి? వీళ్ళ నీతినేమనాలి? వీళ్ళు నీతిపరులా? అవినీతిపరులా? వీళ్ళు సాటి మానవులపైన చూపేది సోదరభావమా, శత్రుభావమా? మానవతకే యెంత మచ్చ తెచ్చే విషయాలివి?

"అన్నమాట నిలబెట్టుకోలేని వ్యక్తిత్వం గల అప్పకవులు మన సమాజంలో పుట్టకొక్కుల్లా వున్నారు. వాళ్ళ సాంఘిక నీతే అట్లాంటిది.

"రామస్వామీ! అయినా, కులాన్ని బట్టి ఒక కావ్యం విలువను నిర్ణయించే కుటిల బుద్ధులకు నిజంగా ప్రాయశ్చిత్తమనేదే వుండదు, ఏ కావ్యానికైనా దాని విలువ, అది రాసిన కవి కులాన్ని బట్టి వుంటుందా? కావ్యంలోని గొప్పదనాన్ని బట్టి వుంటుందా?

"ఒకే కవి రెండు కావ్యాలు రాస్తే, రెండూ ఒకే విధంగా వుండేట్టు రాయలేదు. అందులో బాగా వున్న కావ్యాన్ని ప్రజలు చదువుతారు.

ప్రసిద్ధమైన దాన్ని ఆదరించినట్టుగా, అప్రసిద్ధమైన కావ్యాన్ని ఆదరించరు. ఇది అందరికీ అనుభవంలో వున్న విషయం.

అంతెందుకు? తిక్కన కవి భారతం రాశాడు; ఆయనే నిర్వచనోత్తర రామాయణం – అనే గ్రంథం కూడా రాశాడు. కానీ సాహితీ ప్రపంచంలో భారతానికున్న పేరు ప్రఖ్యాతులు నిర్వచనోత్తర రామాయణానికి లేవు. భారతాన్ని చదివినంత వుత్సాహంగా, తిక్కన రామాయణాన్ని యెవ్వరూ చదువరు.

"వింటే భారతం వినాలి. తింటే గారెలే తినాలి" అనే తెలుగు సామెత, తిక్కన భారతం వల్లనే వచ్చింది. ఈ విషయం అప్పకవికి తెలియదా?"

ఆవేశపడకుండా గంభీరముద్రతో, సూత మహాముని చెప్పాడు.✦

ఈ నెల పుస్తకం

# మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ


## అభ్యుదయ, విప్లవ సాహిత్యకేంద్రం

### మాక్సిం గోర్కీ 'అమ్మ' నవలకు సంక్షిప్త రూపం

## బాలల బొమ్మల 'అమ్మ'

జనసాహితి ప్రచురణ

తెలుగు : బొర్రా గోవర్ధన్ ఇంగ్లీషు : కొత్తపల్లి రవిబాబు



**మాక్సిం గోర్కీ** 'అమ్మ' నవల తెలుగునాట ఎంతోమందిని ప్రభావితం చేసింది. రష్యాలో జార్ చక్రవర్తి క్రూర పాలనలో ప్రజలు అనుభవిస్తున్న జీవన స్థితిగతులను వివరిస్తూ విప్లవానికి ప్రజల్ని కార్యోన్ముఖులను చేసిన ఈ నవలను గోర్కీ 1906లో రాశారు. దానిని 1932లో తెలుగులోకి అనువదించారు. అనేక భాషలలోకి అనువాదం అయిన ఈ నవల కోట్లాది కాపీలు అమ్ముడయ్యాయి. ఏ కాలంలోనైనా ఏ దేశంలోనైనా దోపిడీ పీడనలకు గురౌతున్న ప్రజలందరి ఆత్మకథగా 'అమ్మ' గుర్తింపు పొందింది. బాలలచేత ఈ నవలను చదివించాలనే ఉద్దేశంతో – బొమ్మలతో సరళమైన భాషతో, సంక్షిప్త రూపంలో తెలుగు, ఇంగ్లీషు భాషలలో 'జనసాహితి' పుస్తకంగా ప్రచురించింది. 1/4 క్రౌన్‌లో 64 పుటలు. వెల : 80 రూ॥లు.

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ – 520002. ఫోన్ : 94901 96890** మరియు **బొర్రా గోవర్ధన్, శాంతినికేతన్, నగరం, గుంటూరుజిల్లా. ఫోన్ : 93906 00157.** ✦

# వై.వి. రెడ్డి 4వ వర్ధంతి



**యర్రం వెంకటరెడ్డి** గొప్ప సామాజిక ఉపాధ్యాయుడు. ప్రజాస్వామికవాది. కష్టజీవుల పక్షపాతి. రాజీపడని ఆదర్శజీవి. ఆయన అధ్యాపకునిగా, ప్రిన్సిపల్‌గా పనిచేసిన నల్లగొండ, ఖమ్మం, కోదాడ, నాగార్జునసాగర్, తణుకు, రేపల్లె మొదలగు ప్రాంతాలలో వై.వి.రెడ్డిగా ప్రసిద్ధులు. గుంటూరు ఏ.సి. కళాశాల, మద్రాసు క్రిస్టియన్ కళాశాల, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో రాజనీతి శాస్త్రం చదివారు. సోషలిస్టు పార్టీ భావజాలంతో ప్రభావితులైన ఆయన ఎందరో విద్యార్థులను, మిత్రులను భౌతికవాదులుగా మలిచారు. విద్యార్థుల నడుమ ఆరోగ్యవంతమైన భావసంఘర్షణకు, భావప్రచారానికి, వారిలో ఎదుగుదలకు స్వేచ్ఛాపూరిత వాతావరణం నెలకొల్పారు.

ఆయన 17-9-1932న ప్రకాశంజిల్లా పరుచూరు మండలంలోని యర్రంవారి పాలెంలో జన్మించారు. 2-2-2018న తన 86వ ఏట గుంటూరులో మరణించారు. ఆయన జ్ఞాపకార్థం వారి భార్య శేషుమాంబ, కుమారులు రవి, నిరంజన్, రామకృష్ణ 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి వై.వి.రెడ్డిగారి ప్రథమ వర్ధంతి సందర్భంగా 25,000 రూపాయలు విరాళంగా అందచేశారు. వారికి కృతజ్ఞతలు. వై.వి.రెడ్డిగారిని వారి 4వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం.✦

# సంతాపాలు

## సాహిత్యాభిమాని పి. చంద్రశేఖరరెడ్డి మరణం

పి.సి.రెడ్డిగా ప్రసిద్ధి చెందిన సినీ దర్శకుడు పి.చంద్రశేఖరరెడ్డి తన 86వ యేట 3-1-2022న చెన్నైలో మరణించారు. ఆయన 80కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'ప్రజాసాహితి' శ్రేయోభిలాషి. సాహిత్యప్రియుడు.

## కవి, రచయిత టి.వి. నారాయణ మరణం

తేట తెలుగులో ఆటవెలదులను ఆర్షపుత్ర శతకం పేరుతో రచించిన టి.వి. నారాయణగారు 11-1-2022న 96 యేళ్ళ వయసులో హైదరాబాద్‌లో మరణించారు. ఆయన 26-7-1925న హైదరాబాద్‌లోని బొల్లారంలో జన్మించారు.

టి.వి. నారాయణగారు పాఠశాల ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అంచలంచెలుగా సాగుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యులుగా ఉద్యోగ విరమణ చేశారు. దుర్భర దారిద్ర్యాన్ని వెలువరించారు. 'మిముపీడిన ఫలం' (గీతాల సంపుటి), 'ఆత్మదర్శనం' (కవితాసంపుటి), 'అమరవాక్సుధా స్రవంతి' (గ్రంథం), 'భవ్యచరిత శతకము', 'జీవన వేదం', 'శ్రుతి సౌరభం' (పద్యకదంబాలు), 'మహనీయుల మహితోక్తులు' (రేడియో ప్రసంగాలు), మొదలైన రచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ పద్మశ్రీ గ్రహీత అయిన నారాయణరావు 'ఆదరించిరట ఆదికాలము నుండి / ఆస్తికులను వోలె నాస్తికులను / పరిమళించెనిచట భావ పుష్పములెన్నో / ఆదరింపుమయ్య ఆర్షపుత్ర – అంటూ సులభమైన రీతిన భావ ప్రచారం చేశారు.

## యువ కార్టూనిస్టు నక్కా ఇళయరాజా మరణం

యువ కార్టూనిస్టు నక్కా ఇళయరాజా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 16-1-2022న మరణించారు. అతను 1995 జూలై 30న జన్మించారు.

ఇళయరాజా తల్లిదండ్రులిద్దరూ డా॥ విజయరామరాజు, డా॥ నందిని వైద్య వృత్తిలో వున్నారు. గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన ఈ దంపతులు వృత్తిరీత్యా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో స్థిరపడ్డారు. డా॥ విజయరామరాజు సినిమా రంగంపై తనకు గల అభిమానాన్ని చాటుకుంటూ తన ఇద్దరి సంతానానికి ఇళయరాజా, భారతీరాజా అని పేర్లు పెట్టుకున్నారు. ఇళయరాజా 12 సంవత్సరాల వయసులో కండరాలకు సంబంధించిన వ్యాధికి గురౌటంతో వీల్‌చైర్‌కే పరిమితమవ్వవలసి వచ్చింది. డిగ్రీ 2వ సం॥ వరకు చదువుకున్నారు. చిన్నపటి నుంచీ బొమ్మలు వేయటం పట్ల వున్న ఆసక్తినీ అభిరుచినీ కొనసాగిస్తూ కార్టూనిస్టుగా ఎదిగారు. తనదైన రీతిలో 350కి పైగా కార్టూన్లు గీశారు. ఆంధ్రజ్యోతిలోనూ, గో.తెలుగు.కామ్‌లో అనేక కార్టూన్లు అచ్చయ్యాయి. 'కిడ్డూస్ ట్యూన్స్' పేరుతో కార్టూన్ల పుస్తకాన్ని వెలువరించాలనుకున్నారు. అనారోగ్యంతో చనిపోయారు.

డా॥ నక్కా విజయరామరాజు సాహిత్యకారులు. ఆయన 'భట్టిప్రోలు కథలు', 'మన వూరి కథలు', 'దేవతా వస్త్రాలు' కథాసంపుటాలను, 'నాగమ్మ' అనే నవలను మరికొన్ని రచనలు చేశారు.

## రచయిత్రి సి. వేదవతి మరణం

ప్రముఖ విదుషీమణి సి. వేదవతి తన 91వ యేట 18-1-2022న హైదరాబాదులో మరణించారు. ఆమె 1931 డిసెంబర్ 16న దుగ్గిరాలలో జన్మించారు.

వేదవతి సహచరుడు సి. కృష్ణారావుగారు కూడా సాహిత్యాభిమాని కావటంతో వారి ఇల్లు సాహిత్యకారులకు, సాహిత్య సమావేశాలకు నిలయమైంది. వేదవతి ఆకాశవాణిలో పలు ప్రసంగాలు చేశారు. ఆమె తన సాహిత్య వ్యాసంగంలో భాగంగా సాహితీవేత్త బెజవాడ గోపాలరెడ్డితో సాహిత్యపరమైన ఉత్తర ప్రత్యుత్తరాలు చేశారు. వాటిని 'స్నేహసూక్తం' గ్రంథంగా వెలువరించారు.

'ప్రశ్న' (కథలు), 'తలపుల తరగలు', 'తెలుగు వెలుగు', 'దీపిక' (పీఠికలు), 'ముంగిట ముత్యం' (కవితలు), 'హితసూచని', 'పోస్టు చేయని ఉత్తరాలు', 'స్మృతిగీతి', 'శృంగార లహరి' మొదలైన రచనలు చేశారు.

## ప్రజావిమోచన బండ్రు నరసింహులు మరణం

ప్రజావిమోచన పత్రిక సంపాదకులు, తెలంగాణ సాయుధ పోరాట కార్యకర్త బండ్రు నరసింహులు నూరేళ్ళకుపైగా జీవించి 22-1-22న మరణించారు. ఆయన అక్టోబర్ 2, 1915న జన్మించారు.

1944 మార్చి 8, 9 తేదీలలో భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభలకు హాజరైన నర్సింహులు – అప్పటి నుండి మొదలైన వామపక్ష ఉద్యమ ప్రయాణం కడవరకూ సాగింది.

తన వందేళ్ళ పుట్టినరోజు సందర్భంగా 'నూరేళ్ళ పండుగ – నూటొక్క పాట' కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సాహితీవేత్త శ్రీ విరించి మరణం

సాహితీవేత్త డా॥ ఎన్.సి. రామానుజాచారి (శ్రీ విరించి) తన 85వ యేట 26-1-2022న చెన్నైలో మరణించారు. ఆయన 1935లో విజయవాడలో జన్మించారు.

రాజకీయ శాస్త్రంలో ఎం.ఏ. చదివి తులనాత్మక తత్త్వశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందిన శ్రీ విరించి 1958లో దివ్యజ్ఞాన సమాజం సభ్యునిగా చేరి, 1979 నుండి అదయార్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో నిర్వాహక కార్యకర్తగా పనిచేశారు.

ఆయన కథా రచయిత, సమీక్షకుడు, తత్త్వశాస్త్ర గ్రంథ రచయిత. తెలుగులో, ఆంగ్లంలో కథలు రాశారు. తెలుగులో వంద, ఇంగ్లీషులో 50 పైగా వ్యాసాలు వివిధ అంశాలపై రాశారు. 1951లో ప్రారంభమైన వారి రచనా వ్యాసంగ చివరివరకూ కొనసాగింది. ఆయన రచనలు 'స్వతంత్ర', 'భారతి', 'ఆంధ్రప్రభ', 'ఆంధ్రపత్రిక', 'యువ' మొదలైన పత్రికలలో ప్రచురితమయ్యాయి. గ్రంథ సమీక్షలు వందలాదిగా 'ది హిందూ', 'ఇండియా టుడే – తెలుగు'లోనూ రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్టు వారికి అనువాదాలు చేశారు.

'మధ్యమావతి', 'కొత్త నక్షత్రం' (1982), 'అర్థం', 'కారనీ కన్నీరు', 'మెట్లు లేని నిచ్చెన' (1995), 'కనకపు గేటు' (1999), 'గంధపు చుక్క' (2000), 'నిధి చాల సుఖమా', 'పడి లేచే కడలి తరంగాలు', 'కాలం కొలవని మనిషి', 'పద్మ పత్రం', మొదలైనవి వారి కథాసంపుటాలు.

ఇవిగాక 'అరిస్టాటిల్ జీవితం – తాత్త్వికత', 'బ్లావట్‌స్కీ జీవితం – తత్త్వం', 'సోక్రటీసు జీవితం – తాత్త్వికత', 'గ్రీకు తత్త్వవేత్తలు' ఆయన రాసిన ఇతర పుస్తకాలు.

## సృజనకారుడు బుజ్జాయి మరణం

'బుజ్జాయి' పేరుతో కామిక్ పుస్తకాలను చిత్రించిన దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి తన 91వ యేట 27-1-2022న చెన్నైలో మరణించారు. ఆయన 11-9-1931లో జన్మించారు.

ప్రముఖ భావకవి, సినీగేయకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి, రాజహంసలు వీరి తలిదండ్రులు. ఆయన ఏ బడిలోనూ చదువుకోలేదు. సాహిత్య సభలకు తండ్రితో పాటు వెళ్తుండేవారు. ఆ విధంగా సాహిత్య వాతావరణంతో పరిచయమైనా, కార్టూన్ చిత్రకళపై అభిరుచి పెంచుకొని దానిలో పరిణితి సాధించారు. తన 16వ యేటలోనే 'బానిసపిల్ల' అనే తెలుగు కామిక్ పుస్తకాన్ని మిత్రుడు రామ్ సహాయంతో వేయి ప్రతులు ముద్రించి అమ్మారు. అది మొట్టమొదటి తెలుగు కామిక్ పుస్తకం.

'డుంబు' అనే పాత్రను బుజ్జాయి సృష్టించారు. ఆ పాత్ర గల బొమ్మలను 'నవ్వుల బండి' పేరుతో ప్రచురించారు. ప్రసిద్ధ ఇంగ్లీషు వారపత్రిక 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'లో వారంవారం 'పంచతంత్ర' కథల చిత్ర పరంపరను ధారావాహికగా ప్రచురించారు. 1975లో 'న్యాయానికి భయం లేదు' అనే ధారావాహిక చిత్రాల పుస్తకాన్ని వెలువరించారు. 'నాన్న–నేను' అనే పుస్తకంలో తండ్రి కృష్ణశాస్త్రి గురించీ, తన అనుభవాల గురించీ రాశారు. ఆయన కళాకారుడు, ఇలస్ట్రేటర్ కామిక్ స్క్రిప్ట్ ఆర్టిస్ట్, పురాణగాథలు, జానపదాలు, జీవిత చరిత్రలు, రాజకీయాలను ఇతివృత్తంగా తీసుకుని వందలాది కామిక్స్‌ను సృష్టించారు.

## సాహితీవేత్త యెండ్లూరి సుధాకర్ మరణం

ప్రగతిశీల కవి, వక్త, అధ్యాపకుడు అయిన యెండ్లూరి సుధాకర్ తన 63వ యేట 28-1-2022న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. ఆయన నిజామాబాద్‌లోని పాములబస్తీలో 21-1-1959న జన్మించారు.

ప్రాథమిక విద్య వీధి బడిలో అభ్యసించి ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియాలో ఎం.ఏ, ఎం.ఫిల్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పి.హెచ్‌డి చేశారు. ఎం.ఫిల్‌లో జాషువా రాసిన 'నా కథ పైనా, పి.హెచ్‌డిలో 'జాషువా సాహిత్యం – దృక్పథం – పరిణామం'పైనా పరిశోధన చేశారు. అంతకు ముందు అనేక రకాల వృత్తులు చేసి, 1985–90లలో వెస్లీ బాయ్స్ హైస్కూలులో తెలుగు పండిట్‌గా స్థిరపడ్డారు. ఆ తర్వాత 1994–2012లలో రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయపు సాహిత్య పీఠంలో అధ్యాపకునిగా పనిచేస్తూ 2004–2011లలో 'వాఙ్మయి' పత్రికకు సహాయ సంపాదకులుగా చేశారు.

'నా అక్షరమే నా ఆయుధం' పేరుతో ప్రసిద్ధ దళిత రచయిత శరణ్‌కుమార్ లింబాలే స్వీయ గాథ సంక్షిప్తంగా అనువదించారు. 'మల్లె మొగ్గల గొడుగు', 'మాదిగ కథలు', 'వర్గీకరణీయం' (దళిత దీర్ఘకావ్యం), 'కొత్త గబ్బిలం', 'వర్తమానం', 'గోసంగి' మొదలైనవి ఆయన రచనలు. దళితుల ఆర్తిని, ఆవేదనను, ఆగ్రహాన్ని తన కవిత్వంలో బలంగా వినిపించారు.

రాజమండ్రిలో పనిచేస్తున్నప్పుడే 10, 15 ఏళ్ళక్రితం ఒక సభలో ఉద్రేకపూరితంగా ప్రసంగిస్తూ గుండెపోటుకు గురై అప్పుడు మృత్యువును జయించారు. రెండేళ్ళక్రితం తన సహచరి పుట్ల హేమలత మరణం తర్వాత మృత్యువును ఆహ్వానించారు.

రాజమండ్రి సాహిత్య పీఠంలో జనసాహితి నిర్వహించిన సభలన్నిటికీ, 'ప్రజాసాహితి' పత్రికకూ ఎంతో సహకరించారు. 'ప్రజాసాహితి'లో ధారావాహికగా ప్రచురించిన పాల్ రోబ్సన్ స్వీయగాథ గురించి తరచు మాట్లాడేవారు.

చనిపోయేనాటికి హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

## ఛాయాగ్రాహకుడు, చిత్రకారుడు భరత్ భూషణ్ మరణం

గుడిమల్ల భరత్ భూషణ్ తన 69వ ఏట 31-1-2022న హైదరాబాదులో మరణించారు. ఆయన వరంగల్లు జిల్లాలో 3-1-1953లో జన్మించారు.

భరత్ భూషణ్ చిత్రకారుడిగా, జర్నలిస్టుగా పనిచేశారు. 'ప్రజాసాహితి' తొలి సంవత్సరాలైన 1977 ప్రాంతాల్లో ముఖచిత్రాలుగా ఆయన ఫొటోలను ప్రచురించడానికి అనుమతించారు. ఆయన హైస్కూలు చదువు తరువాత, హైదరాబాదులో జె.ఎన్.టి.యులో చేరారు. 35 ఏళ్ళ కృషితో ఫొటోగ్రఫీని ఒక కళాత్మక ప్రక్రియగా మలిచారు. ఆయన, సుభద్ర ఆదర్శ వివాహం చేసుకున్నారు.

కాకతీయుల శిల్పకళా నైపుణ్యాన్నీ, గౌండ్లవారి జీవితాన్ని, తెలంగాణలోని వెనుకటి ఇళ్ళు, కూలిన గోడలు, గొళ్ళెం పెట్టిన, తాళం వేసిన దర్వాజాలు, బతుకమ్మ సంబరాలు, వంటింటి సామగ్రి, పల్లె ప్రజల జీవితాలను ప్రతిబింబించే వందలాది ఫొటోలను అలాగే వీధి ఫొటోగ్రఫీని ఒక అంశంగా తీసుకుని చాలా ఫొటోలు తీసి ఏడు వ్యక్తిగత ప్రదర్శనలు నిర్వహించారు.

'హరిజన్' 'కాంచన సీత', 'రంగుల కల' మరికొన్ని చిత్రాలకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. సినిమా పత్రికలోనూ పనిచేశారు. కరువు కాటకాలను, జీవన విధ్వంసాన్ని, వలసలను, ప్రపంచీకరణ తాకిడికి తల్లడిల్లుతున్న తెలంగాణను దృశ్యరూపంలో అందించిన భరత్ భూషణ్ పాతిక ఏండ్ల క్రితం కాన్సర్ బారినపడ్డారు. వైద్యంతో కొంత మెరుగైనా మరల అది తిరగబెట్టగా మరణించారు.

'అస్మిత' ప్రచురించిన 'మహిళావరణం'కు ఆయన అపురూపమైన ఫొటోలు అందించారు. చాలామంది ప్రముఖుల ఫొటోలను తీశారు. శివసాగర్, కాళోజీ, బిరుదురాజు రామరాజు మొదలగువారి ఫొటోలు ప్రసిద్ధి చెందినవి.

## 'శ్రీకాకుళ సాహితి' బి.వి.ఎ. రామారావు నాయుడు మరణం

కథానిలయం అధ్యక్షులు, శ్రీకాకుళ సాహితి వ్యవస్థాపకులు బి.వి.ఎ. రామారావునాయుడు (బలిజరెడ్డి వెంకట అచ్యుత రామారావునాయుడు) తన 76వ యేట 2-2-2022న శ్రీకాకుళంలో మరణించారు. ఆయన స్వగ్రామం బలిజపేట మండలం తుమరాడ గ్రామం.

రామారావు నాయుడు 40 సం॥లుగా శ్రీకాకుళంలో వృక్షశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం చుట్టుపక్క ప్రాంతాల జానపద వైద్యాని పరిశీలించి, పరిశోధించి అనేక విలువైన పుస్తకాలను రాశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో ప్రసంగించారు. జానపద వైద్యం గురించీ, పర్యావరణ విధ్వంసం గురించీ అన్ని రూపాలలో ప్రచారం చేశారు. ఆయన వృత్తి పరంగా వృక్షశాస్త్ర అధ్యాపకులైతే ప్రవృత్తి మాత్రం సాహిత్యం. శ్రీకాకుళంలో వున్న సాహిత్యకారులను, సాహిత్య సంస్థలను కలుపుకుంటూ ఐక్య వేదికగా ఏర్పడిన శ్రీకాకుళ సాహితి సంస్థ ఉమ్మడి శక్తిగా నిలబడటానికి కృషిచేశారు. కీలకపాత్ర పోషించారు. శ్రీకాకుళసాహితి సభ్యుల రచనలను సంకలనాలుగా తీసుకువచ్చారు. 'జముకు' సాహిత్య బులిటెన్‌ను, కళింగ నేలపై ప్రవహించే నాగావళి, వంశధార, జంఝావతి, వేగావతి మొ॥ పేర్లతో కథాసంకలనాలను తీసుకువచ్చారు. ప్రతి నెలా సాహిత్య సభలను నిర్వహిస్తూ ఆ, ఆ విషయాలపట్ల అవగాహన వున్న ప్రముఖుల చేత మాట్లాడించేవారు. కాళీపట్నం రామారావు స్థాపించిన కథానిలయానికి అధ్యక్షులుగా వుంటూ విశేష కృషి చేశారు.

## ప్రజాసాహిత్యాభిమాని నిమ్మకాయల శ్రీరంగనాథ్ మరణం

ప్రగతిశీల పాత్రికేయుడు నిమ్మకాయల శ్రీరంగనాథ్ తన 80వ యేట 7-2-22న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా ఉప్పల గుప్తం మండలం ఎన్. కొత్తపల్లిలో 7-1-1942లో జన్మించారు.

మునిపల్లెలో ప్రాథమిక విద్య అనంతరం, కాకినాడ, అమలాపురంలో చదివిన శ్రీరంగనాథ్ విద్యార్థి దశలోనే వామపక్ష రాజకీయాలలో ప్రవేశించారు. వామపక్ష పత్రిక 'జనశక్తి'కి తోడ్పడ్డారు. 'ఉదయం', 'వార్త', 'ఆంధ్రప్రభ', 'ఎ.పి.టైమ్స్ (ఇంగ్లీషు)' పత్రికలలో వివిధ హోదాలలో పనిచేశారు. నీటిపారుదల రంగంపై సాధికారత సాధించిన శ్రీరంగనాథ్ వివిధ ప్రాజెక్టులకు సంబంధించి వ్యాసాలు రాశారు. అవినీతిపై అవిశ్రాంత పోరాటం జరిపారు.

'ప్రజాసాహితి' పత్రికకు సన్నిహితులు, శ్రేయోభిలాషి.

## కొడవటిగంటి వరూధిని మరణం

ప్రముఖ సాహితీవేత్త, రచయిత కొడవటిగంటి కుటుంబరావు సహచరి వరూధిని 9-2-2022న హైదరాబాద్‌లోని క్షేమాలయం వృద్ధాశ్రమంలో తన 97వ యేట మరణించారు. ఆమె 29-3-1925న గుంటూరులో జన్మించారు.

తెనాలికి చెందిన అలనాటి రంగస్థల, సినిమా నటి కొమ్మూరి పద్మావతి, వెంకట్రామయ్యలకు వరూధిని మొదటి సంతానం. డిటెక్టివ్ నవలల రచయిత కొమ్మూరి సాంబశివరావు వరూధిని సోదరుడు. ప్రఖ్యాత రచయిత చలం వరూధిని పెదనాన్న. కొడవటిగంటి కుటుంబరావు, వరూధినిల వివాహాన్ని 1945లో దుర్గాబాయమ్మ నిర్వహించారు.

ఆమె నాటకాలలో నటించారు. ఆకాశవాణిలో లలిత సంగీత కార్యక్రమాల్లో పాల్గొనేవారు. వారి అబ్బాయి, సైన్స్ రచయిత రోహిణీ ప్రసాద్ 2012లోనూ, కూతురు ప్రముఖ అనువాదకులు శాంతసుందరి 2020లోనూ మరణించారు.

## ప్రజా కళాకారుడు నేతి పరమేశ్వర శర్మ మరణం

ప్రజా కళాకారుడు నేతి పరమేశ్వర శర్మ తన 94వ యేట తెనాలిలో 16-2-2022న మరణించారు. ఆయన 7-1-1928న జన్మించారు.

ఆయన ఉపాధ్యాయునిగా తెనాలి తాలూకా హైస్కూలులో ఉద్యోగ విరమణ వరకూ పనిచేసారు. ఉపాధ్యాయునిగా వుంటూనే నాటక రంగంలో కృషి చేశారు. 1948లో "రంగూన్ రౌడీ" నాటకంలో ఇన్‌స్పెక్టర్ పాత్రతో ఆయన నట జీవితం ప్రారంభమైంది. ఆ తర్వాత 'కళాభారతి' సంస్థ స్థాపించి 'జై భవాని' చారిత్రాత్మక నాటకాన్ని తెలుగు రాష్ట్రాలలోను, మదరాసులోనూ పలు ప్రదర్శనలు ఇచ్చారు. 1952లో ఆంధ్ర క్రాంతి థియేటర్, అనే నాటక సంస్థను కన్నెగంటి నాసరయ్యగారితో కలసి



స్థాపించి 1965 వరకు నడిపారు. 'క్రాంతి శర్మ'గా ఆయనను ప్రజలు సంబోధించేవారు. 1965లో నటరాజ కళామందిర్ ద్వారా నాటక కళాపరిషత్తును నిర్వహించారు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘ స్థాపకులలో వీరు ముఖ్యులు. ఈ సంఘానికి భవనాన్ని నిర్మించటంలో కృషి చేశారు.

తెనాలి ప్రాంతంలో నాటక, కళారంగాలలో కృషిచేసిన దాదాపు 500 మంది కళాకారుల జీవితాన్నీ కృషినీ 800 పేజీల గ్రంథంగా ఆయన "నూరేళ్ళ తెనాలి రంగస్థలి"ని రూపొందించారు. తెనాలిలో 'రామలింగ కవి కళాక్షేత్రం' ఆడిటోరియం నిర్మాణానికై ఎంతో కృషి చేశారు. చివరివరకూ పలు నాటక కళాసంస్థలకు సలహాదారునిగా వ్యవహరించారు. 2017లో హంస అవార్డు స్వీకరించారు.

## కవి, విమర్శకుడు ఆశావాది ప్రకాశరావు మరణం

కవి, విమర్శకుడు, అనువాదకుడు, పండితుడు, అష్టావధాని ఆశావాది ప్రకాశరావు తన 78వ యేట అనంతపురంలో 17-02-2022న మరణించారు. ఆయన అనంతపురంజిల్లా సింగనమల మండలం, కొరివిపల్లిలో 2-8-1944న జన్మించారు.

బెలుగుప్ప, సిరిపిలలో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వుండి చదువు ప్రారంభించిన ప్రకాశరావు 1953-59లలో అనంతపురం హైస్కూలులోనూ, 60-61లో పియుసి, 1962-65లో బి.ఏ. కళాశాలలోనూ పూర్తిచేశారు. ఏలూరులో కొద్దికాలం గుమాస్తాగా పనిచేసి 1965-68లలో జిల్లా పరిషత్తు స్కూళ్ళలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. 1968-70లలో అనంతపురం పి.జి.సెంటర్‌లో తెలుగు భాషాశాస్త్రంలో ఎం.ఏ. పూర్తిచేశారు. ఆ తర్వాత అధ్యాపకునిగా రాయదుర్గం, అనంతపురం, గుంతకల్లు, నగరి, పుంగనూరులలో పనిచేసి, పెనుగొండలో 2002లో ప్రిన్సిపల్‌గా ఉద్యోగ విరమణ చేశారు.

తెలుగునాట మొదటి దళిత అవధాని ప్రకాశరావు. ఆయన తన మొదటి అవధానం 19వ యేట చేశారు. ఆ తర్వాత 170 అష్టావధానాలు చేశారు. దాదాపు 50 పుస్తకాలు రాశారు. తన గురువు నందూరి రామకృష్ణమాచార్యపై 'నడిచే పద్యం' అనే శీర్షికతో ఒక పుస్తకం రాశారు. ఆకాశవాణిలో ఎన్నో ప్రసంగాలు చేశారు.

వివిధ సంస్థల ద్వారా 40-45 అవార్డులు అందుకున్నారు. డిగ్రీ విద్యార్థిగా బాలకవి అవార్డు అందుకున్న ప్రకాశరావుకు మే 2021లో పద్మశ్రీ అవార్డు లభించింది. ✦

## కొత్తపల్లి వెంకటకృష్ణవర్మ

### 38వ వర్ధంతి



**కొత్తపల్లి** వెంకటకృష్ణవర్మ స్వాతంత్ర్య సమరయోధులు. వారు దక్షిణ భారత హిందీ ప్రచారసభలోనూ, గాంధీ స్మారక నిధిలోనూ పనిచేశారు. వారు తన 77వ ఏట 26-03-1984న మరణించారు. వారి జ్ఞాపకార్థం వారి పిల్లలు 30 వేల రూపాయలు "ప్రజాసాహితి" శాశ్వతనిధికిచ్చారు. వారికి మా కృతజ్ఞతలు. వర్మగారి 38వ వర్ధంతి సందర్భంగా వారిని గుర్తుచేసుకుంటున్నాం. ✦

## శ్రీమతి కొల్లి లక్ష్మీప్రసూన

### 5వ వర్ధంతి



**శ్రీమతి** కొల్లి (తుమ్మల) లక్ష్మీప్రసూన 26-11-1954లో తెనాలి తాలూకా కూచిపూడిలో జన్మించారు. నగరంలోని వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో బి.కాం. చదివారు. గుండెపోటుతో 12-03-2017లో తెనాలిలో తన 63వ ఏట మరణించారు. వారి రెండవ వర్ధంతి సందర్భంగా భర్త కొల్లి రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ ఎ.సి.టి.వో. 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 25,000 రూపాయలు విరాళంగా ఇచ్చారు. లక్ష్మీప్రసూనగారిని వారి 5వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం. ✦

సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు

# గ్రీసు దేశ సంగీతకారుడు, స్వరకర్త, గీత రచయిత, రాజకీయ నాయకుడు మికిస్ థియోడోరాకిస్ (Mikis Theodorakis) మరణం

**గ్రీకు** భాషలో 24 గ్రంథాలు, ఆరు గీతాలు, అసంఖ్యాకమైన ప్రసిద్ధ కవుల గీతాలకు స్వరకర్త, లెనిన్ శాంతి బహుమతి గ్రహీత అయిన మికిస్ థియోడోరాకిస్ 2-9-2021న ఏథెన్స్‌లో తన 96వ యేట మరణించారు. ఆయన 29-7-1925న ఏథెన్స్‌లో జన్మించారు.

గ్రీసుదేశపు వాసి మికిస్ థియోడోరాకిస్ కళల ప్రయోజనం కేవలం వ్యక్తిగతమైన మానసిక ఆనందమే, కళ కళకోసమే అని వాదించేవారిని ధిక్కరించాడు. వాగ్గేయకారుడు, స్వరకర్త అయిన ఆయన సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రజాప్రయోజన గీతాలకు, నియంతల పాలనను వ్యతిరేకించే కచేరీలకు విస్తరింపచేసి లక్షలాది శ్రోతలను అలరింపచేశాడు. అదే సమయంలో రాజకీయాలలో ప్రవేశించి ప్రజాస్వామిక, వామపక్షవాదులతో కలసి సైనిక పాలనను, నియంతలను ఎన్నో నిర్బంధాలనూ ఎదుర్కొంటూ ప్రవాస జీవితాన్ని గడిపారు.

చిన్ననాటినుండీ గ్రీకు జానపద సంగీతంతో ఆకర్షితుడైన మికిస్, సంగీతం నేర్చుకొని తన 17వ యేటనే మొదటి కచేరి ఇచ్చారు. 1943-1950ల మధ్య విద్యాభ్యాసం పూర్తిచేసుకొని, క్రెటి వెళ్ళి అక్కడ భానియా మ్యూజిక్ స్కూలు అధిపతిగా చేరారు. అక్కడే తన మొదటి సంగీత బృందాన్ని ఏర్పరచాడు.

1953లో వివాహానంతరం, దంపతులిద్దరూ కలిసి పారిస్‌లో సంగీత విశ్లేషణా అధ్యయన కోర్సులో చేరారు. 1957లో మాస్కో సంగీతోత్సవంలో స్వర్ణపతకం అందుకున్నారు. 1960లో గ్రీసుకు తిరిగి వచ్చాడు. గ్రీసు పోగొట్టుకున్న సాంస్కృతిక వైభవాన్ని పునరుజ్జీవింపచేయడం కోసం కృషిచేశాడు. మే 1963లో ప్రజాస్వామికవాది గ్రిగోరిస్ లంబ్రాకిస్ హత్యచేయబడగా, మికిస్ ఆయన పేరుమీద 'లంబ్రాకిస్ డెమొక్రటిక్ యూత్' సంస్థను స్థాపించి, దాని అధ్యక్షునిగా గ్రీసులో విస్తృతంగా సాంస్కృతిక వికాస ఉద్యమాన్ని నిర్మించారు. ఆ తర్వాత అది 50 వేలమంది సభ్యులున్న రాజకీయ సంస్థ రూపం తీసుకుంది. 1964లో వామపక్ష పార్టీ (EDA-United Democratic Left) తరఫున గ్రీకు పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. మిలటరీ జుంటా పాలనా (1967-74) కాలానికి ముందు ఈ పార్టీ గ్రీసులో చాలా చురుకుగా పనిచేసింది.

బ్రిటీషువారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మికిస్ ఒక సైనిక దళానికి నాయకునిగా పనిచేశాడు. గ్రీకు అంతర్యుద్ధంలో అరెస్టయి, ఇకారియా ద్వీపంలో ప్రవాస శిక్ష అనుభవించాడు. ఆయన్ను అక్కడ నుండి మక్రోనిసోస్ ద్వీపానికి బదిలీ చేసి అక్కడ చిత్రహింసలు పెట్టారు. రెండుసార్లు ఆయన్ని సజీవంగా ఖననం చేయడానికి ప్రయత్నించారు.

21 ఏప్రిల్ 1967లో గ్రీకులో అధికారం చేజిక్కించుకున్న జుంటా మిలటరీ పాలనను ప్రతిఘటించాడు. అజ్ఞాతంలోకి వెళ్ళి 23 ఏప్రిల్ నాడు సైనిక పాలనపై ప్రతిఘటనా పిలుపు ఇచ్చాడు. 'దేశభక్తి మండలి' (Patriotic Front - PAM) స్థాపించారు. జూన్ 1న జుంటా ఆర్మీ డిక్రీ 13 ద్వారా ఆయన సంగీతాన్ని, గీతాల్ని ఉపయోగించడం, వినడం నిషేధించింది. సాంస్కృతికంగా ఆయన పేరు 'నల్లజాబితా' (black list)లో పెట్టి, గేయాలు సెన్సార్ చేశారు. రేడియోలో నిషేధించారు.

1967 అగస్టు 1న మిలటరీ ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి ఐదు నెలలు జైలుశిక్ష విధించింది. జనవరి 1968లో విడుదల చేసింది. ఆ తర్వాత ఆయన్ను భార్యతో సహా జటేనా గ్రామానికి పంపించారు. అక్కడి నుండి మార్చుగ్రీసు ప్రాంతపు ఒరోపోస్‌లోని కాన్‌సెంట్రేషన్ క్యాంప్‌లో నిర్బంధించారు. పారిస్‌లో ప్రవాస జీవితానికి అనుమతిరాగా, 13 ఏప్రిల్ 1970లో రహస్యంగా అక్కడకు వెళ్ళారు. క్షయవ్యాధితో అక్కడ హాస్పిటల్లో చేరారు.

1971లో అల్లెండీ ఆహ్వానంపై చిలీ సందర్శించారు. 1974 జులై 24న మిలటరీ ప్రభుత్వ పతనం తర్వాత ఆయన కుటుంబంతో సహా గ్రీసుకు తిరిగి వచ్చారు. ఆయన రాకను వేలాది ప్రజలు వీధుల్లో గుంపులు గుంపులుగా గుమిగూడి ఆహ్వానించారు. రేడియోలో ఆయన సంగీతం, గీతాలు మారుమ్రోగాయి.

మెలినా మెర్కారి (మరయా అమారియా) అనే నటి, గాయని, సోషలిస్టు కార్యకర్త, రాజకీయవేత్తతో కలసి మికిస్, గ్రీకు నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడారు. వీరిద్దరూ నియంతృత్వ ప్రతిఘటనా ప్రతీకలుగా నిల్చారు.

1978లో "ఐక్య వామపక్షం కోసం" అనే వ్యాసం రాసి గతంలో ఐక్య వామపక్ష సంఘటనలో వున్న మూడు పార్టీలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రతిపాదనకు గ్రీకు కమ్యూనిస్టు పార్టీ అంగీకరించింది. 1978 ఎన్నికల్లో ఆయనను ఏథెన్స్ మేయర్‌గా పోటీచేయమని ప్రతిపాదించింది. ఆయన 1981-86; 1989-1993 మధ్య పార్లమెంటుకు పలుసార్లు ఎన్నికయ్యారు. 1990-92లో మిట్సోటకిస్ ప్రభుత్వంలో మంత్రిగా వున్నారు. గ్రీకు పార్లమెంటుకు రాజీనామా చేసిన తర్వాత కాయర్ (Choir)కు హెల్లినిక్ స్టేట్ రేడియోకు డైరెక్టరుగా పనిచేశారు.

మికిస్ తన సంగీత కచేరీలతో, గీతాలతో మానవహక్కులు, పర్యావరణ సమస్యలు, శాంతిసాధన మొదలగు అభ్యుదయ భావాలను ప్రచారం చేశారు. టర్కిష్ రచయిత, సంగీతకారుడు, గాయకుడు, చలనచిత్ర నిర్మాత జుల్ఫ్ రివానెలితో కలిసి గ్రీసు – టర్కిష్ మిత్రమండలిని స్థాపించారు.

1981 తర్వాత ఆయన సంగీత ప్రపంచంలో నాల్గవ దశ – సింఫనీ సంగీతంతో ప్రారంభమైంది. 2,3,4,7 సింఫనీలను కూర్చారు. వీటిని మొదటగా జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్‌లో 1982–89 మధ్య వినిపించారు. ఈ సమయంలోనే ఆయనకు లెనిన్ శాంతి బహుమతి లభించింది. ఈ కాలంలోనే 'ది వేస్ ఆఫ్ ది ఆర్కేంజిల్' (The ways of the Archangel) పేరుతో ఐదు సంపుటాల స్వీయచరిత్రను రాసి ప్రచురించారు. ఈ దశలోనే 1989లో మూడు ఒపేరాలు (విషాద గీతికలతో) తయారుచేసి ఏథెన్స్‌లో ప్రదర్శించారు. మార్చి 1997లో బెర్లిన్‌లో ఆఖరి కచేరీ చేశారు.

2019 ఫిబ్రవరి 26న గుండెకు సంబంధించిన వ్యాధి రాగా పేస్ మేకర్ అమర్చారు. 2021 సెప్టెంబరు 2న తన 96వ యేట ఏథెన్స్‌లో మరణించగా గ్రీకు ప్రధానమంత్రి దేశంలో మూడురోజుల పాటు జాతీయ సంతాప దినాలుగా ప్రకటించాడు.

**మికిస్ ప్రగతిశీల దృక్పథం :**

మికిస్ యుద్ధాల్ని, సామ్రాజ్యవాదాన్ని నిరసించాడు. దానిలో భాగంగానే 1999లో నాటో చేసిన కొసోవా యుద్ధాన్ని, 2003లో ఇరాక్ యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గాజాను ఇజ్రేల్ ఆక్రమించడం అన్యాయమన్నారు. లెబనాన్, గాజాలో యుద్ధ నేరాలతో కళంకితుడైన ఇజ్రేలీ ప్రధాని నెతన్యాహుతో, గ్రీకు ప్రధాని పాపండ్రియో పెట్టుకున్న సన్నిహిత సంబంధాలను ఖండించాడు.

జియోనిజాన్ని బాగా ఎండగట్టారు. ఇరాక్‌పై దాడిచేసిన అమెరికన్లను "మిక్కిలి అసహ్యకరమైన, క్రూరమైన పిరికిపందలు, ప్రపంచ ప్రజల హంతకులు" అని నిరసించారు. 'ఈ చెడుకంతా ఇజ్రేల్ మూలకారణం, యూదులు ఈ చెడుకు మూలకారణం' అన్న ఆయన వ్యాఖ్యపై విమర్శలు రాగా, ఆ వ్యాఖ్య కేవలం ఇజ్రేలీ, అమెరికా ప్రభుత్వ విధానాలకు మాత్రమే సంబంధించినవని వివరణ ఇచ్చారు.

1991–2001లలో యుగోస్లావియా యుద్ధాలలో నాటో యుగోస్లావియాపై చేసిన బాంబు దాడులకు వ్యతిరేకంగా, ఆ సైనికుల సహాయార్థం 1999లో జరిగిన సంగీత కచేరీలో పాల్గొని తన సంఘీభావాన్ని ప్రకటించారు. 2010 డిసెంబరు 1న రాజకీయ పక్షాలకతీతంగా, ప్రజలు తమ రాజకీయ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పే వేదిక "ప్రజల స్వేచ్ఛా ఉద్యమం" (SPITHA) ప్రారంభించారు. గ్రీసు ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలని ఈ వేదిక ఆకాంక్ష.

2011 మే 31న ఏథెన్స్‌లో 10 వేలమంది శ్రోతల సమక్షంలో ఐఎంఎఫ్ నుండి అప్పు తీసుకున్నందుకు గ్రీకు ప్రభుత్వాన్ని కడిగిపారేశాడు. ✦

# ఇరాకీ రచయిత, కవి, పాత్రికేయుడు, ప్రచురణకర్త, రాజకీయ కార్యకర్త సాదీ యూసఫ్ మరణం

**1934లో** సాదీ యూసఫ్ ఒక పేద కుటుంబంలో పుట్టడానికి రెండేళ్ళ ముందు 1932లో ఇరాక్, ఇంగ్లాండు నుండి స్వాతంత్ర్యం సాధించింది. అప్పటివరకు భూస్వాముల సహకారంతో బ్రిటీష్ రాజవంశీకుల సమర్థకులు దేశాన్ని పరిపాలించారు. పేదల ప్రజాదరణ పొందని పాలన వారిది. 1934లో ఇరాకీ కమ్యూనిస్టు పార్టీ (ICP) స్థాపించబడింది. 1940లో పలువురు రచయితలు ఈ పార్టీలో చేరారు. సాదీ కూడా తన ఆరంభ యౌవనంలో కమ్యూనిస్టు పార్టీలో చేరి చనిపోయేవరకు పార్టీలో కొనసాగాడు. 2003లో ఇంగ్లాండ్, అమెరికా దేశాలు ఇరాక్‌పై చేసిన దాడికి ఆగ్రహించాడు. ఆ దాడి ఆయనను ఎంతో గాయపరచింది. ఈ దాడిని వ్యతిరేకించిన ఇరాక్ కమ్యూనిస్టు పార్టీ, 2003 జులైలో అమెరికా నియమించిన గవర్నింగ్ కౌన్సిల్‌లో చేరి 'న్యూ' ఇరాక్ పాలనలో పాలుపంచుకోవడాన్ని నిరసిస్తూ – తనను తాను ఇరాక్‌లో వున్న 'ఆఖరి కమ్యూనిస్టు'గా చెప్పుకున్నాడు.

సాదీ కవితలు 30 సంపుటాలుగా వెలువడ్డాయి. 7 సంపుటాలు వచన రచనలుగా వున్నాయి. ఆయన బాగ్దాద్‌లో అరబిక్ సాహిత్యం అధ్యయనం చేసేటప్పుడు సోషలిస్టు భావజాలంతో ప్రభావితుడయ్యాడు. ప్రభుత్వ వ్యతిరేక రచనలు రాసినందుకు ఎన్నోసార్లు జైలుశిక్షలు అనుభవించాడు. 1957లో కారాగారవాసం తర్వాత ఇరాక్ వదలివెళ్ళి, 1958లో ఇరాక్‌లో రిపబ్లికన్ అభ్యుదయ ప్రభుత్వం హయాంలో తిరిగి వచ్చాడు. 1963లో బాత్‌పార్టీ ఆకస్మిక తిరుగుబాటు ద్వారా అధికారం చేబట్టి కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా భయంకరంగా ప్రచారం చేసి కమ్యూనిస్టులను జైళ్ళలోకి నెట్టింది – మరణశిక్షలు విధించింది. ఈ సమయంలో సాదీ దేశం విడచి వెళ్ళిపోయాడు. అప్పుడే కొత్తగా స్వాతంత్ర్యం సాధించిన అల్జీరియాలో స్థిరపడ్డాడు. అక్కడ 1971 వరకు ఉపాధ్యాయునిగా పనిచేశాడు. 1973లో పాలక బాత్ పార్టీతో ఇరాక్ కమ్యూనిస్టు పార్టీ సఖ్యతగా వుండటంతో ఇరాక్‌కు తిరిగి వచ్చాడు. 1979లో మరల కమ్యూనిస్టులపై క్రూర నిర్బంధ కాలంలో బాత్ పార్టీలో చేరడానికి నిరాకరించి ఇరాక్‌ను వదలివెళ్ళి, ఆ తర్వాత ఇరాక్‌కు తిరిగి రాలేదు. ఆయన ఈ ప్రవాస జీవితాన్ని కువైట్, అల్జీరియా, టునీసియా, సైప్రెస్, యుగోస్లావియా, లెబనాన్, యెమెన్,

ఫ్రాన్స్, గ్రీస్, జోర్డాన్, సిరియాలలో గడిపారు. 2000 నుండి లండన్‌లో రాజకీయ శరణార్థిగా చనిపోయేవరకు వున్నారు.

ఆయన సద్దాం నియంతృత్వానికి వ్యతిరేకంగా రాశారు. దక్షిణ యెమెన్‌లో వున్నప్పుడు అక్కడ జరిగిన అంతర్యుద్ధంలో సోషలిస్టు ప్రచారం చేసినందుకు ఆ దేశం వదలివెళ్ళాల్సి వచ్చింది.

అరబ్బీ సాహిత్యంలో వచన పద్య ఉద్యమాన్ని సాదీ ముందుకు తీసుకువెళ్ళాడు. ఆయన మొదటి కవితాసంపుటి 1952లో విడుదలైంది. మన శ్రీశ్రీలాగా ఆకాశమార్గాన విహరిస్తున్న కవితా విహంగాన్ని భూమార్గం పట్టించారు. రోజువారీ కూలీ చేసుకునే బీదా బిక్కీ జనాల గురించి తన కవిత్వంలో రాశారు. చాలా తేలిక భాష వాడారు. ప్రజలందరూ మాట్లాడుకునే పదాలతో కవితలల్లారు.

ఇంగ్లీషు నుండి అరబ్బీలోకి వాల్ట్ విట్మన్, గార్షియా లోర్కా కవితలు, నైపాల్ రాసిన నవలలు, డేవిడ్ మలౌఫ్, గూగీవా థియాంగో, వోలె సోయింకా రచనలు అనువదించారు.

కుర్దిస్తాన్‌ను ఒక కవితలో ఖర్దిస్తాన్ అంటే కోతులస్థాన్ అని రాసినందుకు ఆయన కవితలను 2014లో కుర్దిస్తాన్ పాఠశాల పాఠ్యగ్రంథాల నుంచి తొలగించి, నిషేధించారు.

లండన్‌లో స్థిరపడిన ఆయనకు ఏప్రిల్ 2021లో కేన్సర్ వచ్చినట్లు తెలుసుకున్న ఇరాకీ సాంస్కృతిక శాఖామంత్రి, ఆయనకు ప్రభుత్వం తరఫున సాయమందిస్తామని చెప్పినపుడు, ఆ ప్రతిపాదనను ఆయన తిరస్కరించారు. లండన్ దగ్గర హేర్ ఫీల్డ్‌లో స్థిరపడిన సాదీ యూసఫ్ తన చివరి 20 యేండ్ల కాలంలో కవిత్వం విరివిగా రాశారు.

ఆయన 13 జూన్ 2021న మరణించారు. ✦

# నల్లజాతి స్త్రీవాద ఉద్యమకారిణి బెల్ హుక్స్ మరణం

**రచయిత్రి,** కవి, అధ్యాపకురాలు ఐన ఆఫ్రో అమెరికన్ స్త్రీవాద ఉద్యమకారిణి బెల్ హుక్స్ తన 69వ యేట 15-12-2021న మరణించారు. ఆమె 25-9-1952న తెల్లవారి నుండి వేరుగా వుంచబడిన కెంటకీ రాష్ట్రంలోని హాప్కిన్స్‌విలీలో జన్మించారు. ఆమె అసలుపేరు గ్లోరియా జీన్ వాట్కిన్స్. తన తల్లి, అమ్మమ్మ పేర్లు కలసి వచ్చేట్లు బెల్ హుక్స్ అనే కలం పేరు పెట్టుకున్నారు. ఇంగ్లీషులో పేర్లు రాసేటపుడు మొదటి అక్షరానికి కేపిటల్ వాడతారు. అయితే తన రచనల ద్వారానే తన వ్యక్తిత్వం తెలియాలి పేరు ద్వారా కాదని ఆమె కాపిటల్ అక్షరం వాడకుండా bell hooks అని రాసుకునేవారు.

ఆమె విద్యాభ్యాసం నల్లజాతివారికి వేరుగా నిర్వహింపబడే పాఠశాలలో కొంతకాలం, ఆ తర్వాత మిశ్రమ పాఠశాలలోనూ సాగింది. స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం - విస్కాన్సిన్ - మాడిసన్ యూనివర్శిటీ నుండి ఇంగ్లీషు సాహిత్యంలో డిగ్రీలు పూర్తిచేశారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు.

ఆమె తన 27వ యేట 1978లో కవితల సంపుటి "అక్కడ మేము విలపించాము" (And there we wept) ప్రచురించారు. 1981లో ఆమె ప్రసిద్ధ రచన "నేను స్త్రీని కాదా? నల్లజాతి స్త్రీలు - స్త్రీవాదం" (Hisn't I a woman? Black Women and Feminism) వెలువరించారు. దీనిలో నల్లజాతి స్త్రీల ప్రతిఘటనా పోరాటాలను, వారనుభవించిన గాయాలను వివరించారు.

బెల్ హుక్స్ తనపై టోనీ మారిసన్, పాలో ఫెయిరో, సొజర్నర్ ట్రూత్, మాల్కమ్ ఎక్స్, మార్టిన్ లూథర్ కింగ్ (జూ) ఎరిక్ ఫ్రాం, జేమ్స్ బాల్డ్విన్‌ల రచనల ప్రభావం వుందని చెప్పారు.

బెరియా, యేల్, ఒబిలిన్ కళాశాలల్లో పనిచేస్తూ, విద్యాబోధనలో పాలో ఫెయిరో సూచనలను అమలుచేశారు. 2010లో తానే బెల్ హుక్స్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించారు.

'స్త్రీవాదమంటే లైంగిక అణచివేతను అంతం చేయడానికి చేసే పోరాటమే' అని నిర్వచించిన బెల్ హుక్స్ నల్లజాతి స్త్రీలకు గొంతునిచ్చారు. స్త్రీవాద ఉద్యమం తెల్లజాతి మధ్యతరగతి, ఉన్నతవర్గ మహిళలకు సంబంధించినదిగా వుంది. అది పేద, శ్వేతజాతేతర స్త్రీల అవసరాలను పట్టించుకోలేదు. బెల్ హుక్స్ కేవలం రచయిత్రిగానే గాక, ఉద్యమకారిణిగా కార్యకర్తగా నల్లజాతి స్త్రీల దయనీయ స్థితికి కారణం జాతి వివక్ష, పితృస్వామికం, పెట్టుబడిదారీ విధానం అని సూటిగా చెప్పారు. అగ్రస్థానంలో వున్న తెల్లజాతివారి పెట్టుబడిదారీ, జాతి వివక్షాయుతమైన పితృస్వామ్యంపై ఆమె యుద్ధాన్ని ప్రకటించారు.

"అమెరికా ఒక సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, పితృస్వామిక సమాజంగా కొనసాగినంతకాలం స్త్రీలెవరూ పెద్ద సంఖ్యలో ఇపుడున్న అధికార స్థానాలలో ప్రవేశించలేరు" అని ఆమె చెప్పారు.

ఆమె 40 గ్రంథాలు రాశారు. 15 భాషల్లోకి అనువాదమయ్యాయి. వాటిలో కొన్ని (1) 'From Margin to Centre', (2) 'Feminism for Everybody', (3) 'All About Love', (4)'Teaching to Transgress'. ✦



కవిత

# ఆకలి మాట్లాడితే...

- సరికొండ నరసింహరాజు

ఆకలి మాట్లాడితే గుక్క పెట్టిన పిల్లాడి ఏడుపుకు
సేపిన తల్లి రొమ్ములా వుంటది.
తల్లి పొదుగుకై పరిగెత్తే లేగదూడ
గంటల శబ్దంలా వుంటది
పిట్టనోటికి ఆహారం అందించే తల్లిపక్షి
అమ్మతనంలా వుంటది
బోయవాడి వేటుకు రాలిపడ్డ
పక్షి రెక్కల చప్పుడులా వుంటది
దేహ సముద్రంలో అలల ఆత్మఘోషలా వుంటది
ఆకలి మాట్లాడితే బిచ్చగాడి సత్తుపళ్ళెంలో
ఎండిన పేగుల అపశ్రుతుల పాటలా వుంటది
కుప్పతొట్టిలో ఎంగిలి విస్తరికై కుక్కలతో కొట్లాడే
అనాథ బాలుడి బతుకుపోరులా వుంటది
దేవాలయాల మెట్లపై భిక్షువర్షీయసీ పద్యంలా వుంటది
భూస్వామ్యం పై తిరగబడ్డ ఎర్రజెండా
కొలిమి మంటలా వుంటది
పేదవాడి కన్నుల్లో రాలే అగ్నివానలా వుంటది
అడవులను అధికార దావానలం దహిస్తుంటే
ఎగసిపడ్డ నెత్తుటి జలపాతంలా వుంటది
పోడుభూముల పోరులా వుంటది
నేర చరితకు నేపథ్య సంగీతంలా వుంటది
ఎగసిపడ్డ కన్నీటి మధనంలా వుంటది
తిరగబడిన అణచివేతలా వుంటది
వెలివాడల ఆత్మగౌరవ హృదయ ఘోషలా వుంటది
వెలయాలి ఆర్తనాదంలా వుంటది
ఆకలి బోనులో బంధించిన సింహగర్జనలా వుంటది
నెర్రెలిచ్చిన నేలలోంచి మొలకెత్తిన పిడికిలిలా వుంటది

★ ★ ★

ఆకలి మాట్లాడితే
భూమి కంపించినట్లుంటది
ఆకాశం ఉరిమినట్టుంటంది
బతుకు క్యాన్వాస్ పై ఎండిన డొక్కల చిత్రంలా వుంటది
పేదరికం దండాలకు ఎక్స్ రేలను వేలాడదీసినట్టుంటది
అంథుడి కన్నీటి పాటలా వుంటది
నేతన్నల, రైతన్నల అనాథ శవాల
మరణ వాంగ్మూలంలా వుంటది

★ ★ ★

ఆకలిదెప్పుడూ విశ్వజనీన భాషే
దుఃఖ లిపిలో బతుకు ఘోషే
ఆకలి బతుకు భాషకు వర్ణమాల లాంటిదే
మనిషి మనుగడ సిలబస్లో ఆకలి కామన్ సబ్జెక్ట్ కదా!
ఆకలి లేకపోతే ఆయువే లేనట్టు
ఆకలి విత్తులు చల్లినప్పుడు
బ్రతుకు ఆశల కొమ్మకు పూచిన ఆశయంలా వుంటది
ఆకలి దీపస్తంభంలా వెలిగినప్పుడు
జీవిత పడవ ప్రయాణానికి అనంత గమ్యం అవుతుంది
ఆకలి మనిషి గమనానికి ఇంధనం లాంటిదే
ఓ దారిదీపమై లక్ష్యంవైపు నడిపిస్తుంది
ఆకలెప్పుడూ ఓ పొద్దుతిరుగుడు పువ్వై
వేకువరాగం పాడుతుంది
ఆకలి ఆది అంతాలు లేని
అనంత కవితావాక్యం అవుతుంది
పుట్టుక నుండి చావు వరకు
కలిసి సహజీవనం సాగించే మన సహచరి కదా
ఆకలి ప్రశ్నకు సరైన సమాధానం ఆకలే అయినట్టు
బతుకు వాకిట్లో నిత్యం ఉదయించే ఓ నిత్య సత్యం
నేడు దేశ ముఖచిత్రం అవినీతి రాక్షస ఆకలికి
అవనతమైన దేశపతాకలా వుంది
నేడు పేదల ఆకలి కేకల మంటల్లో
దగ్ధమౌతూ దైవం
రూపాలు వేరైనా ఆకలి రూపం ఒక్కటే అయినట్టు
భూగోళం ఆకలి సూర్యునిచుట్టూ తిరుగుతూ
నేడు ఆకలి మాట్లాడితే..
రహదారులపై నెత్తురు పులిమే
వలస కూలీల పాదముద్రల్లా వుంది
అలు పెరుగని శ్రామికుల మహాపాదయాత్రలా వుంది.

(2020లో ఎక్స్-రే కవితాపోటీలలో ప్రథమ బహుమతి పొందిన కవిత) ✦




**ప్రేమకు ఆవలితీరం (చలం జీవితాత్మక నవల) : రచన - అంపశయ్య నవీన్**

చలం తెలుగు సాహిత్యంలో ఒక వివాదాస్పద రచయిత. ఆయన స్త్రీ పురుషుల మధ్య కలిగే మోహం, శారీరక వాంఛ గురించి వెలిబుచ్చిన భావాలతో ఏకీభవించేవారు అతితక్కువ కాగా సమాజంలో స్త్రీ పురుష సంబంధాలపట్ల ఆయన ప్రతిపాదించిన సూత్రాలు అభ్యుదయకరమైనవని అంగీకరించేవారు ఎక్కువ. ఆయన రాసిన 'బిడ్డల శిక్షణ', 'స్త్రీ' పుస్తకాలలోని భావాలు అభ్యుదయకరమైనవి. మోహం, ప్రేమపై రాసిన కథలు ఆనాటి (20వ శతాబ్ది రెండవ దశాబ్ది) గిడసబారిన బ్రాహ్మణ సంస్కృతిని ఒక కుదుపు కుదిపాయి. ఇటువంటి రచయిత జీవితాన్ని ఒక నవలగా రాసే సాహసాన్ని అంపశయ్య నవీన్ చేశారు. తెలుగులో ఇలాంటి జీవితాత్మక నవలల్లో ఇదే మొదటిది.

దీనిలో చలం జీవితంలోని కొన్ని ముఖ్యమైన యథార్థ సంఘటనలతోపాటు యథార్థ వ్యక్తులు కనబడతారు. 17వ అధ్యాయంలో 'ఒక చలం అభిమాని చేసిన ఇంటర్వ్యూని పునరుద్ధరించడం బాగుంది. ఆఖరి అధ్యాయమైన 18వ అధ్యాయాన్ని చలం మరణం తర్వాత తెలుగు పత్రికలు ఆయనపై రాసిన సంపాదకీయాలు, ఇస్మాయిల్, రా.రా. బుచ్చిబాబు, ఆర్.ఎస్. సుదర్శనం మొదలగువారి అభిప్రాయాలతో నవలను ముగించారు.

1/8 డెమ్మీలో 10+236 పుటలు. వెల : రూ. 250/- ప్రతులకు : నవోదయ, ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడా క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ - 500027. ప్రచురణ : ప్రత్యూష ప్రచురణలు. వరంగల్. ఫోన్ : 0870-2456458.

**సోవియట్ సాహిత్య భాస్కరులు : రచన - డా॥ యస్. జతిన్‌కుమార్.**

జతిన్ జనసాహితి సంస్థాపక సభ్యులలో ఒకరు. వైద్య విద్యార్థిగా హైదరాబాదులో నవోదయ సంస్థలో క్రియాశీలంగా పనిచేసిన సాంస్కృతిక కార్యకర్త. వైద్యవృత్తిలో స్థిరపడిన జతిన్, కొందరు మిత్రులతో కలసి 2018 జూన్ 1 నుండి 7 వరకు రష్యాలోని మాస్కో సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరాలు చూచి వచ్చారు.

"1991లో అస్తిత్వం కోల్పోయిన సోవియట్ యూనియన్ ఈ ప్రపంచానికొక చారిత్రక మలుపునిచ్చింది. ఒక పాఠం నేర్పింది. విచ్ఛిన్నమై గుణపాఠమూ నేర్పింది" అంటూ యాత్రాకథనాన్ని (ఫొటోలతో సహా) రచయిత ఆ రెండు నగరాలలో వున్న రచయితల విగ్రహాలు, స్మారక మందిరాలు చూసినప్పటి అనుభూతులను పాఠకులతో పంచుకున్నారు. ఆయా నగరాల రాజకీయ ప్రాముఖ్యత, మ్యూజియంలు, ప్రపంచ ప్రఖ్యాతినొందిన థియేటర్లు, రష్యన్ కళాకారుల బ్యాలే ప్రదర్శనలు మొదలగువాటి గురించి వివరిస్తూ సాగింది వీరి లలిత కళాయాత్ర. సోవియట్ యూనియన్ వివిధ రంగాలలో సాధించిన విజయాలను నెమరువేసుకుంటూ, ఆ గత వైభవం నేడు మసకబారిపోవడానికి చరిత్రకారులు, విశ్లేషకులు చెబుతున్న కారణాలను విశ్లేషించుకుంటూ ఈ యాత్ర ముగిసింది.

ఈ యాత్రా విశేషాలకంటే ఈ పుస్తకంలో అత్యంత ప్రాధాన్యత కల్గిన విభాగం 'కొందరు సోవియట్ రచయితలు - జీవనరేఖలు'. ఈ విభాగంలో అలెగ్జాండర్ పుష్కిన్, గోగోల్, టాల్‌స్టాయ్, చెకోవ్, గోర్కీ, మయకోవస్కీలు సాహిత్యాన్ని, వారి జీవితాల్ని జతిన్ పరిచయం చేశారు. ఆయా కాలాలలో వారి సాహిత్య ప్రాముఖ్యతనూ, ప్రముఖ విమర్శకుల అంచనాలు మొదలైన వివరాలన్నీ ఇచ్చారు. కేవలం ఈ రచయితల పేర్లు మాత్రమే విన్న నేటి సాహిత్య విద్యార్థులు ఈ సోవియట్ రచయితల గురించి, వారి కృషి గురించి ఎన్నో వివరాలు ఈ వ్యాసాల ద్వారా తెలుసుకుంటారు. అదీగాక స్వయంగా సాహిత్యకారుడైన జతిన్ తన అనితర సాధ్యమైన శైలిలో రాసిన ఈ వ్యాసాలు నేటితరం వారిని ఆకర్షిస్తాయి.

ఇవిగాక 'అమ్మ' నవల విశిష్టత తెలియచేస్తూ ఒక వ్యాసం, చెహోవ్ రాసిన Husband అనే కథకు 'మొగుడు' శీర్షికతో జతిన్ చేసిన అనువాదం, ఐదు పుష్కిన్ కవితలు, ఆరు మయకోవస్కీ కవితలకు జతిన్ అనువాదాలు దీనిలో చేర్చారు.

చివర్లో.... పుస్తకం ఇంకా పూర్తికాలేదు.... అనే శీర్షికతో టాల్‌స్టాయ్ సాహిత్యంపై లెనిన్ అభిప్రాయం, సాహిత్యం గురించి లెనిన్ అభిప్రాయాలు చేర్చారు.

(సోవియట్ సాహిత్య భాస్కరులు. రచన : డాక్టర్ యస్. జతిన్‌కుమార్, 1/8 డెమ్మీ 180 పుటలు. వెల : రూ.156/- నిశాంత్ ప్రచురణలు - ప్రథమముద్రణ : అక్టోబరు 2020. ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు. ఫోన్ : 040-24652387)

**నా కర్తవ్య నిర్వహణలో అనుభవ పరంపర :** అనుభవాలకు అక్షర రూపం. **రచన : పసల భీమన్న.**

ఇది స్వీయ చరిత్రగా ప్రణాళికాబద్ధంగా రాసింది కాదు. ఇది రచయిత జీవితంలోని అనుభవాల జ్ఞాపకాల పరంపర. 1941లో జన్మించిన భీమన్న వివిధ ప్రభుత్వ కళాశాలల్లో హిందీ అధ్యాపకులుగా పనిచేశారు. రంపచోడవరం ఏజెన్సీ జిల్లా విద్యాశాఖాధికారిగాను, నెల్లూరుజిల్లా విద్యాశాఖాధికారిగాను, నెల్లూరులోని ప్రభుత్వ బి.ఇడి. కళాశాలలో జాయింట్ డైరెక్టర్ కేడర్ ప్రిన్సిపల్‌గా పనిచేసి 1999లో రిటైరయ్యారు. ఉద్యోగం చేస్తూనే, కష్ట నష్టాలను భరిస్తూ, హేతువాద ఉద్యమంలోనూ, జనవిజ్ఞానవేదికలోనూ, లోక్‌సత్తా ఉద్యమంలోనూ పనిచేశారు. పది హేతువాద గ్రంథాలు రచించారు. మేజిక్ నేర్చుకొని 2006లో రాజమండ్రిలో గోదావరి మ్యాజిక్ స్కూలు స్థాపించి పలువురికి ఇంద్రజాలం నేర్పారు. సాంఘిక వ్యత్యాసాలూ, ఆర్థిక అసమానతలూ, కులభేదాలు లేని సోషలిస్టు భారతదేశం చూడాలని వీరి కోరిక.



ఈ ఆశయాలు కల్గిన భీమన్న తన వివాహానికి ముందు, వివాహం తర్వాత కుటుంబ జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, ఉద్యోగ జీవితంలోని సంఘటనలు – వాటికి తన ప్రతిస్పందనలు, రంపచోడవరం ఏజెన్సీలో నక్సలైట్లు తనను చెరబట్టడం – నక్సలైట్లతో వాదోపవాదాలతో మూడు రోజుల అనుభవాలు – ఇలా బాల్యం నుండి ఈనాటివరకు 95 వ్యాసాలలో తెలియచేశారు.

సంభాషణా చతురుడైన భీమన్న తన వ్యాసాలలో కూడా అదే శైలి ఉపయోగించడం వల్ల పాఠకులు ఒక్క బిగిలో అన్నీ చదివేయగలరు.

(నా కర్తవ్య నిర్వహణలో అనుభవ పరంపర : రచన : పసల భీమన్న. 1/8 డెమ్మీ 160 పుటలు. వెల : రూ.116/– మొదటిముద్రణ : 2019. ప్రచురణ, ప్రతులకు : జి. మాల్యాద్రి, జనవిజ్ఞానవేదిక, 162, విజయలక్ష్మీనగర్, నెల్లూరు – 524004. ఫోన్ : 94405 03061. పసల భీమన్న – ఫోన్ : 94901 23276)

**ఇందుకే.... ఇలా వున్నాం! : రచన : చార్వాక రామకృష్ణ.**

తన 68వ యేట 18 ఏప్రిల్ 2007లో మరణించిన బి. రామకృష్ణ తన జీవితకాలమంతా దేశీయ భౌతికవాదులైన చార్వాకుల, లోకాయతుల ఆలోచనాధారను తెలుగువారికి పరిచయం చేశారు. చార్వాక విద్యాపీఠాన్ని స్థాపించారు. ఐదవ తరగతివరకు శాస్త్రీయమైన తెలుగు వాచకాలు రచించి ప్రచురించారు. ప్రతి ఏడాదీ ఫిబ్రవరి రెండవ శనివారం, ఆదివారం రెండురోజులపాటు నాస్తికమేళాను ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా రూపొందించారు. ఆయన మరణించిన తర్వాత కూడా నాస్తికమేళా కార్యక్రమం ప్రతి ఏడాదీ ఆయన శిష్యులు, మిత్రులు, అనుచరులు నిర్వహిస్తున్నారు.

దోపిడీ నుండి కష్టజీవుల విముక్తికై కృషిచేసే మార్క్సిజానికి నాస్తికవాదాన్ని తోడు చేశారు. పలు గ్రంథాలు రచించారు. 'ఇందుకే.... ఇలా వున్నాం' వ్యాసాలు మొదటిసారిగా పుస్తకరూపంలో వెలువడుతున్నాయి. భౌతికవాదులుగా ప్రకటించుకుంటూ ఆచరణలో దానికి భిన్నంగా వున్న మిత్రులను హెచ్చరిస్తూ రాసిన వ్యాసాలివి. అన్నీ వాస్తవంగా జరిగినవే. అయితే పేర్లు మాత్రం వెల్లడించలేదు. ఇవి చదివి భౌతికవాదులు ఆచరణ సరిదిద్దుకుంటారని నమ్ముతూ రామకృష్ణ వీటిని రాశారు.

1/8 డెమ్మీ 36 పుటలు. వెల : రూ.30/– ప్రథమముద్రణ : ఏప్రిల్ 2021. ప్రతులకు : చార్వాకాశ్రమం, నిడమర్రు పోస్టు, వయా మంగళగిరి. గుంటూరుజిల్లా – 522503. ఫోన్ : 92906 19550.

శ్రీశ్రీ సాహిత్యాన్నీ, శ్రీశ్రీపై సాహిత్యాన్నీ ప్రచురిస్తున్న రెండో నూరు పుస్తకాల హోరు ప్రణాళికలో 109 నుండి 118 వరకు జనవరి 2022లో ప్రచురించిన 10 పుస్తకాలు మా కార్యాలయానికి అందాయి. వాటి గురించి క్లుప్త పరిచయాలు :

**(109) కవితా ప్రయోజనం :** మేనమామ, మేనల్లుళ్ళుగా వున్న శ్రీశ్రీ, ఆరుద్రల 12 పుటల జంట కవిత్వం ఇది. వారిద్దరి కవితాత్మక సంభాషణే. 'విశాలాంధ్ర'లో కవితా ప్రయోజనం శీర్షికతో అచ్చు అయింది. ఆ తర్వాత ఆరుద్ర తన 'సినీవాలి' కావ్యంలో 'సాహిత్యోపనిషత్' శీర్షికగా ప్రచురించారు. ఇదికాక ఆరుద్రతో కలిసి శ్రీశ్రీ రాసిన మరో ఐదు కవితలు దీనిలో వున్నాయి. శ్రీశ్రీ, ఆరుద్రలను చిత్రించిన బాపు చిత్రం ముఖచిత్రంగా వున్న ఈ పుస్తకాల పుటలు 32. వెల : రూ.40/–

**(110) ఆంధ్రీ కథనం :** ఇంగ్లీషు నుంచి తెలుగులోకి శ్రీశ్రీ అనువదించిన 14 పాశ్చాత్య రచయితల 29 కథల సంపుటి. వీటిలో విలియం సరోయన్ కథలే 13 వున్నాయి. 168 పుటలు. వెల : రూ. 140/–

**(111, 112) శ్రీశ్రీ సూక్తులు – 1&2 భాగాలు :** సాహిత్యానికి సంబంధించి తన వివిధ రచనలలో శ్రీశ్రీ చెప్పినవి ఒక్కొక్క భాగంలో 125 చొప్పున పుటకొక్కటి కూర్చిన సంపుటి. 136 పుటలు. వెల : ఒక్కొక్కటి రూ.125/–.

**(113, 114) శ్రీశ్రీ సూక్తులు – సామాజికం. 1&2 భాగాలు :** శ్రీశ్రీ ఉపన్యాసాలలో, వ్యాసాలలో, ప్ర.జ.లో సమాజానికి సంబంధించి చెప్పిన విషయాలను పుటకొక్కటి చొప్పున 125 సూక్తులు వున్న పుస్తకం. 136 పుటలు. వెల : ఒక్కొక్కటి రూ. 125/–

**(115, 116) శ్రీశ్రీ సూక్తులు – హేతువాదం. 1&2 భాగాలు :** శ్రీశ్రీ హేతువాదంపై వివిధ సందర్భాలలో రాసిన వాటిని పుటకొకటి చొప్పున 125 సూక్తుల సంపుటి. 136 పుటలు. వెల : ఒక్కొక్కటి రూ. 125/–

**(117, 118) శ్రీశ్రీ సూక్తులు : నాటకం, సినిమా – 1&2 భాగాలు :** నాటకాలు, సినిమాలపై శ్రీశ్రీ వ్యాఖ్యలు, శ్రీశ్రీ రచనల నుండి సేకరించి ఒక్కొక్క భాగంలో 125 కూర్చిన సంపుటాలు ఇవి. 136 పుటలు. వెల : ఒక్కొక్కటి రూ. 125/–

ఈ పై ఎనిమిది భాగాలలో వున్న మొత్తం 1000 సూక్తులు ఇలా విడదీసి ఇవ్వడం ద్వారా పాఠకులకు ఆయా విషయాలపై శ్రీశ్రీ అభిప్రాయాలు అన్నీ ఒకేచోట లభ్యమౌతున్నాయి. ఈ విధంగా కూర్పు చేయడంలో సింగంపల్లి అశోక్‌కుమార్ శ్రీశ్రీ రచనలపై సాధికారత సాధించారని చెప్పవచ్చు.

**కంచ ఐలయ్య లొల్లి : వ్యాస సంకలనం.** సంపాదకుడు డా॥ వెన్నిసెట్టి సింగారావు. ఎం.ఏ., పిహెచ్.డి.,

'సామాజిక స్మగ్లర్లు – కోమటోళ్ళు' అనే శీర్షికతో రాసిన పుస్తకంలో కంచ ఐలయ్య, కోమట్లందరినీ స్మగ్లర్లుగా చిత్రీకరించడాన్ని ఖండిస్తూ, వారి వ్యాసంలోని అశాస్త్రీయతను వివరిస్తూ పలువురు రాసిన వ్యాస సంకలనం ఇది. దీనిలో ప్రొఫెసర్ దేవిసేని హైమవతి, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, ప్రొఫెసర్ రామిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, హెబ్బార్ నాగేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, కె. స్వరాజ్యలక్ష్మి, డా॥ జె. కనకదుర్గ, డా॥ పోతురాజు శ్రీనివాసరావు, డా॥ పాకనాటి సూర్య కుమార్తె డా॥ నాగభైరవ ఆదినారాయణ, వై. హెచ్.కె. మోహనరావు, చెట్టి సుబ్రహ్మణ్యంగార్లు రాసిన 15 వ్యాసాలున్నాయి.

1/8 డెమ్మీలో 136 పుటలు. వెల : రూ.30/– మొదటిముద్రణ : 2021. ప్రచురణ : డా॥ వి. సింగారావు, 13–07–367 కృష్ణనగర్, 6వ లైను, పార్క్‌రోడ్, గుంటూరు – 522006. సెల్ : 93930 15584. ✦

(ఇంకా వున్నాయి) ✦

కవిత

# ఏదీ మీ పోరాట చేవ?

ఇంగ్లీషు : అదితి మునాత్

తెలుగు : కొత్తపల్లి రవిబాబు



మీ కళ్ళకు విందుగా కాకుండా
వీధుల్లో నన్ను నడవనీయండి!

నా చొక్కావైపు తిరస్కారంగా చూడకు
నా పరికిణీ పొడవును పరీక్షించకు!

నా గుండ్రటి రొమ్ములు, నా బిగువైన పిర్రలు
ఇవేవీ నీ ఆనందం కోసం మాత్రం కాదు!

బురఖాకానీ, జీన్స్‌కానీ, ఏదైనా అవి నా ఫాషన్!
నేనెందుకు పదిలంగా వుండాలి దుస్తుల విషయంలో!

నేను శిశువునో, బాలికనో, స్త్రీనో కావచ్చు!
కళ్ళార్పకుండా చూడకు!
అలా నాపై దాడి చేయడానికి ఎంత ధైర్యం నీకు!!

నేను నీ తల్లిని, భార్యను, కూతుర్ని, సోదరిని
నన్ను ఇలా పాడు చేయడానికి -
ధైర్యం ఎలా కూడగట్టుకుంటావు?

ఈ పతనావస్థకు నన్నెలా దిగజార్చగల్గావు?
నీ వినియోగ వస్తువును కాను నేను!

నీవు దోచుకోడానికి కాదు నా శరీరమూ, నా ఆత్మ
అందర్ ఆధారంగా వివక్ష చూపిస్తావెందుకు?

నీవు నన్ను నాశనం చేసిన తర్వాత నన్ను నేను నిందించుకుంటూ
భయం భయంగా అవమానంతో గడపాలి జీవితమంతా

అధికారంతో అంత మత్తెక్కి పోయావెందుకు?
ఎలా నాపై చిత్రహింస ప్రయోగించావు?

నా 'పవిత్రత'పై ఇలా పిడుగులా పడ్డావు
నీవసలు మనిషివేనా అని నాకాశ్చర్యం!

మిగిలిన మీరందరూ నిశ్చేష్టులై చూస్తున్నారు కానీ
ఎవరూ నా కోసం నిలబడే ధైర్యం చేయరే!

మీకెవరికీ పోరాట చేవ లేదు
ఛీ! రాత్రుళ్ళు ఎలా నిద్రపోతారు మీరు!

కవిత

# స్టాన్ స్వామీ....

- నిమ్మకాయల శ్రీరంగనాథ్



**నువ్వు** లేవన్నారు
మరి కనిపించవన్నారు
నేను నమ్మలేదు
నువ్వే వచ్చి చెప్పినా నమ్మను
'మో'షాల ఇనుప చువ్వల్లోంచి
స్వేచ్ఛా విహంగంలా ఎగిరిపోయావ్
బూటకపు ప్రజాస్వామ్యం మీదా (అ) న్యాయ వ్యవస్థపైనా
ఉమ్మేసి మరీ ఎగిరిపోయావ్
ఇది నమ్ముతాను
కనిపించవు. వినిపించవంటే
నమ్మను గాక నమ్మను
చిరునవ్వుతో గరళం మ్రింగిన సోక్రటీస్ లేడంటామా!
శిలువనెక్కిన జీసస్ లేడా!
స్పార్టకస్ అణగారిన గుండెల్లో చిరంజీవి కాదా!
విల్లంబులు పట్టని అల్లూరివి
ఉరికంబమెక్కని భగత్‌సింగ్‌వి
నువ్వు లేవంటే, ఇక రావంటే ఎలా నమ్ముతాను?
జార్ఖండ్ ఆదివాసీ గూడేలను తట్టి లేపే
పక్షుల కిలకిలారావాల్లో నీ స్వరాన్ని వింటూనే ఉంటాం
వాళ్ళ బతుకు పోరాటంలో వెలుగు దివ్వెవు నీవు కాదా!
కార్పొరేట్ స్వామ్యానికి ఎండలో గొడుగు కాళ్లకు చెప్పయిన
రాజ్యంపై పోరులో ముందు నువ్వే కనిపిస్తావ్
చిక్కి శల్యమైన నీ వైపు భయంగా చూసే
బెదురు చూపుల్లో నువ్వు కనబడతావు.
ఫాసిస్ట్ కారుమేఘాలు కమ్ముకున్నవేళ
ఆక్సిజన్ కోసం చేసే ఆక్రందనలో నువ్వున్నావు.
బ్రతికే హక్కు కోసం సాగే పోరాటంలో నువ్వున్నావ్
స్వేచ్ఛ కోసం నినదించే కోట్లాది గొంతుల్లో నువ్వున్నావ్
బిగించిన పిడికిళ్లలో నువ్వున్నావ్
నువ్వున్నావ్... ఉన్నావ్.. ఎప్పటికీ ఉంటావ్.

(శ్రీరంగనాథ్ రాసిన ఆఖరి కవిత)

PRAJA SAAHITI February & March 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. VJ/030/2021-2023
No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

కవిత

# అనశ్వర పరమేశ్వరం

- రవి



సమరశీల ఉపాధ్యాయ
ఉద్యమాల ప్రతిరూపం
పోరుజెండ పరమేశ్వర
మాస్టారుకు వందనం

'హక్కులకై కలబడు
బాధ్యతలకు నిలబడు'
చెన్నుపాటి సింగరాజు
మాణిక్యాంబల ఘన వారసత్వం

పాదవుకున్న ఆరుపదుల
తలపండిన అనుభవం
అతిశయం దరిచేరని
అరుదైన వినమ్ర నైజం

ఆశయాల సాధనకు
అసమాన అంకితభావం
ఏపిటిఎఫ్ పతాకమై
సాగిన అనంతయానం

పెడధోరణులెదిరించే
పరిణిత గుణశీలం
అష్టపదుల వయస్సులోనూ
ఇష్టమైన శ్రమతత్వం

క్రమశిక్షణ సమయపాలన
నిరాడంబర నిజాయితీ
అధ్యయనం నిర్మాణం
కలబోత మన 'నూతలపాటి'

కుటుంబ సమస్యలు, అనారోగ్యం
కాలేదేనాడూ ప్రతిబంధకం
ఉద్యమ'జ్యోతి'ని రగిలించే
నీదు స్ఫూర్తి నిత్య సందేశం

మనసునిండా మరో ప్రపంచ
ఉన్నత సిద్ధాంత లక్ష్యం
సామ్యవాద స్వప్నాల సాకారానికి
సాటిలేని నిశ్శబ్ద సహకారం

ఉద్యమావసరాన్ని
అందుకున్న నిబద్ధ గుణం
'కత్తిమీద సాము'లో
ముందుతరాలకు మార్గదర్శనం

ఉద్యమపరమైన
'పరమేశ్వర' స్వరం
పరమై చరితలో
నిలిచిపోవు అనశ్వరం

సమరశీల ఉపాధ్యాయ
ఉద్యమాల ప్రతిరూపం
పోరుజెండ పరమేశ్వర
మాస్టారుకు వందనం

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI